www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

గంటకు 450 కి.మీ. వేగం 2
సరికొత్త బుల్లెట్ రైలును పరీక్షించిన చైనా
సీఆర్ 450గా పేరు.. త్వరలో అందుబాటులోకి



సోమవారం | 30-12-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) :22 సంచిక (Issue) : 272 | వరంగల్

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, మార్గశిరమాసం, బహుళపక్షం, తిథి: అమావాస్య తె. 3.57 తదుపరి పాడ్యమి; నక్షత్రం: మూల రా. 11.57 తదుపరి పూర్వాషాఢ; వర్జ్యం: ఉ.7.33-9.12, రా.10.18-11.57; దుర్ముహూర్తం: మ.12.39-1.23, మ.2.51-3.35; అమృతఘడియలు: సా.5.23-7.02; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.48; సూర్యాస్తమయం: 5.47

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రన్‌వేపై దూసుకెళ్లి.. రక్షణ గోడను ఢీకొట్టి..



ముయాన్ విమానాశ్రయంలో కుప్పకూలిన విమానం వద్ద రక్షణ చర్యలు

- పేలిపోయిన విమానం.. 179 మంది దుర్మరణం
- దక్షిణ కొరియాలో ఘోరం.. బతికింది ఇద్దరే 2
- బ్యాంకాక్ నుంచి ముయాన్ వచ్చిన 'జెజు' విమానం
- ల్యాండింగ్ గేర్ విఫలమవడంతోనే ప్రమాదం!
- పక్షి ఢీకొట్టడంతోనే విఫలమైందన్న అనుమానాలు
- మరో రెండు విమానాలకు తప్పిన ప్రమాదం
- ఎయిర్ కెనడాలో మంటలు.. నార్వేలో మరో ఘటన

తరం మారనన్నది!

భారత్ వద్ద ప్రస్తుతం 4వ తరం యుద్ధ విమానాలే



చైనా ప్రదర్శించిన జే-36 ఫైటర్ జెట్

- చైనా వద్ద ఇప్పటికే ఐదో తరం ఫైటర్ జెట్లు.. 300
- ఆరో తరం ఫైటర్ జెట్‌నూ ప్రదర్శించిన డ్రాగన్ దేశం
- రెండేళ్లలో చైనా నుంచి 40 జే-35 ఫైటర్ జెట్లు
- కొనుగోలు చేయడానికి ఒప్పందం కుదుర్చుకున్న పాక్
- ఆ తరహా ఫైటర్ జెట్ల తయారీకి భారత్ 'ఏఎంసీఏ' ప్రాజెక్ట్
- 2034లో మనకు అందుబాటులోకి వస్తాయని అంచనా!
- తాజా పరిణామాలపై రక్షణ రంగ నిపుణుల ఆందోళన

వాయుశక్తిలో పాకిస్థాన్‌తో పోలిస్తే ప్రస్తుతానికి భారత్‌దే పైచేయి! కానీ.. పాకిస్థాన్ తన వైమానిక దళ శక్తిసామర్థ్యాలను మెరుగుపరుచుకునే దిశగా వేగంగా అడుగులు వేస్తోంది!! అందులో భాగంగా.. రాడార్లకు అందని, సూపర్ క్రూయిజ్ సామర్థ్యం ఉన్న అత్యంత అధునాతన ఐదో తరం యుద్ధవిమానాలను చైనా నుంచి కొనుగోలు చేయడానికి ఇప్పటికే ఒప్పందం కుదుర్చుకున్నట్టు సమాచారం. దాని ప్రకారం.. వచ్చే రెండేళ్లలో పాకిస్థాన్‌కు చైనా నల్లబై 'జే-35' యుద్ధ విమానాలను సరఫరా చేయనుంది. ఇవి చైనా రూపొందించిన ఐదో తరం ఫైటర్ జెట్లు. అమెరికా వద్ద ఉన్న 'ఎఫ్-35 లైట్నింగ్ 2' యుద్ధవిమానాలతో సమానమైన శక్తిసామర్థ్యాలు కలిగినవని సమాచారం. అవి అందుబాటులోకి

మిగతా 2వ పేజీలో...



రైతు భరోసా ఎవరికి?

- సాగు చేసిన మొత్తం విస్తీర్ణానికి ఇద్దామా?
- ఆదాయపు పన్ను చెల్లింపుదారుల సంగతేంటి?
- సింగరేణి, 4వ తరగతి ఉద్యోగులకు ఇవ్వాల్సిందే
- కొండలు, గుట్టలు, రాళ్లు, రప్పలుంటే ఇవ్వొద్దు
- కటాఫ్‌ను ఏ ప్రాతిపదికన నిర్ణయిద్దాం?
- భట్టి ఆధ్వర్యంలో మంత్రివర్గ ఉపసంఘం భేటీ
- మరికొన్ని సార్లు సమావేశం కావాలని నిర్ణయం
- సమగ్ర అధ్యయనం తర్వాతే క్యాబినెట్‌కు సిఫారసు

హైదరాబాద్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కొండలు, గుట్టలు, రాళ్లు, రప్పలున్న భూములను వదిలేసి... సాగు చేస్తున్న భూములకే రైతు భరోసా ఇద్దామా? ఆదాయపు పన్ను చెల్లింపుదారుల్లో ఏయే వర్గాలను మినహాయించాలి? ఎవరికి ఇవ్వాలి? సింగరేణి ఉద్యోగులకు, నాలుగో తరగతి ఉద్యోగులకు ఇవ్వొచ్చా? ఇవ్వకపోతే ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయి? వంటి పలు అంశాలపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం ఆదివారం సుదీర్ఘంగా చర్చించింది. సమావేశంలో తొలుత రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం, ఉపసంఘం పలు అంశాలపై చర్చలను ప్రారంభించింది. గతంలో ఉమ్మడి జిల్లాలవారీగా నిర్వహించిన సదస్సుల్లో వ్యక్తమైన అభిప్రాయాలు, అధికారులు తయారుచేసిన నివేదికలపై చర్చించారు. ఉపసంఘం చేపట్టిన క్షేత్రస్థాయి పర్యటనల్లో

మిగతా 13వ పేజీలో...

బెనిఫిట్ లేదా పుష్పా!



పుష్ప 2 ఎఫెక్ట్‌తో సంక్రాంతి చిత్రాలకు నష్టం తప్పదంటున్న సినీవర్గాలు

- ప్రత్యేక ప్రదర్శనలు, టికెట్ ధరల పెంపు లేకుంటే కష్టమే అంటున్న నిర్మాతలు
- ప్రభుత్వం అనుమతులతో 'పుష్ప-2' జోరు
- ప్రత్యేక ప్రదర్శనలు, అదనపు షోలు, రేట్ల పెంపుతో రూ. 280 కోట్ల అదనపు వసూళ్లు
- సర్కారు నిర్ణయాన్ని మేం స్వాగతిస్తున్నాం
- బెనిఫిట్ షో ప్రభావం మిగతా ఆటలపై పడి కొన్నాళ్లు థియేటర్ మూసేయాల్సిన పరిస్థితి
- ఎగ్జిబిటర్లు, సినిమా హాళ్ల యాజమాన్యాలు

(ఆంధ్రజ్యోతి - సినిమా డెస్క్)

అల్లు అర్జున్ వివాదం నేపథ్యంలో సీఎంను కలిసిన సినీ ప్రముఖులు.. బెనిఫిట్ షోలు, టికెట్ రేట్ల పెంపు గురించే ప్రధానంగా ప్రస్తావించినట్టు సమాచారం! ఎందుకు? అంటే.. సంక్రాంతికి పలు సినిమాలు రాబోతున్నాయి. బెనిఫిట్ షోల ద్వారా ఆ సినిమాలు భారీగా అదనపు కలెక్షన్లు రాబట్టుకునే అవకాశాలున్నాయి. 'పుష్ప-2' సినిమాకు.. బెనిఫిట్ షోలు, అదనపు షోలు, టికెట్ రేట్ల పెంపు కారణంగా అదనంగా రూ.280 కోట్లు వచ్చాయి! అందుకే త్వరలో విడుదల కానున్న పెద్ద సినిమాలకు ప్రభుత్వం నుంచి ప్రత్యేక అనుమతులు తెచ్చుకోవాలని పరిశ్రమ పెద్దలు ప్రయత్నించారు. కానీ, సీఎం రేవంత్ రెడ్డి 'బెనిఫిట్ షో'లు ఉండవు అని ప్రకటించడంతో వారంతా నిరాశకు గురయ్యారు. పైకి చిన్న విషయమని చెబుతున్నప్పటికీ.. సీఎంతో సమావేశమైనప్పుడు దీన్ని ప్రముఖంగా ప్రస్తావించినట్టు తెలిసింది. అయితే.. ఎగ్జిబిటర్లు మాత్రం టికెట్ రేట్ల పెంపునకు, బెనిఫిట్ షోలకు వ్యతిరేకంగా ఉన్నారు. ఇలాంటి చర్యల వల్ల పేద, మధ్యతరగతి ప్రేక్షకులపై భారం పడుతుందని.. పెద్ద సినిమాలు ఎక్కువ డబ్బు పెట్టి చూసిన ప్రేక్షకులు ఇతర సినిమాలకు రాకపోవడంతో థియేటర్లు కొన్నిరోజులు మూసేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందుకే సీఎం రేవంత్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్టు ఇటీవలే ప్రకటించారు! తెలుగు సినిమా చరిత్రలోనే అత్యధిక టికెట్ ధరలతో ప్రదర్శించిన చిత్రంగా 'పుష్ప 2' నిలిచింది. సినిమాపై భారీ అంచనాలు ఉండడంతోపాటు టికెట్

మిగతా 14వ పేజీలో...



ప్రపంచ చాంపియన్ మన హంపి

- ప్రపంచ ర్యాపిడ్ చెస్ విజేతగా తెలుగు తేజం
- రెండోసారి టైటిల్‌తో కొత్త చరిత్ర
- ద్రోణవల్లి హారిక, అర్జున్‌లకు ఐదోస్థానం

తెలుగు తేజం, చెస్ ధ్రువతార కోనేరు హంపి విశ్వవేదికపై అద్భుత ప్రదర్శన కనబరచింది. న్యూయార్క్‌లో జరిగిన ఫిడే మహిళల ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌గా నిలిచి అదరహో అనిపించింది. మొత్తం 11 రౌండ్లకు గాను 8.5 పాయింట్లు సాధించిన హంపి అగ్రస్థానంతో టైటిల్ కైవసం చేసుకుంది. 37 ఏళ్ల హంపికిది రెండో ర్యాపిడ్ ప్రపంచ టైటిల్ కావడం విశేషం. 2019లోనూ విజేతగా నిలిచిన హంపి.. చైనా గ్రాండ్‌మాస్టర్ జు వెన్‌జున్ తర్వాత ఈ టోర్నీని ఒకటికంటే ఎక్కువసార్లు గెలిచిన క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించింది. మరో తెలుగమ్మాయి ద్రోణవల్లి హారిక ఎనిమిది పాయింట్లతో ఐదోస్థానంతో సరిపెట్టుకుంది. ఓపెన్ విభాగంలో రష్యాకు చెందిన, 18 ఏళ్ల వొలొదార్ ముర్జిన్ ర్యాపిడ్ చాంపియన్‌గా అవతరించాడు. టైటిల్ ఫేవరెట్‌గా పోటీపడ్డ అర్జున్ ఇరిగేసి 9 పాయింట్లతో ఐదో స్థానానికి పరిమితమవగా.. ప్రజ్ఞానంద (8.5) 17వ, హర్ష భరత్‌కోటి (6.5) 98వ స్థానాలతో నిరాశపరిచారు. 11



వార్షిక నేర నివేదికను విడుదల చేస్తున్న డీజీపీ జితేందర్

డ్రగ్స్ క్రయవిక్రయాలకు భయపడాల్సిందే!

- మత్తుమందు దొరకని రాష్ట్రంగా తెలంగాణ
- 9.87% పెరిగిన క్రైమ్.. రికవరీలు అద్భుతం
- పక్కా వ్యూహంతో సైబర్ నేరాలకు అడ్డుకట్ట
- సొత్తును వెనక్కు తేవడంలో రాష్ట్రం టాప్
- ఫోన్ ట్యాప్ కేసులో ఇంటర్‌పోల్ సాయం
- 'సంధ్య థియేటర్'పై విచారణ సాగుతోంది
- వార్షిక నివేదిక విడుదలలో డీజీపీ జితేందర్

నేరాల రేటు ఆందోళనకరం

- మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు
- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి ఇదే నిదర్శనం
- రాష్ట్రంలో పోలీసులే ప్రాణాలు తీసుకోవడం విచారకరం: మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): "తెలంగాణలో డ్రగ్స్ అమ్మాలన్నా.. కొనాలన్నా భయపడేలా.. పట్టుబడితే శిక్ష తప్పదనేలా చర్యలు తీసుకుంటున్నాం. డ్రగ్స్ రహితంగా.. మత్తుమందు దొరకని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నాం" అని డీజీపీ జితేందర్ స్పష్టం చేశారు. ఈ ఏడాది మొత్తం 1,942 డ్రగ్స్ కేసుల్లో 4,682 మందిని అరెస్టు చేశామని, రూ.142.95 కోట్ల విలువైన మత్తుపదార్థాలను సీజ్ చేశామని గుర్తుచేశారు. ఈ కేసుల్లో నిందితులకు చెందిన రూ.55.8 కోట్ల ఆస్తులను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆదివారం ఆయన

మిగతా 3వ పేజీలో...

ప్రతి కమతానికీ భూధార్!



- కొత్తగా ల్యాండ్ ట్రిబ్యునల్ ఏర్పాటు
- తప్పులపై దరఖాస్తు చేసుకునే అవకాశం
- మోసాలకు పాల్పడితే అధికారులపై చర్యలు
- క్రిమినల్ కేసులు.. సర్వీసు నుంచి తొలగింపు
- సులభంగా మ్యుటేషన్.. పాస్ పుస్తకాల జారీ
- రిజిస్ట్రేషన్ సమయంలోనే తప్పనిసరి భూ సర్వే
- భూ భారతి-24 ఆర్వోఆర్ చట్టం ప్రత్యేకతలివీ
- స్వాతంత్ర్యం తర్వాత 4వ సారి మార్పు
- ధరణి లోపాలను సరిదిద్దుతూ పలు చర్యలు

హైదరాబాద్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): రికార్డ్ ఆఫ్ రైట్స్(ఆర్వోఆర్).. భూమి హక్కుల రికార్డు. తెలంగాణలో 1948 నుంచి 2024 వరకు నాలుగు పర్యాయాలు ఆర్వోఆర్‌లో మార్పులు చేశారు. ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భూభారతి-2024 పేరిట కొత్త ఆర్వోఆర్ చట్టాన్ని తీసుకొచ్చిన విషయం తెలిసిందే. భూమి హక్కుల రికార్డును రూపొందించే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం, హక్కుల రికార్డుల్లో తప్పులు, మ్యుటేషన్, భూమిపై హక్కులు కట్టబెట్టే సమయంలో తలెత్తే సమస్యలకు పరిష్కారం చూపకపోవడం వంటి కారణాలతో తరచూ చట్టాలను మార్చుకుంటూ వస్తున్నారు. వాస్తవానికి నిజాం హయాంలో బ్రిటీష్ అధికారుల సూచనలతో ఆర్వోఆర్ మొదలైంది. ఈ క్రమంలో వచ్చినవే ఖాస్రా పహాణీ, 1బీ రిజిస్టార్/ఆర్వోఆర్ 1బీ, ధరణి, భూభారతి. హైదరాబాద్‌లో 1948లో చేసిన హక్కుల రికార్డునే ఖాస్రాపహాణీగా పరిగణించేవారు. ఆ తరువాత ఉమ్మడి ఏపీలో 1971లో చేసిన ఆర్వోఆర్ చట్టమే 1బీ రిజిస్టర్. ఈ 1బీ రిజిస్టర్ ఆధారంగానే 2017లో భూ రికార్డుల ప్రక్షాళన చేపట్టారు. అనంతరం ధరణి-2020 తీసుకొచ్చారు. తాజాగా ధరణిలో లోపాలను సవరించేందుకు భూభారతి-2024ను తెచ్చారు. కాగా, 1948 చట్టంలో భూమి కలిగిన వారు, అనుభవదారులు, యజమానులు తన ఖాదారులు, శిస్తు చెల్లింపుదారుల వివరాలు, ఎంత భూమి ఉంది, దాన్ని ఎలా

మిగతా 12వ పేజీలో...



కన్హా శాంతివనంలో సీఎం రేవంత్‌రెడ్డి, కమలేశ్ పటేల్

రంగారెడ్డి జిల్లాకు ఎయిమ్స్ వర్సిటీ

- 200 ఎకరాల భూమి లభిస్తే ఏర్పాటు
- కన్హా శాంతివనం.. అద్భుత ప్రపంచం
- పర్యావరణానికి మీ సేవలు అమోఘం
- నిర్వాహకుడు కమలేశ్‌తో రేవంత్
- వర్సిటీకి స్థలం ఇస్తామన్న కమలేశ్
- ఆర్ఆర్ఆర్ టెండర్లపై మంత్రి కోమటిరెడ్డికి సీఎం అభినందనలు

షాద్‌నగర్/నందిగామ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రఖ్యాతి గాంచిన 'అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్)' యూనివర్సిటీని రంగారెడ్డి జిల్లాలో ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. వర్సిటీ ఏర్పాటుకు 200 ఎకరాల భూమి అవసరమవుతుందన్నారు. భూమి దొరికితే ఎయిమ్స్ వర్సిటీని రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని

మిగతా 13వ పేజీలో...

హెడ్ కానిస్టేబుల్ ఆత్మహత్య

- కొల్చారం పోలీస్‌స్టేషన్ ఆవరణలోనే ఉరి
- టిఫిన్ సెంటర్ యజమాని భర్త, అల్లుడి వేధింపులతోనే?
- ఆన్‌లైన్ మోసానికి సిరిసిల్ల కానిస్టేబుల్ బలి 3
- 25 లక్షల నష్టం.. కుటుంబంతో సహా ఆత్మహత్యకు యత్నం
- ఫలించకపోవడంతో ఫ్యాన్‌కు ఉరేసుకుని బలవన్మరణం

టాలీవుడ్‌పై 'అక్కినేని' చెరగని ముద్ర



- తెలుగు సినిమాను కొత్త శిఖరాలకు తీసుకెళ్లారు
- రాజ్‌కపూర్, మొహమ్మద్ రఫీ, తపన్ సిన్హా
- జీవితాలు యావత్ సినీ పరిశ్రమకు స్ఫూర్తి
- 'మన్ కీ బాత్'లో ప్రధాని నరేంద్ర మోదీ 2

గాజాపై ఇజ్రాయెల్ భీకర దాడులు.. 43 మంది దుర్మరణం

- కమల్ అద్వాన్ ఆస్పత్రిలో 20 మంది హతం 2
- వైద్యులు సహా.. 240 మందిని బంధించిన ఐడీఎఫ్
- వఫా ఆస్పత్రిలో 7, శరణార్థి శిబిరాల్లో 16 మరణాలు
- సిరియాపైనా డ్రోన్ దాడులు.. ఆరుగురి మృతి



అండర్ వాటర్ డ్రోన్లు.. 2,700 కెమెరాలు..

- 50 వేల మంది సిబ్బందితో పటిష్ఠ భద్రత
- ప్రతి ఠాణాలోనూ సైబర్ హెల్ప్‌డెస్క్
- మహా కుంభమేళాకు భారీగా ఏర్పాట్లు
- ప్రయాగ్‌రాజ్‌లో 7500 కోట్ల వ్యయం

తరం మారనన్నది!

(మొదటి పేజీ తరువాయి)

వస్తే భారత వైమానిక దళం (ఐఏఎఫ్)పై పాకిస్థాన్ ఎయిర్‌ఫోర్స్ (పీఏఎఫ్) పైచేయి సాధించినట్లవుతుంది. పాక్‌కు ఐదో తరం యుద్ధవిమానాలు సరఫరా చేయడమే కాదు.. తాజాగా తాను తయారుచేసిన ఆరోతరం యుద్ధ విమానాన్ని సైతం చైనా ప్రదర్శించింది. ఈ పరిణామాల నేపథ్యంలో.. అధునాతన యుద్ధ విమాన సాంకేతిక పరిజ్ఞానం పోటీలో భారత్ వెనుకబడిపోతోందని హెచ్‌ఏఎల్ మాజీ ప్రాజెక్ట్ మేనేజర్ ప్రశాంత్ భడోరియా ఆందోళన వ్యక్తం చేశారు. "నా హృదయం ముక్కలైంది. డ్రాగన్ (చైనా) మనల్ని భారీ తేడాతో ఓడించింది" అంటూ ఆయన ఇటీవల ట్వీట్ చేశారు. భారతదేశం వద్ద ప్రస్తుతం ఉన్నవి నాలుగోతరం యుద్ధ విమానాలు. ఫ్రాన్స్ నుంచి కొనుగోలు చేసిన రఫేల్ యుద్ధ విమానాలు కూడా ఆ తరానివే. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన తదుపరి తరం యుద్ధవిమానాల అభివృద్ధి దిశగా భారత్ రూ.15వేల కోట్లతో 'అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసీఏ)' ప్రాజెక్టు చేపట్టినప్పటికీ.. అవి 2034కు గానీ మన వైమానిక దళానికి అందుబాటులోకి రావని అంచనా. ఈ క్రమంలోనే.. "జే-35లు పాక్‌కు అందుబాటులోకి వస్తే వచ్చే 12-14 సంవత్సరాలూ భారతదేశంపై పాకిస్థాన్‌కు పైచేయి లభిస్తుంది" అని పీఏఎఫ్ రిటైర్డ్ అధికారి జియా ఉల్ హక్ షమ్సీ అభిప్రాయపడ్డారు. ఇప్పటికే పాక్ వద్ద ఉన్న ఎఫ్-16, జే-10సిలకు జే-35లు తోడైతే పాక్ శక్తిసామర్థ్యాలు గణనీయంగా పెరుగుతాయని ఐఏఎఫ్ రిటైర్డ్ స్క్వాడ్రన్ లీడర్ విజయేందర్ కె.ఠాకూర్ హెచ్చరించారు.

ఏమిటీ ఐదోతరం?

స్టెల్త్.. అంటే శత్రు రాడార్లకు చిక్కకుండా ఉండగలగడం, మళ్లీ మళ్లీ ఇంధనం సరఫరా చేయాల్సిన అవసరం లేకుండానే గంటకు 1200కిలోమీటర్లకు పైబడిన వేగంతో ప్రయాణించగలగడం, వేగంగా ప్రయాణిస్తూనే సమతూకాన్ని కోల్పోకుండా ఎటైనా తిరగగలిగే సత్తా.. ఇలా నిర్దిష్ట ఫీచర్లను కలిగి ఉన్న విమానాలను ఐదో తరం యుద్ధ విమానాలుగా పరిగణిస్తారు. అలాంటి కంబాట్ రెడీ ఫైటర్ జెట్లు ప్రస్తుతానికి అమెరికా, రష్యా, చైనా వద్ద మాత్రమే ఉన్నాయి. అమెరికా వద్ద ఎఫ్-22 ర్యాప్టర్ (2005లో అందుబాటులోకి వచ్చింది), ఎఫ్-35 లైట్నింగ్ 2 (2015) అనే రెండు రకాల ఐదో తరం ఫైటర్ జెట్లు ఉండగా.. చైనా వద్ద జె-20 (2017లో అందుబాటులోకి వచ్చింది), ఈ ఏడాది నవంబరులో అందుబాటులోకి వచ్చిన జే-35 ఉన్నాయి. తాజాగా చైనా ప్రదర్శించిన ఆరోతరం యుద్ధవిమానం దానికి అదనం. చైనా దాన్ని 'వైట్ ఎలిఫెంట్/జె-36'గా వ్యవహరిస్తోంది. ఇక రష్యా వద్ద ఉన్న ఎస్‌యు-57 యుద్ధవిమానం 2020లో అందుబాటులోకి వచ్చింది.

చైనా దూకుడు..

అమెరికా, రష్యాతో పోలిస్తే ఈ యుద్ధవిమానాల తయారీలో చైనా చాలా దూకుడుగా ఉంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. ఇప్పటికే చైనా వద్ద 300కు పైగా జే-20లు ఉన్నాయి. 2030 నాటికి 800కు పైగా జే-20, 2030 నాటికి 1500 జే-35 యుద్ధవిమానాల తయారీని ఆ దేశం లక్ష్యంగా పెట్టుకుంది. అంటే.. 2035 నాటికి చైనా వద్ద ఒక్క ఐదో తరం యుద్ధ విమానాలే 2,300కు పైగా ఉంటాయన్నమాట. ఒకవైపు చైనా.. మరోవైపు ఆ దేశం నుంచి కొన్న ఐదో తరం యుద్ధ విమానాలతో పాకిస్థాన్.. పక్కలో బల్లేల్లాగా బలపడడం భారత్‌కు ఆందోళన కలిగించే విషయమే.

-సెంట్రల్ డెస్క్

పీఎస్‌ఎల్వీ-సీ60 ప్రయోగం నేడే

సూళ్లూరుపేట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇస్రో మరో సరికొత్త అంతరిక్ష ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. పీఎస్‌ఎల్వీ-సీ60 రాకెట్ ప్రయోగం ద్వారా సోమవారం స్పేస్ డాకింగ్ ఎక్స్‌పెరిమెంట్ (స్పాడెక్స్) ఉపగ్రహ ప్రయోగానికి సిద్ధమైంది. దీని ద్వారా స్పేస్ డాకింగ్ టెక్నాలజీకి సంబంధించి 440 కిలోల బరువున్న స్పాడెక్స్ జంట ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టనుంది. శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి సోమవారం రాత్రి 9:58 గంటలకు పీఎస్‌ఎల్వీ-సీ60 రాకెట్ నింగిలోకి ఎగరనుంది. దీనికి సంబంధించిన కౌంట్‌డౌన్ ఆదివారం రాత్రి 8:58 గంటలకు మొదలైంది. 25 గంటల పాటు కొనసాగే ఈ కౌంట్‌డౌన్ పూర్తికాగానే షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి రాకెట్ నింగిలోకి దూసుకెళ్లనుంది. ఈ ప్రయోగం విజయవంతమైతే ప్రపంచంలో స్పేస్ డాకింగ్ టెక్నాలజీ కలిగిన నాలుగో దేశంగా భారత్ నిలవనుంది. భూమికి 470 కిలోమీటర్ల దూరంలోని వృత్తాకార కక్ష్యలో స్పాడెక్స్ ఉపగ్రహాలు తిరుగుతూ పరిశోధనలు చేస్తాయి. వివిధ పరిశోధనల నిమిత్తం ఇస్రో అధికారులు రాకెట్ నాలుగో దశలో 24 ఉపకరణాలను పంపిస్తున్నారు.

పీవీని, ప్రణబ్‌ను కాంగ్రెస్ అవమానించింది!

- పీవీ పార్థివదేహాన్ని పార్టీ ఆఫీసులోకి తీసుకురానివ్వలేదు
- ప్రణబ్ మృతిపై సీడబ్ల్యూసీ సంతాపం కూడా తెలుపలేదు
- మన్మోహన్ అంత్యక్రియలనూ రాజకీయం చేస్తోంది
- కేంద్రమంత్రులు ప్రహ్లాద్‌జోషి, అశ్వినీ వైష్ణవ్ విమర్శలు

న్యూఢిల్లీ, డిసెంబరు 29: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ అంత్యక్రియలు, స్మారక నిర్మాణం అంశంలో కేంద్రప్రభుత్వంపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను ఆదివారం పలువురు కేంద్రమంత్రులు తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్‌దంతా చిల్లర రాజకీయమని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి విమర్శించారు. గాంధీ కుటుంబానికి చెందని కాంగ్రెస్ నేతలను ఆ పార్టీ ఎన్నడూ గౌరవించలేదని, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు, మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీలే దీనికి నిదర్శమన్నారు. 'వారు మన్మోహన్‌కే కాదు.. పీవీ, ప్రణబ్‌లకు కూడా తగిన గౌరవాన్ని ఇవ్వలేదు. 1991 నాటి ఆర్థిక సంస్కరణల రూపశిల్పి అయిన పీవీకి.. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు భారతరత్న ప్రకటించలేదు. ప్రణబ్ మరణించిన తర్వాత ఆయనకు సంతాపం తెలుపుతూ సీడబ్ల్యూసీ సమావేశం కూడా నిర్వహించలేదని ప్రణబ్ కుమార్తె శర్మిష్ఠ తాజాగా వాపోయారు' అని ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు. పీవీ మరణించిన తర్వాత ఆయన మృతదేహాన్ని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలోకి తీసుకురావటానికి కూడా ఆ పార్టీ పెద్దలు అనుమతించలేదని గౌరవ్ భాటియా అన్నారు. ఢిల్లీలో పీవీ అంత్యక్రియలు జరపవద్దని, పార్థివదేహాన్ని సొంతగ్రామానికి తీసుకెళ్లాలని ఆయన కుటుంబసభ్యుల మీద కాంగ్రెస్ నేతలు ఒత్తిడి తెచ్చారన్నారు. మరో కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్ స్పందిస్తూ.. ప్రధానిగా ఉన్న సమయంలో మన్మోహన్‌ను పూర్తిగా పక్కనపెట్టి సోనియాగాంధీ అధికారం చెలాయించారని, అటువంటి కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు మన్మోహన్ అంత్యక్రియల అంశాన్ని రాజకీయం చేయటం ఆ పార్టీ దివాళాకోరుతనానికి నిదర్శనమన్నారు. మరోవైపు, కాంగ్రెస్‌పై విమర్శలను దివంగత రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ కుమార్తె శర్మిష్ఠ ముఖర్జీ కొనసాగించారు. ఆ పార్టీ సోషల్ మీడియా విభాగం తన మీద ట్రోలింగ్‌కు పాల్పడుతోందని, కాంగ్రెస్ పార్టీ ఏ స్థాయికి దిగజారిందో ఇది తెలియజేస్తోందన్నారు.

యమునలో మన్మోహన్ అస్థికల నిమజ్జనం

న్యూఢిల్లీ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ అస్థికలను ఆయన కుటుంబసభ్యులు ఆదివారం యమునా నదిలో నిమజ్జనం చేశారు. అంత్యక్రియలు జరిగిన నిగమ్‌బోధ్ ఘాట్‌లో ఉదయం అస్థికలను సేకరించి వాటిని మజ్నూ కా తిలా గురుద్వారా సమీపంలో గల యమునా నది ఘాట్‌లో సిక్కు సంప్రదాయాల ప్రకారం నిమజ్జనం చేశారు. తొలుత వాటిని ఆ గురుద్వారాలో ఉంచి షాబాద్ కీర్తన్ (గురుగ్రంథ్ సాహిబ్ పఠనం), గురుపథ్(గుర్బానీ పారాయణం), అర్దాస్(ప్రార్థనలు)లను నిర్వహించారు. మన్మోహన్ భార్య గురుశరణ్ కౌర్, ముగ్గురు కుమార్తెలు ఉపిందర్ సింగ్, దమన్‌సింగ్, అమృత్‌సింగ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బీజేపీ చీఫ్‌గా దళితుడు?

- దక్షిణాది నుంచి యువనేతను నియమించే యోచన

న్యూఢిల్లీ, డిసెంబరు 29: బీజేపీ సంస్థాగత ఎన్నికలు పూర్తయిన తర్వాత జనవరి లేదా ఫిబ్రవరి చివరి నాటికి ఆ పార్టీకి కొత్త అధ్యక్షుడు రానున్నారు. ప్రస్తుత బీజేపీ చీఫ్ జేపీ నడ్డా స్థానంలో దళిత వర్గానికి చెందిన యువనేతను ఎంపిక చేయవచ్చని ఢిల్లీ వర్గాలు చెబుతున్నాయి. ఇందుకు మూడు కారణాలు ఉన్నాయని విశ్లేషిస్తున్నారు. ఇటీవల అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం కావడం, కాంగ్రెస్ అధ్యక్షుడిగా దళిత వర్గానికి చెందిన ఖర్గే ఉండటం, బీజేపీ దళితులకు వ్యతిరేకమని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో దళితుడికి పార్టీ పగ్గాలు అప్పగించాలని బీజేపీ అగ్రనాయకత్వం భావిస్తున్నట్టు చెబుతున్నారు. కాగా దక్షిణాది రాష్ట్రాలకు చెందిన నేతను బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నియమించే అవకాశముందని పార్టీ వర్గాలు తెలిపాయి.

రన్‌వేపై దూసుకెళ్లి.. రక్షణ గోడను ఢీకొట్టి..

పేలిపోయిన విమానం!

179 మంది దుర్మరణం

- దక్షిణ కొరియాలో ఘోర ప్రమాదం
- ల్యాండింగ్ గేర్ విఫలంతోనే ప్రమాదం!



ప్రమాదానికి ముందు రన్‌వేపై విమానం

గోడను గుద్దుకొని పేలిపోయిన విమానం

సియోల్, డిసెంబరు 29: దక్షిణ కొరియాలో ఘోర విమాన ప్రమాదం జరిగింది. రాజధాని సియోల్‌కు 290 కిలోమీటర్ల దూరంలోని మువాన్ నగరంలో ఉన్న అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆదివారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్ నుంచి బయల్దేరిన జెజు ఎయిర్‌కు చెందిన 7సి2216 నంబర్ బోయింగ్ 737-800 విమానం మువాన్ విమానాశ్రయంలో ల్యాండ్ అవుతూ అదుపుతప్పింది. ఈ విమానం 15 ఏళ్ల నాటిదని అధికారులు తెలిపారు. ఉదయం 9 గంటల సమయంలో రన్‌వే పైనుంచి అతివేగంగా దూసుకెళ్లి, రక్షణ గోడను ఢీకొని మంటల్లో చిక్కుకొని పేలిపోయింది. విమానంలో 175 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది ఉన్నట్లు అధికారులు తెలిపారు. వీరిలో 179 మంది మంటల్లో చిక్కుకొని, మరణించినట్లు వెల్లడించారు. ఇద్దరు సిబ్బందిని కాపాడారు. ప్రమాదానికి గల కారణాలపై వివిధ కోణాల్లో పరిశీలిస్తున్నట్లు తెలిపారు. విమానం ఇంజన్‌ను పక్షి ఢీకొనడం, ల్యాండింగ్ గేర్‌లో సమస్య ఈ ప్రమాదానికి కారణమై ఉండొచ్చని పేర్కొన్నారు. కాగా, ఈ విమానం అప్పటికే ల్యాండింగ్‌కు యత్నించి విఫలమైందని అధికారులు చెబుతున్నారు. నేలపైకి దిగిన తర్వాత, రన్‌వేపై వేగాన్ని నియంత్రించుకోవడంలో విఫలమైనట్లు చెప్పారు. విమానం నేలపైకి దిగే సమయంలో ల్యాండింగ్ గేర్, టైర్లు పనిచేయడం లేదని కొందరు ప్రత్యక్ష సాక్షులు చెప్పినట్లు అధికారులు వెల్లడించారు. ఏదైనా పక్షిని ఢీకొనడం వల్లే అవి పనిచేయకపోయి ఉండొచ్చన్న అనుమానాలున్నాయి. వీటిని బలపర్చేలా విమానం ల్యాండింగ్ సమయంలో ఓ ఇంజన్ నుంచి నిప్పులు వచ్చిన దృశ్యాలను స్థానిక టీవీ చానల్ ప్రసారం చేసింది. ప్రమాద వీడియోలో కూడా విమానం రన్‌వేపై అదుపుతప్పి దూసుకెళుతూ గోడను ఢీకొనే సమయానికి ల్యాండింగ్ గేర్ వెనక్కే ఉన్నట్లు భావిస్తున్నారు. విమానాన్ని పక్షి ఢీకొన్నట్లు ఎయిర్‌పోర్ట్ కంట్రోల్ టవర్ నుంచి సందేశం వెళ్లినట్లు ప్రాథమిక సమాచారం ఉందని రవాణా శాఖ అధికారులు తెలిపారు.

జెజు ఎయిర్ క్షమాపణలు

ఈ ప్రమాదం పట్ల థాయ్‌లాండ్‌కు చెందిన జెజు ఎయిర్ సంస్థ క్షమాపణలు తెలిపింది. బాధిత కుటుంబాలకు సాయం చేస్తామని పేర్కొంది. దక్షిణ కొరియాలో 1997లో జరిగిన విమాన ప్రమాదంలో 228 మంది మృతి చెందారు. ఆ తర్వాత ఇదే అతిపెద్ద ప్రమాదం కావడం గమనార్హం. కాగా, ఈ విమాన ప్రమాదంపై దక్షిణ కొరియా తాత్కాలిక అధ్యక్షుడు చోయ్ సాంగ్ స్పందించారు. తక్షణమే అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

నా చివరి మాటలు చెప్పనా?

మువాన్‌లో విమాన ప్రమాదం జరగడానికి కొన్ని క్షణాల ముందు ఓ ప్రయాణికుడు తన బంధువుకు పంపిన మెసేజ్ వైరల్‌గా మారింది. విమానం రెక్కలో పక్షి ఇరుక్కుందని మెసేజ్‌లో తెలిపారు. తర్వాత 'నా చివరి మాటలు చెప్పనా?' అని ఉన్నట్లు ఓ వార్తా సంస్థ తెలిపింది.

మరో రెండు విమానాలకు తప్పిన ప్రమాదం




పక్కకు ఒరిగిన ఎయిర్ కెనడా విమానం ఇదే

న్యూఢిల్లీ, డిసెంబరు 29: దక్షిణ కొరియాలో ఘోర విమాన ప్రమాదం జరిగిన కొన్ని గంటల తర్వాత మరో రెండు విమానాలు వేర్వేరు ప్రాంతాల్లో అదే తరహా ప్రమాదాలకు గురై త్రుటిలో తప్పించుకున్నాయి. ఎయిర్ కెనడాకు చెందిన ఏసీ 2259 విమానం కెనడాలోని హాలీఫాక్స్ విమానాశ్రయంలో శనివారం రాత్రి ప్రమాదానికి గురైంది. సెయింట్ జాన్స్ నగరం నుంచి వచ్చిన ఆ విమానం అత్యవసరంగా ల్యాండ్ అయింది. ఆ సమయంలో ల్యాండింగ్ గేర్ విరిగిపోవడంతో అదుపు తప్పి, ఓ పక్కకు ఒరిగిపోయి రన్‌వేపై కొంత దూరం ప్రయాణించింది. ఈ క్రమంలో విమానం ఎడమ వైపు రెక్క రన్‌వేకు రాసుకొని మంటలు చెలరేగాయి. అయితే, పైలట్ విమానాన్ని నియంత్రించి ఆపగలగడంతో పెను ప్రమాదం తప్పింది. విమానం ఆగిన వెంటనే ప్రయాణికులను సురక్షిత ప్రాంతానికి తరలించారు. మరోవైపు, రాయల్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన బోయింగ్ 797-800 విమానం ఒకటి నార్వేలోని టోర్ప్ శాండీఫ్యూయర్డ్ విమానాశ్రయంలో ల్యాండ్ అయ్యే క్రమంలో అదుపు తప్పి జారింది. కాగా, నార్వేలోని ఓస్లో నుంచి ఆమ్‌స్టర్‌డమ్‌కు బయలుదేరిన విమానం టేకాఫ్ అయ్యాక.. విమానం హైడ్రాలిక్ వ్యవస్థ విఫలమైనట్లు గుర్తించారు. విమానాన్ని అత్యవసరంగా టోర్ప్‌కు దారి మళ్లించారు. టోర్ప్‌లో ల్యాండ్ అయ్యే క్రమంలో అదుపు తప్పి రన్‌వేపై జారిన విమానం... రన్‌వేను ఆనుకుని పెంచిన గడ్డిలోకి వెళ్లి ఆగింది. ఆ సమయంలో విమానంలో 182 మంది ఉన్నారు. ఇదిలా ఉండగా, ఐదుగురు అమెరికా పౌరులతో నేపాల్‌లోని లుక్లా నుంచి కాఠ్‌మాండూకు బయలుదేరిన ఓ ప్రైవేట్ హెలికాప్టర్‌ను ఆదివారం ఉదయం 11 గంటలప్పుడు ఓ పక్షి ఢీకొట్టింది. దీంతో కాఠ్‌మాండూకు 50కిమీల దూరంలో ఉన్న బనేపా ప్రాంతంలో హెలికాప్టర్‌ను అత్యవసరంగా ల్యాండ్ చేశారు.

మా విమానాన్ని కూల్చింది రష్యానే

అజర్‌బైజాన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం రష్యా చేసిన దాడి వల్లే కజకిస్థాన్‌లో కూలిపోయిందని అజర్‌బైజాన్ అధ్యక్షుడు ఇల్హామ్ అలియెవ్ ఆదివారం ఆరోపించారు. బుధవారం జరిగిన ఈ విమాన ప్రమాదంలో 38 మంది ప్రాణాలు కోల్పోయారు. ఉక్రెయిన్ ప్రయోగించిన డ్రోన్లను ఎదుర్కొనేందుకు రష్యా గగనతల రక్షణ వ్యవస్థలు చేసిన ప్రయత్నంలో భాగంగా తమ విమానం కూలిందని అలియెవ్ పేర్కొన్నారు. అయితే, ఈ విమాన ప్రమాదంపై రష్యా అధ్యక్షుడు పుతిన్ అజర్‌బైజాన్ అధ్యక్షుడికి శనివారమే క్షమాపణ చెప్పారు.

లోకం తీరు



డిసెంబరులోనే 6 ప్రమాదాలు..

236 మంది మృతి

ప్రపంచ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో నెలకొన్న యుద్ధ వాతావరణం వల్ల ప్రయాణికుల విమానాలు ప్రమాదాలకు గురవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఈ నెల 25న అజర్‌బైజాన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం కజకిస్థాన్‌లో కూలిపోవడంతో 38 మంది చనిపోయారు. తొలుత ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా విమానం కూలినట్లు భావించినా.. తమ సైన్యం పొరపాటున జరిపిన కాల్పుల వల్లే కూలిందని రష్యా ప్రకటించింది. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలోనే అజర్‌బైజాన్ విమానం కూలింది. ఈ ఏడాది జనవరిలో రష్యా మిలిటరీ విమానం కూలి 74 మంది మరణించారు. ఉక్రెయిన్ దళాలే తమ విమానాన్ని కూల్చివేసినట్లు రష్యా ఆరోపించింది. ఇరాన్, ఇజ్రాయెల్ పోరులో భాగంగా క్షిపణులు ప్రయోగించడంతో ఓ విమానాన్ని దారి మళ్లించాల్సి వచ్చింది. అందులో ఇంగ్లండ్ మాజీ క్రికెటర్ కెవిన్ పీటర్సన్ కూడా ఉన్నారు. దూసుకొస్తున్న క్షిపణులను చూసినట్లు విమానంలోని ప్రయాణికులు భయాందోళనలు వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలతో అంతర్జాతీయ విమానాల భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. మరోవైపు డిసెంబరు నెల విమాన ప్రయాణికులకు పీడకలగా మిగిలిపోనుంది. ఈ నెలలోనే 6 విమానాలు కూలిపోయాయి. 236 మంది ప్రాణాలు కోల్పోయారు. వరస ప్రమాదాలతో విమానయాన పరిశ్రమ ప్రయాణికుల భద్రత కోసం తీసుకుంటున్న చర్యలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఆదివారం జెజు విమానం కూలిన ఘటనలో 179 మంది మరణించారు. ఈ నెల 22న బ్రెజిల్‌లో ప్రైవేటు విమానం కూలి 10 మంది మరణించారు. అదేరోజు పపువా న్యూగినియాలో విమానం కూలి ఐదుగురు మృతి చెందారు. అర్జంటీనాలో ఈ నెల 18న విమానం కూలి ఇద్దరు పైలట్లు మరణించారు. హవాయిలో ఈ నెల 17న సెస్నా విమానం కూలి ఇద్దరు పైలట్లు చనిపోయారు.

మళ్లీ కయ్యానికి కాలు దువ్వుతున్న చైనా

- భారత సరిహద్దుల్లో 2 గ్రామాల నిర్మాణం
- వాటిలో ఒకటి ఇండియా భూభాగంలోనే

న్యూఢిల్లీ, డిసెంబరు 29: చైనా మరోసారి భారత్‌తో కయ్యానికి కాలు దువ్వుతోంది. తాజాగా సరిహద్దులో రెండు పెద్ద గ్రామాలను నిర్మించింది. వాటిలో ఒకటి అక్సాయ్ చిన్‌లో భారత భూభాగాన్ని ఆక్రమించిన ప్రాంతంలో నిర్మించింది. భారత సరిహద్దుల్లో చైనా కొత్తగా హియాన్, హెకాంగ్ అనే రెండు కొత్త గ్రామాలను నిర్మించినట్టు చైనా ప్రభుత్వ అధికార వార్తాసంస్థ జిన్హువా వారం క్రితం ప్రచురించింది. అక్సాయ్‌చిన్‌లో నిర్మించిన గ్రామం పేరు హియాన్. తాజా పరిణామం భారత ప్రభుత్వం దృష్టికి కూడా వచ్చింది. అయితే, ఇప్పటి వరకు దీనిపై భారత్ అధికారికంగా స్పందించలేదు. మరోవైపు, ప్రపంచంలోనే అతిపెద్ద టిబెటన్ బౌద్ధుల స్టడీ సెంటర్ 'లరుంగ్ గర్ బుద్ధిస్ట్ అకాడమీ' వద్ద సుమారు 400 దళాలను, అనేక హెలికాప్టర్లను చైనా మోహరించింది. మతపరమైన కార్యకలాపాలపై గట్టి నిఘా కోసమే ఈ మోహరింపులు చేపట్టినట్టు సీటీఏ(సెంట్రల్ టిబెటన్ అడ్మినిస్ట్రేషన్) శుక్రవారం తెలిపింది. అలాగే, సెర్థార్ ప్రాంతంలోని బౌద్ధ మఠం వద్ద వచ్చే ఏడాది కఠిన నిబంధనల అమలుకు చైనా ప్రణాళికలు రూపొందించింది. ఇప్పటికే అక్కడున్న చైనా విద్యార్థులను ఆ ప్రాంతం వదిలి వెళ్లాలని ఆదేశించింది. 1950లో టిబెట్‌ను చైనా ఆక్రమించింది.

గంటకు 450 కిలోమీటర్ల వేగం

సరికొత్త బుల్లెట్ రైలును పరీక్షించిన చైనా

బీజింగ్, డిసెంబరు 29: గంటకు గరిష్ఠంగా 450కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగల బుల్లెట్ రైలును చైనా పరీక్షించింది. ఈ రైలుకు సీఆర్ 450 అని పేరు పెట్టారు. రెండు మూడు నెలల్లో ఇది ప్రయాణ సేవల కోసం అందుబాటులోకి రానుంది. తద్వారా ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన రైలుగా రికార్డు సృష్టించనుంది. ఈ రైలు సగటున గంటకు 400కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుందని అధికారులు తెలిపారు. బుధవారం తియాన్‌జిన్, బీజింగ్ నగరాల మధ్య ఈ రైలును పరీక్షించారు. అంతకుముందు నవంబరులోనూ దీన్ని పరీక్షించారు. అప్పుడే ఈ రైలు వీడియోలు లీక్ అయ్యాయి.


ఢిల్లీలో 'ఆపరేషన్ కమలం'

ఓటర్ల జాబితా తారుమారుకు బీజేపీ కుట్ర: కేజ్రీ

న్యూఢిల్లీ, డిసెంబరు 29: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీజేపీపై ఆప్ అధినేత కేజ్రీవాల్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఆదివారం మీడియాతో మాట్లాడుతూ ఢిల్లీలో ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసేందుకు బీజేపీ కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ఈనెల 15 నుంచి ప్రారంభించిన 'ఆపరేషన్ కమలం'లో భాగంగా ఓటర్లను జాబితాను తారుమారు చేసేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తోందని అన్నారు. ఓటర్ల జాబితా నుంచి వేలాది మంది పేర్లు తొలగించడంతో పాటు అంతకంటే ఎక్కువ స్థాయిలో కొత్త పేర్లు అదనంగా చేర్చేందుకు దరఖాస్తులు పెడుతోందని పేర్కొన్నారు. 'బీజేపీ ఇప్పటికే ఢిల్లీలో ఓటమిని అంగీకరించింది. ఆ పార్టీకి సీఎం అభ్యర్థి లేరు. అందుకే ఎన్నికల్లో ఎలాగైనా గెలిచేందుకు ఓటర్ల జాబితాను తారుమారు చేయడం వంటి అనైతిక చర్యలకు పాల్పడుతోంది' అని కేజ్రీవాల్ ఆరోపించారు.

అక్కినేనితో తెలుగు సినిమా కొత్త శిఖరాలకు..

'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ




న్యూఢిల్లీ, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీనటుడు అక్కినేని నాగేశ్వరరావు తెలుగు సినిమాను కొత్త శిఖరాలకు తీసుకెళ్లారని ప్రధాని మోదీ కొనియాడారు. తన కళా వారసత్వంతో టాలీవుడ్‌పై చెరగని ముద్ర వేశారని తెలిపారు. ఆయన సినిమాల్లో భారతీయ సంప్రదాయాలు, విలువలు ఉట్టిపడేవని పేర్కొన్నారు. ఆదివారం 'మన్ కీ బాత్' 117వ ఎపిసోడ్‌లో భాగంగా ఆయన పలు అంశాలపై ప్రసంగించారు. అక్కినేనితో పాటు రాజ్‌కపూర్, మొహమ్మద్ రఫీ, తపన్ సిన్హా భారతీయ సినిమాకు ప్రపంచస్థాయిలో గుర్తింపు తెచ్చారని ప్రశంసించారు. వీరి జీవితాలు యావత్ సినీ పరిశ్రమకు స్ఫూర్తిదాయకమని వ్యాఖ్యానించారు. వీరి సినిమాలు సామాజిక స్పృహ, జాతీయ ఐక్యత సందేశాన్ని కలిగి ఉంటాయని తెలిపారు. ప్రస్తుతం ప్రపంచ దేశాలు భారతీయ చలనచిత్ర రంగంవైపు చూస్తున్నాయని అన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో తొలిసారిగా వరల్డ్ ఆడియో, విజువల్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ (వేవ్స్)ను మన దేశంలో నిర్వహించనున్నట్లు ప్రధాని తెలిపారు. ప్రపంచ కంటెంట్ సృష్టి కేంద్రంగా భారత్‌ను తీర్చిదిద్దే దిశగా ఈ సదస్సు ఒక ముఖ్యమైన అడుగుగా మోదీ అభివర్ణించారు.

ఐక్యతా సందేశం.. మహాకుంభ మేళా

ఉత్తరప్రదేశ్‌లో జనవరి 13 నుంచి జరగనున్న మహాకుంభ మేళా ఐక్యతా సందేశాన్ని ఇస్తుందని మోదీ అన్నారు. విభిన్న ప్రాంతాలకు చెందిన ప్రజలు హాజరయ్యే ఈ కార్యక్రమం భిన్నత్వంలో ఏకత్వానికి చక్కటి నిదర్శనమన్నారు. ఈసారి డిజిటల్ మహాకుంభ్‌ను దేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భక్తులు వీక్షిస్తారని, కుంభమేళాలో తొలిసారి ఏఐ చాట్‌బాట్ సేవలు వినియోగించనున్నట్లు తెలిపారు. చాట్ బాట్‌లో కుంభ్‌కు సంబంధించి అన్ని రకాల సమాచారం 11 భారతీయ భాషల్లో అందుబాటులో ఉంటుందన్నారు. ప్రభుత్వం ఆమోదించిన టూర్ ప్యాకేజీలు, వసతి, హోమ్‌స్టే గురించి భక్తులకు వారి మొబైల్ ఫోన్లకు సమాచారం అందించనున్నట్లు మోదీ వివరించారు. కాగా, 2015-23 మధ్య కాలంలో దేశంలో మలేరియా కేసులు, మరణాల సంఖ్య 80% తగ్గిందని డబ్ల్యూహెచ్‌వో నివేదిక పేర్కొందని, ప్రధాని అన్నారు. భారత్‌లో కేన్సర్ చికిత్సను సకాలంలో ప్రారంభించే అవకాశాలు పెరిగాయని లాన్సెట్ మెడికల్ జర్నల్‌లో అధ్యయనం ప్రచురితమైందని గుర్తుచేస్తూ, ఇది దేశ ఆరోగ్య రంగంలో మరో ఘనతగా పేర్కొన్నారు. 90% మంది క్యాన్సర్ రోగులకు సకాలంలో చికిత్స అందించడంలో ఆయుష్మాన్ భారత్ పథకం కీలక పాత్ర పోషించిందని ప్రధాని తెలిపారు.

మహా కుంభమేళాకు.. రూ. 7,500 కోట్లు



గంగ, యమున, సరస్వతి సంగమం వద్ద ఏర్పాట్లు

న్యూఢిల్లీ/హైదరాబాద్(ఆంధ్రజ్యోతి) డిసెంబరు 29: పన్నెండేళ్లకోసారి జరిగే మహా కుంభమేళాకు ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ సిద్ధమవుతోంది. 45 రోజులపాటు ఉత్సవంలా సాగే ఈ కార్యక్రమం వచ్చే ఏడాది జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు జరగనుంది. దీని కోసం ప్రపంచవ్యాప్తంగా 40 కోట్ల మందికిపైగా వస్తారని ఉత్తరప్రదేశ్‌లోని యోగి ప్రభుత్వం అంచనా వేస్తోంది. దీన్ని ఘనంగా నిర్వహించేందుకు భారీ ప్రణాళికతో సిద్ధమవుతోంది. భద్రత విషయంలో రాజీ పడకుండా 50 వేల మంది సిబ్బందిని మోహరించనుంది. నిరంతర నిఘా కోసం తొలిసారిగా నీటిలోపల 100 మీటర్ల లోతులోని వస్తువులను సైతం గుర్తించే సామర్థ్యం కలిగిన అండర్ వాటర్ (జలాంతర) డ్రోన్లను ఉపయోగించనున్నారు. కుంభమేళా కోసం కృత్రిమ మేధ (ఏఐ)తో కూడిన 2,700 సీసీ కెమెరాలతో 24 గంటలూ రియల్‌టైమ్ మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ప్రమాదాలు జరిగినా వెంటనే స్పందించేలా అత్యాధునిక మల్టీ డిజాస్టర్ రెస్పాన్స్ వాహనాలను అందుబాటులో ఉంచనున్నారు. మరోవైపు, నేత్ర కుంభ్ శిబిరం ద్వారా 5 లక్షల మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 3 లక్షల మందికి కళ్లద్దాలు పంపిణీ చేసి గిన్నిస్ రికార్డు సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మహా కుంభమేళాకు విచ్చేసే భక్తులకు ప్రత్యేక అనుభూతిని అందించేందుకు యూపీ ప్రభుత్వం 2వేలకు పైగా డ్రోన్లతో భారీ డ్రోన్ షోను కూడా ఏర్పాటు చేస్తోంది. మరోవైపు, కుంభమేళా యాత్రికుల కోసం మరో 12 ప్రత్యేక రైళ్లను నడిపేందుకు దక్షిణ మధ్య రైల్వే ఏర్పాట్లు చేసింది. 2025 జనవరి 18, ఫిబ్రవరి 8, 15, 22 తేదీల్లో తిరుపతి- బనారస్ (07107), ఫిబ్రవరి 20, 10, 17, 24 తేదీల్లో బనారస్- విజయవాడ (07108) రైళ్లను నడపనున్నారు.

142 ఏళ్లలో ఎంతో మార్పు!

మహా కుంభమేళాను ఘనంగా నిర్వహించేందుకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం రూ.7,500 కోట్లు ఖర్చుచేసి విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఈ కుంభమేళాకు 40 కోట్ల మందికిపైగా వస్తారని అంచనా వేస్తోంది. 1882లో భారత దేశ జనాభా 22.5 కోట్లు. అప్పట్లోనే మాఘ అమావాస్య నాడు 8 లక్షల మంది పవిత్ర సంగమంలో స్నానమాచరించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. అప్పట్లో ఈ ఏర్పాట్ల కోసం ఖర్చు చేసింది రూ 20,288 మాత్రమే. ఇప్పుడు ఏకంగా రూ.7,500 కోట్లతో ఏర్పాట్లు చేస్తుండడం గమనార్హం.

గాజాపై ఇజ్రాయెల్ భీకర దాడులు..

43 మంది దుర్మరణం

టెల్‌అవీవ్, డిసెంబరు 29: గాజాపై ఇజ్రాయెల్ భీకర దాడులు జరిపింది. వేర్వేరు ఘటనల్లో 43 మంది దుర్మరణం పాలయ్యారు. ఉత్తర గాజాలోని హమాస్ చిట్టచివరి కమాండ్ కంట్రోల్‌గా భావిస్తున్న కమల్ అద్వాన్ ఆస్పత్రిపై ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) ముప్పేట దాడి చేసింది. 20 మంది హమాస్ ఫైటర్లను హతమార్చి, వైద్యులు, వైద్య సిబ్బంది సహా.. 240 మందిని నిర్బంధించింది. బందీల్లో ఆస్పత్రి డైరెక్టర్ అబూ సాఫియా కూడా ఉన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది కళ్లకు గంతలు కట్టి.. ఆస్పత్రి ప్రాంగణంలో వేరుగా కూర్చోబెట్టడం, ఉగ్రవాదులుగా అనుమానిస్తున్న వారిని అర్ధనగ్నంగా ఒకచోట పెడరెక్కలు విరిచికట్టి కూర్చోబెట్టిన వీడియోలు, ఫొటోలను ఇజ్రాయెల్ వార్తా సంస్థ 'యెదియోత్ అహ్రోనోత్' ఆదివారం ప్రచురించింది. హమాస్‌కు చెందిన అతిపెద్ద కమాండ్ కంట్రోల్ ఆ ఆస్పత్రిలోనే ఉందని, అక్కడి నుంచే ఇజ్రాయెల్ బలగాలపై పోరుకు వ్యూహ రచనలు జరుగుతున్నాయని ఐడీఎఫ్ ఆరోపించింది. "తాజాగా పట్టుబడ్డ ఉగ్రవాదుల్లో.. గత ఏడాది అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై దాడి చేసిన వారు కూడా ఉన్నారు. ఎక్కువ మంది బందీలను షకీద్ బెటాలియన్‌కు చెందిన హమాస్ ఫైటర్లుగా గుర్తించాం" అని ఐడీఎఫ్ తన అధికారిక టెలిగ్రామ్ చానల్‌లో ప్రకటించింది. అదే సమయంలో ఆ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నిజమైన రోగులను ఐడీఎఫ్ 401 బ్రిగేడ్ కమాండర్లు ఇండోనేషియా ఆస్పత్రికి సురక్షితంగా తరలించినట్లు పేర్కొంది. కాగా.. అమాయకులను ఐడీఎఫ్ నిర్బంధించిందని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆరోపించింది. ఈ ఘటనపై డబ్ల్యూహెచ్‌వో ఆందోళన వ్యక్తం చేసింది. మరోవైపు.. ఉత్తర గాజాలోని జబాలియా, హోనస్, లాహియాల్లో ఆదివారం కూడా ఇజ్రాయెల్ దాడులు చేసింది. నుసేరియస్ శరణార్థి శిబిరంపై జరిపిన దాడిలో 9 మంది మృతిచెందారని పాలస్తీనా న్యూస్ ఏజెన్సీ 'వఫా' వెల్లడించింది. బెయిట్ హనూన్ శిబిరంలో ఏడుగురు పాలస్తీనీయులు.. సెంట్రల్ గాజాలోని అల్-వఫా ఆస్పత్రిపై ఐడీఎఫ్ జరిపిన షెల్లింగ్‌లో ఏడుగురు మృతిచెందినట్లు తెలిపింది. అటు.. సిరియాలోని డమాస్కస్‌పై ఇజ్రాయెల్ జరిపిన డ్రోన్ దాడుల్లో ఆరుగురు మృతిచెందారు.

ఆన్‌లైన్ సంస్థ మోసానికి కానిస్టేబుల్ బలి

- 25లక్షల అప్పు చేసి అందులో పెట్టుబడి
- దగాపడి కుటుంబంతో సహా ఆత్మహత్యకు విఫలయత్నం
- ఫలించక ఉరేసుకుని బలవన్మరణం

సిద్దిపేట క్రైం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అతి తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలొస్తాయంటూ ఊరించిన ఓ ఆన్‌లైన్ ఫైనాన్స్ సంస్థను నమ్మిన కానిస్టేబుల్ రూ.25లక్షలు అప్పు చేసి అందులో పెట్టుబడులు పెట్టి మోసపోయారు. అప్పు తీర్చే మార్గం కనబడక మనస్తాపానికి గురై భార్య, పదేళ్లు కూడా దాటని ఇద్దరు కుమారులతో సహా ఆత్మహత్యకు విఫలయత్నం చేసి చివరకు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ ఘటన సిద్దిపేటలో ఆదివారం జరిగింది. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లింగన్నపేటకు చెందిన బండారి బాలకృష్ణ (34) సిద్దిపేటలో నివాసం ఉంటూ సిరిసిల్లలో 17వ బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తక్కువ పెట్టుబడి పెడితే అధిక లాభాలొస్తాయంటూ ఊరించిన 'ఫోనిక్స్' అనే ఓ ఆన్‌లైన్ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థను నమ్మిన బాలకృష్ణ రూ.25లక్షల అప్పు చేసి అందులో పెట్టుబడి పెట్టి మోసపోయారు. దాంతో తీవ్ర మనోవేదనకు గురైన ఆయన అప్పటి నుంచి ముభావంగా ఉంటున్నారు. ఈ క్రమంలో శనివారం విధులు ముగించుకుని ఇంటికి వచ్చిన ఆయన అప్పు తీర్చే మార్గం కనబడటం లేదు అందరం చనిపోదాం అని భార్య మానసను ఒప్పించారు. "అప్పు తీర్చలేక ఆత్మహత్యకు పాల్పడుతున్నాం మా చావులకు ఎవరు కారణం కాదు" అని సూసైడ్ నోట్ రాసి పథకం ప్రకారం వెంట తెచ్చుకున్న ఎలుకల మందును టీలో కలుపుకుని అందరూ తాగారు. ఎంతసేపటికీ చనిపోకపోవడంతో బాలకృష్ణ పక్కనే ఉన్న రూమ్‌లోకి వెళ్లి ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. భార్య మానస విషయాన్ని వెంటనే తన బంధువులకు తెలపడంతో వారు వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు బాలకృష్ణను ఆయన భార్య, కుమారులను సిద్దిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాలకృష్ణ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మానసను, పిల్లలను మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలి నుంచి సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


బాలకృష్ణ (ఫైల్)

ఉరేసుకుని కొల్చారం హెడ్ కానిస్టేబుల్ ఆత్మహత్య

- పోలీస్‌స్టేషన్‌లో ఆవరణలోనే ఘటన
- ఓ టిఫిన్ సెంటర్ నిర్వాహకురాలి భర్త, అల్లుడి బెదిరింపులే కారణం!
- పోలీసులకు మృతుడి భార్య ఫిర్యాదు

నర్సాపూర్/కొల్చారం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తాను పని చేసే పోలీస్‌స్టేషన్ ఆవరణలోనే చెట్టుకు ఉరేసుకుని ఓ హెడ్ కానిస్టేబుల్ ఆత్మహత్యకు పాల్పడడం సంచలనం రేపింది. ఈ ఘటన మెదక్ జిల్లా కొల్చారంలో జరిగింది. నర్సాపూర్‌లో నివాసముండే సాయికుమార్(50) కొల్చారం పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం తెల్లవారుజామున విధుల్లో ఉన్న సాయికుమార్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న ఓ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్, ఎస్సై గౌస్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కిందికి దింపారు. కుటుంబీకులకు సమాచారమందించి పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై సాయికుమార్ భార్య శైలజ పోలీసులకు ఫిర్యాదు చేసింది. నర్సాపూర్‌లోని ఓ టిఫిన్ సెంటర్ నిర్వాహకురాలితో సాయికుమార్‌కు పరిచయం ఉందని దీన్ని ఆసరాగా చేసుకుని నిర్వాహకురాలి భర్త, అల్లుడు డబ్బు డిమాండ్ చేశారని తెలిపింది. దీంతో కొన్నిరోజులుగా తీవ్ర మానసిక క్షోభకు గురై ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని శైలజ పేర్కొన్నది. కాగా, ఈ ఘటనపై మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్ ఆరా తీశారు.


సాయికుమార్(ఫైల్)

తెలంగాణలో నేరాల రేటు ఆందోళన కలిగిస్తోంది

- నేరాలు కాంగ్రెస్ సర్కార్ వైఫల్యానికి నిదర్శనం
- పోలీసులే ప్రాణాలు తీసుకోవడం విచారకరం
- మాజీ మంత్రి హరీశ్‌రావు



హైదరాబాద్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గత ఏడాదితో పోలిస్తే.. తెలంగాణలో నేరాలరేటు 22.5% పెరగడం ఆందోళనకరమని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. రాష్ట్రంలో మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు పెరగడం బాధాకరమన్నారు. ఆదివారం ఆయన ఈ మేరకు ఎక్స్‌లో పలు వ్యాఖ్యలు చేశారు. నేరాల సంఖ్య పెరగడం కాంగ్రెస్ సర్కారు వైఫల్యానికి నిదర్శనమన్నారు. "అత్యాచార కేసులు 28.9% పెరిగాయి. ఏడాదిలో 2,945 అత్యాచారం కేసులు నమోదయ్యాయి. అంటే.. రోజుకు సగటున 8 కేసులు. 82 శాతం అపహరణ కేసులు బాలికలకు సంబంధించినవి కావడం ఈ ప్రభుత్వానికి సిగ్గుచేటు. కాంగ్రెస్ పాలనలో మహిళలకు భద్రత లేదని ఈ గణాంకాలు తేటతెల్లం చేస్తున్నాయి" అని వ్యాఖ్యానించారు. నాలుగు నెలల క్రితం అంబర్‌పేటలో రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ గంగారెడ్డి, ఆయన భార్య హత్య కేసు ఇంకా పరిష్కృతమవ్వలేదని ఆరోపించారు. ఆర్నెల్ల క్రితం బీఆర్ఎస్ నేత శ్రీధర్‌రెడ్డి హత్య కేసులోనూ నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. "163కు పైగా కీలక కేసుల్లో పరిష్కారమే లేదు. రూ.10 కోట్ల విలువైన ఆర్థిక నేరాల్లో రికవరీలు లేవు. నేరాల తీరును చూస్తుంటే బిహార్ వంటి రాష్ట్రాలతో తెలంగాణ పోటీపడే పరిస్థితులు కనిపిస్తున్నాయి. హోంశాఖను కూడా నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి పాలనావైఫల్యానికి ఇది నిదర్శనం. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించడానికి రేవంత్‌రెడ్డి కారణం" అని ఆరోపించారు. మరోవైపు.. సోషల్ మీడియాలో అభిప్రాయాలు వ్యక్తం చేసేవారిని వేధింపులకు గురిచేస్తున్నారని, ఆఖరికి పేరు మరిచిపోతే కూడా కేసులు పెట్టి, హింసించడం దారుణమన్నారు. "రాష్ట్రంలో క్రైం రేటును తగ్గించడానికి బడ్జెట్‌ను విడుదల చేసి, పోలీసు శాఖను బలోపేతం చేయాలి. ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన పోలీసులే.. వరుసగా బలవన్మరణాలకు పాల్పడడం ఆందోళన కలిగిస్తోంది. ములుగులో ఎస్సై, సిద్దిపేటలో కానిస్టేబుల్ కుటుంబం, కామారెడ్డిలో ఓ ఎస్సై, కానిస్టేబుల్, సిరిసిల్లలో కానిస్టేబుల్ కుటుంబం, మెదక్ జిల్లా కొల్చారంలో హెడ్‌కానిస్టేబుల్.. ఇలా పోలీసులు ఆత్మహత్యలకు పాల్పడడం విచారకరం. ఈ ఆత్మహత్యలపై శాఖాపరమైన దర్యాప్తు చేయాలని డీజీపీని కోరుతున్నాం" అని విజ్ఞప్తి చేశారు.

పిల్లలు ప్రాణాలతో ఉంటే చాలనుకుంటున్నారు

"కాంగ్రెస్ పాలనలో చదువు సంగతి దేవుడెరుగు. తమ పిల్లలు ప్రాణాలతో బతికుంటే చాలని తల్లిదండ్రులు అనుకుంటున్నారు" అని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గురుకులాల దీనస్థితి చూస్తే.. బాసర సరస్వతీమాత మనసు తల్లడిల్లుతోందని ఎక్స్‌లో మరో ట్వీట్ చేశారు. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ కేజీబీవీలోని విద్యార్థులు.. అక్కడ భోజనం తినలేం.. ఇంటికి తీసుకువెళ్లాలని.. తల్లిదండ్రులను వేడుకుంటున్నారన్నారు. అనంతపేట్ కేజీబీవీ పాఠశాలలో విషాహారం తిని పదిమంది విద్యార్థులు ఆస్పత్రి పాలైన దుస్థితి నెలకొందని గుర్తుచేశారు. వాంకిడి గురుకుల విద్యార్థిని విషాహారం తిని మరణించిన ఘటన మరువక ముందే.. ఇలాంటివి పునరావృతం కావడం సిగ్గుచేటన్నారు. "రేవంత్‌రెడ్డి.. ముఖ్యమంత్రిగా, విద్యాశాఖ మంత్రి గా ఉండి కూడా.. భావిభారత పౌరుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నావ్. మీ చేతగాని పాలన గురుకుల విద్యార్థుల పాలిట శాపంగా మారింది. తక్షణం స్పందించి, విద్యార్థుల ప్రాణాలను కాపాడే చర్యలు తీసుకోవాలి" అని డిమాండ్ చేశారు.

డ్రగ్స్ క్రయ విక్రయాలకు భయపడాల్సిందే!

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర వార్షిక నేర నివేదికను విడుదల చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. మావోయిస్టుల కట్టడికి, సైబర్ నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. "సైబర్ నేరాల్లో డబ్బు పోగొట్టుకున్న వారికి రూ.180 కోట్ల మేర తిరిగి ఇప్పించాం. ఈ ఏడాది సైబర్ నేరాలకు సంబంధించి 25,184 ఫిర్యాదులు వచ్చాయి. గత ఏడాది(17,571 ఫిర్యాదులు)తో పోలిస్తే.. సైబర్ నేరాల్లో 25.18% పెరుగుదల ఉంది. సైబర్ నేరాల్లో రికవరికీ సంబంధించి దేశంలోనే తెలంగాణ టాప్‌లో ఉంది" అని వ్యాఖ్యానించారు. మొత్తమ్మీద ఈ ఏడాది నేరాల్లో 9.87% పెరుగుదల ఉందన్నారు. "గత ఏడాది మొత్తం 2,13,121 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది వాటి సంఖ్య 2,34,158గా ఉంది. వీటిల్లో 1,55,639 కేసులను నవంబరు నెలాఖరులోగా పరిష్కరించాం. ప్రాసిక్యూషన్, పోలీసు శాఖ కలిసి పనిచేయడం వల్ల చాలా కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా చేయడం సాధ్యమైంది. వీటిల్లో మూడు మరణ శిక్షలు, 215 జీవిత ఖైదు శిక్షలున్నాయి. శిక్షలు పడ్డ వారిలో 35 మంది రౌడీషీటర్లున్నారు" అని వివరించారు.

మహిళలపై నేరాలు

మహిళలపై నేరాలు స్వల్పంగా పెరిగాయని డీజీపీ చెప్పారు. గత ఏడాది 19,013 కేసులు నమోదవ్వగా.. ఈ ఏడాది వాటి సంఖ్య 19,922కు పెరిగిందన్నారు. రాష్ట్రంలో మిస్సింగ్ కేసుల్లో 18% మేర తగ్గుదల నమోదైందని వివరించారు. "రాష్ట్రంలో పనిచేస్తున్న 27 భరోసా కేంద్రాలు గృహహింస, వరకట్న వేధింపులు, అత్యాచారం కేసుల్లో బాధితులకు అండగా ఉంటున్నాయి. ఈ ఏడాది షీటీమ్స్‌కు 10,862 ఫిర్యాదులు రాగా.. వాటిపై 830 కేసులు నమోదు చేశాం. మిగతా వాటిల్లో 3,329 పెటీ కేసులు. ఇతర కేసులను కౌన్సెలింగ్ ద్వారా పరిష్కరించాం. భరోసా కేంద్రాలకు 2,964 ఫిర్యాదులు వచ్చాయి. వీటిల్లో 1,974 పోక్సో కేసులు కాగా.. 574 అత్యాచారాలు, 436 ఇతర వేధింపులకు సంబంధించిన కేసులున్నాయి" అని వెల్లడించారు. రేప్, పోక్సో కేసులకు సంబంధించి బాధితులకు ప్రభుత్వం రూ.5.42కోట్ల మేర నష్టపరిహారం ప్రభుత్వం ఇచ్చిందని తెలిపారు.

రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం

రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గాయని జితేందర్ తెలిపారు. "గత ఏడాది 23,491 రోడ్డు ప్రమాద కేసులు నమోదవ్వగా.. ఈ వాటి సంఖ్య 20,702కు తగ్గాయి. రోడ్డు ప్రమాదాల్లో మరణాలు కూడా 1.49% మేర తగ్గాయి. గత ఏడాది జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 6,640మంది మరణించగా, ఈ ఏడాది 6,541మంది మరణాలు నమోదయ్యాయి. అత్యంత ఘోరమైన ప్రమాదాలు 2,336 నుంచి 1,018కి తగ్గాయి" అని వివరించారు. రోడ్డు ప్రమాదాల బ్లాక్‌స్పాట్లను ఎప్పటికప్పుడు గుర్తించి, ఇంజనీరింగ్ నిపుణులతో చర్చించి, తగు చర్యలు తీసుకోవడం ప్రమాదాల్లో తగ్గుదల సాధ్యమైందన్నారు. డీజీపీ వెల్లడించిన మరిన్ని ముఖ్యాంశాలు..

- ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇంటర్‌పోల్ సాయం తీసుకుంటున్నట్లు డీజీపీ పేర్కొన్నారు. విదేశాల్లో తలదాచుకుంటున్న ప్రభాకర్‌రావు, శ్రవణ్‌కుమార్‌లను రప్పించే ప్రయత్నం చేస్తున్నామన్నారు.
- సంధ్య థియేటర్ ఘటనపై విచారణ కొనసాగుతోందని, కోర్టు పరిధిలోని అంశం కావడంతో దీనిపై మాట్లాడలేనని స్పష్టంచేశారు. బౌన్సర్లపై వచ్చిన ప్రతి ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని, తేడా వస్తే వదిలేది లేదన్నారు.
- మొట్ట మొదటి డిజిటల్ ఎఫ్ఐఆర్ నమోదు చేసిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు.
- కొత్తగా ఏర్పాటు చేసిన సైబర్ సెక్యూరిటీ బ్యూరో(సీఎస్‌బీ), తెలంగాణ నార్కోటిక్స్ బ్యూరో(టీ-న్యాబ్)ను మరింత పటిష్ఠం చేస్తున్నాం.
- ప్రొవిజన్ మరియు లాజిస్టిక్ విభాగం ద్వారా పాత వాహనాలు, తుక్కు సామగ్రి అమ్మకం ద్వారా రూ.9.49 కోట్లను ప్రభుత్వానికి డిపాజిట్ చేశామన్నారు.
- రాష్ట్రంలో 53,651 సీసీ కెమెరాలు పోలీసు ఠాణాల్లో ఉన్నాయని.. 11,64,645 సీసీ కెమెరాలు కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా అనుసంధానమై ఉన్నాయని చెప్పారు. సగం ఠాణాల్లో సీసీ కెమెరాలు లేవని 'ఆంధ్రజ్యోతి' అడిగి ప్రశ్నకు బదులిస్తూ.. దశల వారీగా అన్ని పోలీస్‌స్టేషన్లలో వాటిని ఏర్పాటు చేస్తామన్నారు.
- పని ఒత్తిడి, వివిధ కారణాలతో పోలీసు సిబ్బంది ఆత్మహత్యలు నమోదయ్యాయని, వీటిని నివారించేందుకు ప్రతి జిల్లా ఎస్పీ కార్యాలయంలో కౌన్సెలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.
- ఎప్పటికప్పుడు పోలీసు శాఖలో రిక్రూట్‌మెంట్లు జరుపుతున్నామని.. ఈ ఏడాది 13 వేల మంది కొత్త కానిస్టేబుళ్లు నియమితులయ్యారని డీజీపీ వివరించారు. వీరిలో 30% మహిళలేనని తెలిపారు.
- డయల్ 100, 112 సమర్థంగా పనిచేస్తున్నాయని, ఫిర్యాదు వచ్చిన 10 నిమిషాల్లో పోలీసులు సంఘటనాస్థలికి వెళ్తున్నారని వివరించారు.


రాష్ట్ర వార్షిక నేర నివేదికను విడుదల చేస్తున్న డీజీపీ జితేందర్, చిత్రంలో పోలీసు అధికారులు

చలానాలు మా లక్ష్యం కాదు

ట్రాఫిక్ చలాన్ల ద్వారా రూ. 100 కోట్లు లేదా రూ.200 కోట్లను ప్రభుత్వానికి ఇవ్వడం తమ లక్ష్యం కాదని డీజీపీ స్పష్టం చేశారు. రహదారి భద్రత, ప్రయాణికుల ప్రాణాలను కాపాడడం తమ విధి అని వివరించారు. 2014కు ముందు 4% మంది వాహనదారులే హెల్మెట్ ధరించేవారని, ఇప్పుడు వారి శాతం 80కి పెరిగిందన్నారు. రోజూ 3,500 కొత్త వాహనాలు రోడ్డెక్కుతున్నాయని, వీటిల్లో ఒక్క హైదరాబాద్‌లోనే 2 వేలకు పైగా ఉంటాయన్నారు.

పిల్లల రక్షణకు హ్యాండ్ బుక్

డిజిటల్ యుగంలో చిన్నారులు సైతం స్మార్ట్ ఫోన్లు, ట్యాబ్‌లను వాడుతున్నారు. ఇంటర్నెట్‌ను సర్ఫ్ చేయగలుగుతున్నారు. ఈ నేపథ్యంలో పిల్లల భద్రతకు సైబర్ సెక్యూరిటీ బ్యూరో(సీఎస్‌బీ) రూపొందించిన హ్యాండ్ బుక్‌ను డీజీపీ విడుదల చేశారు. స్మార్ట్ ఫోన్లను పిల్లలు ఎంత సేపు వాడవచ్చు? ఏయే యాప్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలి? పేరంటల్ కంట్రోల్ ఎలా? తదితర అంశాలపై సైబర్ సెక్యూరిటీ నిపుణులు అందజేసిన సూచనలను హ్యాండ్ బుక్‌లో పొందుపరిచినట్లు డీజీపీ వివరించారు.

పొలంలో విద్యుదాఘాతానికి గురై ఓ రైతు చనిపోయాడు. ఈ ఘటన ములుగు జిల్లా మంగపేట మండలంలో ఆదివారం జరిగింది. కోమటిపల్లి ఎస్టీకాలనీకి చెందిన రైతు జవ్వాజి రామకృష్ణ (35) ఆదివారం ఉదయం పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తీగలు సరిచేస్తుండగా షాక్‌తో మృతి చెందాడు.

సరస్వతి బ్యారేజీలో భూ భౌతిక పరీక్షలు

మహదేవపూర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని సరస్వతి బ్యారేజీలో ఆదివారం భూ భౌతిక పరీక్షలు(జియో ఫిజికల్ టెస్టులు) ప్రారంభమయ్యాయి. బ్యారేజీలో లీకులు సంభవించిన నేపథ్యంలో భూవి స్వభావాన్ని తెలుసుకొనేందుకు మూడు నెలల క్రితం ఒకటి, రెండో విడత భూ భౌతిక పరీక్షలు జరిగాయి. భారీ వర్షాల కారణంగా మూడో విడత పరీక్షలను నిర్వహించలేకపోయారు. ఈ క్రమంలో ఆదివారం వాటిని చేపట్టారు. నలుగురు శాస్త్రవేత్తలు సరస్వతి బ్యారేజీ వద్దకు చేరుకొని మూడో విడత భూ భౌతిక పరీక్షలు ప్రారంభించారు. మూడు రోజులపాటు ఇవి జరగనున్నట్లు శాస్త్రవేత్తలు ధనంజయ్ నాయుడు, వివేక్, ప్రశాంత్ సింగ్ నవాంగ్ తెలిపారు.

శంషాబాద్ విమానాశ్రయంలో మద్యం మత్తులో ప్రయాణికురాలి హల్‌చల్

శంషాబాద్ రూరల్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా శంషాబాద్ విమానాశ్రయంలో మద్యం మత్తులో ఓ ప్రయాణికురాలు హల్‌చల్ చేసింది. సీఐ బాల్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని ఓల్డ్‌సిటీకి చెందిన అఫ్రిన్ ఖాన్ అనే మహిళ శనివారం రాత్రి ఇండిగో విమానంలో ముంబై వెళ్లడానికి శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకుంది. ఇండిగో విమానయాన సంస్థ సిబ్బంది ఆమెకు ఇద్దరు మగవారి మధ్య సీటు కేటాయించారు. దాంతో తనకు వేరే సీటు వేరే కేటాయించాలని సిబ్బందిని ఆమె కోరారు. అందుకు నిరాకరించడంతో సిబ్బందితో పాటు తోటి ప్రయాణికులతో ఆమె వాదనకు దిగింది. అప్పటికే ఆమె మద్యం మత్తులో ఉన్నట్లు గుర్తించిన విమానాశ్రయ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. కౌన్సెలింగ్ అనంతరం ఆమెను ముంబైకి పంపించారు.

ఆటో టైరు కింద నలిగి చిన్నారి మృతి

- రంగారెడ్డి జిల్లా పడకల్ గ్రామంలో ఘటన


తలకొండపల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): బోసి నవ్వులు.. చిట్టిపొట్టి మాటలతో అప్పటి దాకా అమ్మానాన్నలతో గడిపిన 11 నెలల చిన్నారి కానరాని లోకాలకు తరలిపోయి వారికి తీరని శోకాన్ని మిగిల్చింది. ఆడుకుంటూ ఆటో కిందకు వెళ్లిన పాపను గమనించని డ్రైవర్ ముందుకు కదిలించడంతో టైరు కింద నలిగి ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం పడకల్ గ్రామంలో ఆదివారం జరిగింది. మధ్యప్రదేశ్‌కు చెందిన పుష్పరాజ్ యాదవాని కుటుంబంతో కలిసి కొన్నేళ్ల క్రితం బతుకుదెరువు కోసం పడకల్‌కు వచ్చాడు. గ్రామానికి చెందిన ఓ రైతు డెయిరీలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం పాల డబ్బాలను ఆటోలో లోడ్ చేస్తుండగా.. పుష్పరాజ్ 11 నెలల కూతురు ప్రియాన్సి ఆడుకుంటూ ఆటో కిందకు వెళ్లింది. గమనించని డ్రైవర్ ఆటోను ముందుకు కదిలించడంతో చిన్నారి టైరు కింద పడి తీవ్రంగా గాయపడింది. కడ్తాల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా వైద్యులు చిన్నారిని పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. పుష్పరాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జీవో 317 బాధితులకు న్యాయం చేయాలి

- తిరిగి సొంత జిల్లాలకు పంపాలి
- ఎంప్లాయిస్ అండ్ టీచర్స్ జేఏసీ డిమాండ్

కవాడిగూడ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జీవో 317తో జిల్లాలు మారిన ఉద్యోగ, ఉపాధ్యాయులను తిరిగి సొంత జిల్లాలకు పంపించాలని జీవో 317 డిస్‌లోకేటెడ్ ఎంప్లాయిస్ అండ్ టీచర్స్ జేఏసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పడకంటి అజయ్‌కుమార్, ఎలగొండ రత్నమాల ప్రభుత్వా న్ని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు టీపీసీసీ అధ్యక్ష హోదాలో తమ న్యాయమైన సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి అధికారంలోకి రాగానే సీఎం రేవంత్‌రెడ్డి పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారు పేర్కొన్నారు. జీవో 317 ద్వారా స్థానచలనం చెందిన ఉద్యోగ, ఉపాధ్యాయుల జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరాపార్కు వద్ద సత్వర న్యాయ పోరాట దీక్ష నిర్వహించారు. ఈ దీక్షలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జీవో 317 బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

స్త్రీవాద కవయిత్రుల తండ్రి ప్రేమ



ఒక నాన్న వేలుపట్టి నడిపించి మార్గదర్శనం చేసే దిక్సూచి కావొచ్చు. ఇంకో నాన్న మధ్యలోనే గాడి కింద పడేసి అనుబంధాల్ని విడిచినవాడు కావచ్చు. కొందరికి నాన్న ఇష్టుడు. మరికొందరికి పెత్తనం చెలాయించే అధికారం. అమ్మని బానిసగా చూసే నాన్నలూ ఉన్నారు. నాన్న పేరు మీదే కదా పితృ స్వామ్య వ్యవస్థ ఉంది. ఐతే, స్త్రీవాదాన్ని బలంగా వినిపించిన కవయిత్రులు కొందరు వాళ్ళ తండ్రిని హృదయాలకు హత్తుకున్నారు.

ఘంటసాల నిర్మల తన తండ్రి స్మృతిలో వెలువరించిన కవిత 'ఒక మామూలు నాన్నారి కోసం'. రైల్వే శాఖలో నలభై ఏళ్ల పాటు పనిచేసిన తండ్రి జీవితాన్ని కవయిత్రి మన ముందుంచుతారు. ఎక్కే రైలుతో దిగే రైలుతో దాదాపు 40ఏళ్ల జీవితం గడిచిపోయిందంటారు: "నాన్నారూ/ ఉన్నన్నాళ్ళూ మాకు జవజీవాల్ని సమకూర్చి/ జీవితాల్ని అమర్చి పెట్టినన్నాళ్ళూ మీరు/ సమాజం రుద్దిన విలువల చట్రంలో ఆపాదించిన/ సూత్రాల చక్రంలో నలుగుతూ/ నలుగుతున్నాననుకోకుండానే కాలాలు గడిపారు/ సగం జీవితం చద్ది అన్నమే! రెండు క్యారేజీలతో ఇవాళ తెల్లవారుజామున/ మెయిలుకో, సర్కారుకో డ్యూటీ ఎక్కితే మళ్ళీ రావడం రేపు రాత్రికే" అని దిగులుపడతారు కవయిత్రి. నాన్న తనకోసం లెక్కలు చెప్పడం, స్టీలు క్యారేజీ తనకు ఇచ్చి సత్తు క్యారేజీ మోసుకెళ్ళడం, పోటీలో బహుమతులు వస్తే ఆయనే గెలిచినట్టు ఆనంద పడటం, పెద్దమ్మాయి సంగీతానికి పరవశం చెందడం... ఇలా ఎన్నో తీపిగుర్తులను కవయిత్రి కవితలో నమోదు చేశారు. "అంత చిరంతపు తీపి బాల్యాన్ని/ ఇంత ఘాటయిన క్రమశిక్షణనీ/ రంగరించి ఇచ్చిన మీరు/ అలా చెప్పకుండా అధాటున/ వెళ్ళిపోయారేం/ నాన్నారూ! ఉద్యోగాసాంతం అసలెప్పుడూ ఆఖరి నిమిషంలోనే బండి అందుకున్న మీరు/ ఎంత డ్యూటీ అయిపోయిందనుకుంటే మాత్రం/ అంత అకస్మాత్తుగా వెళ్ళిపోతారా!" అని విలపిస్తారు. ఆయన దూరమైన 'దిగులు దుఃఖం' ఉండ కడుతూనే ఉంది. కళ్ళ కాల్వలు ఎడ తెగడం లేదని కవయిత్రి కలం కన్నీరు కార్చింది.

పితృస్వామ్య వ్యవస్థపై తిరుగు బావుటా ఎగరేసిన కవయిత్రి మందరపు హైమవతికి నాన్న మాత్రం అమ్మలా కనపడ్డాడు. ఈ కవయిత్రి నాన్నను గుండెల్లో పెట్టుకున్నారు. "అమ్మ బొజ్జలో బజ్జున్నది/ ఆడపిల్లని తెలిస్తే/ విషం సూది గుచ్చి/ విముక్తి గీతం పాడుతారు/ కొందరు నాన్నలు/ నాన్నకు నేనంటే ఆరో ప్రాణం" అంటూ అక్షరాల్లో దాచుకున్నారు. కొందరికి నాన్నంటే చందమామ కథల్లో రాక్షసుడు. నాన్నని చూస్తే గుండెల్లో బాంబులు పేలతాయి. ఏం కావాలన్నా అమ్మే మధ్యవర్తి. కానీ కవయిత్రి నాన్న ఇందుకు మినహాయింపు: "బాల్యంలో నా అభీష్ట క్రీడాస్థలం/ నాన్న వక్షస్థల మైదానం/ చిన్నప్పుడు నిద్ర మంచం మీద నుంచి కింద పడి/ గుక్క పట్టి ఏడుస్తున్నప్పుడు/ భుజం మీద ఎత్తుకొని తెల్లవార్లు జోకొట్టి/ నిద్రపుచ్చిన లాలి పాట" అని నాన్నకి కితాబు ఇస్తారు. వానలో తనతో పాటు పడవలు వదిలిన బాలుడు నాన్న, గగన వీధి నుండి దిగి ఇంటికొచ్చిన చందమామ నాన్న, శీతాకాలం గోరువెచ్చని సూరీడు నాన్న, మార్కులు తగ్గినపుడు అమ్మ కోప్పడితే చల్లని మాటల ఛత్రం నాన్న... అంటూ కవయిత్రి నాన్నను పొదువుకుంటారు. "ప్రపంచ సాహిత్యంలో నా అభిమాన పదం నాన్న" అని ప్రకటిస్తారు. ఒక స్త్రీవాద కవయిత్రి 'నాన్న' నా అభిమాన పదం అని ప్రకటించారంటే తండ్రి ఆమెను ఎంత ప్రభావితం చేశాడో తెలిసిపోతుంది.

ఉన్నట్టుండి వెళ్లిపోతారని తెలిసినా, వెళ్ళిపోయిన తర్వాత ఆ జ్ఞాపకాల నుండి తేరుకోవడం కష్టమే. అవెప్పుడూ కళ్ళ ముందు కదులుతుంటాయి. అలాంటి జ్ఞాపకాల కలబోతతో 'కొనసాగింపు' అనే కవిత రాశారు శిలాలోలిత. "నాన్న వెళ్ళి తలుపేసుకున్నారు. అయితే, అది ఎప్పటికీ తీయని తలుపు" అని కవయిత్రి విలవిలలాడిపోతారు. "అర నిమిషం కరెంటు పోయినా/ ఊపిరాడని నాన్నను/ గాజు ముక్కల గదిలో మూసేశాం కదా/ చిన్నప్పుడు స్నానాలు చేయించిన నాన్నను/ బాకీ తీర్చుకోవడానికా అన్నట్లు తలో చెంబూ నీళ్ళు పోసి స్నానాలు చేయించాం" అంటారు.

నాన్న ప్రేమను, ఆప్యాయతను, అనురాగాన్ని పొంది వెలిగిన మరో కవయిత్రి చల్లపల్లి స్వరూపారాణి. 'నాన్న కోసం' అనే కవితలో నాన్నను ఆమె ఆంతరంగిక మిత్రుడుగా చూస్తారు. బాల్య స్నేహితుడిగా చాటుతారు. తండ్రి ముందు భూమ్యాకాశాలు చిన్నబోతాయంటారు. తండ్రి స్మృతి తొలిపొద్దులా మెరుస్తూనే ఉంటుందట. "మా నాన్న రిమోట్ నాన్న కాదు, పోలీసు నాన్న కాదు" అంటూ పొంగిపోతారు. అంతలోనే నాన్న జ్ఞాపకాల 'అపరాధ శిలువ' గుండె కెత్తుకున్నాను అని ఇలా వేదనకు గురౌతారు: "నీ సమాధి తల వాకిట్లో/ వెలితి వెలితిగా నిలబడి/ బొట్లు బొట్లుగా కరిగే/ కొవ్వొత్తిని నేనే నాన్నా".

కొన్ని సందర్భాల్లో తండ్రి మాటలను పిల్లలు పెడచెవిన పెడతారు. 'నీకేం తెలుసు పో' అంటారు. కానీ వారు సంతానాన్ని పొందాక, తండ్రి పాత్ర ఏమిటో నెమ్మదిగా తెలుస్తుంది. తండ్రి దూరమయ్యాక అర్థం కావడం మొదలవుతాడు. ఈ నేపథ్యంలో శైలజామిత్ర 'తండ్రి స్మృతి' కవిత రాశారు: "నాన్నా! సగానికి పైగా జీవితం గడిచాక/ ఇప్పుడిప్పుడే నాకు అర్థం అవుతున్నావు/ ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి/ కలిస్తేనే ఒక రోజవుతుందని తెలుసు కాని/ స్వార్థం, అసూయ, కపటం, అబద్ధం/ కలగలిపితేనే నేడొక మనిషని ఒకప్పుడు నువ్వు చెప్పింది గుర్తుకు వచ్చి/ ఇప్పుడిప్పుడే నాకు అర్థం అవుతున్నావు నాన్నా" అంటూ తండ్రి చెప్పిన సమాజ పోకడల్ని కవయిత్రి గుర్తు చేసుకున్నారు.

కొందరు నాన్నలు అపురూప జ్ఞాపకాలైతే, మరికొందరు చేదు జ్ఞాపకాలు. కె. గీత 'చివరి స్పర్శ' కవిత రెండు పార్శ్వాలనూ చూపిస్తుంది. నాన్న ఒక గుణపాఠంగా మిగిలాడు గానీ, ఏ ఒక్క గుండెలోనూ చిత్రపటం కాలేకపోయాడని కవయిత్రి బాధపడతారు. తండ్రి వీపు మీద ఆడిన బాక్సింగ్, భుజాలపై తిరిగిన రంగుల రాట్నం... ఇలా కొన్ని జ్ఞాపకాల్ని చెబుతారు. ఐతే తల్లిని కొట్టిన తండ్రిని పెట్రోలు పోసి తగలేయాలనిపించిందని కూడా నిక్కచ్చిగా చెప్తారు: "అమ్మ కళ్ళు నిండినప్పుడల్లా/ పెట్రోలేసి నిన్ను తగలెయ్యాలన్పించేది/ నిన్న ఎందుకో బతికితే బావుణ్ణనిపించింది/ హఠాత్తుగా పాడె మీంచి లేచి/ నువ్వు నడిచెళ్ళిపోతే బావుణ్ణనిపించింది" తండ్రి బతకాలని కవయిత్రి కోరుకున్నారు. "నువ్వు నాకు వద్దనిపించే నాన్నవి/ అమ్మని కష్టపెట్టిన రాక్షసుడివి/ అయినా నా శరీరంలో భాగం కాలిబూడిదైనట్లయింది/ పార్థివ కర్మలో అన్నయ్య 'డేడీ' అని పిల్చినపుడు/ నిన్ను పట్టి కుదిపి తీసుకెళ్ళి పోవాలన్పించింది" అంటారు.

ఈ కవితలన్నీ కూడా కవయిత్రులు వాళ్ల తండ్రులు చనిపోయాక రాసిన కవితలు. సాహితీ లోకంలో తమ తండ్రులకి వాళ్ళు ఇచ్చిన గొప్ప నివాళి. తండ్రి చనిపోయాక ఆయన కూర్చున్న కుర్చీ, పడుకునే మంచం, తినే కంచం, చదివే పుస్తకం దేన్ని చూసినా ఆ జ్ఞాపకాల లోకి వెళ్ళిపోతాం. చదవాలే గాని ప్రతీ తండ్రీ ఒక బతుకు పుస్తకం.

■ సుంకర గోపాలయ్య
✆ 94926 38547

వివిధ

vividha@andhrajyothy.com సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

దివాకర్ల వేంకటావధాని జీవితం, సాహిత్యంపై సదస్సు

సాహిత్య అకాడమీ, తెలుగు శాఖ ఉస్మానియా విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో దివాకర్ల వేంకటావధాని జీవితం, సాహిత్యంపై సదస్సు డిసెంబర్ 31 ఉ.10 గంటల నుంచి ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజి, రూమ్ నెంబర్ 121లో జరుగుతుంది. అధ్యక్షత సాగి కమలాకర శర్మ, కీలకోపన్యాసం శలాక రఘునాథ శర్మ, పత్ర సమర్పణ అనుమాండ్ల భూమయ్య, సంగనభట్ల నరసయ్య, కసిరెడ్డి వెంకటరెడ్డి, పిల్లలమర్రి రాములు, జి అరుణకుమారి, గంధ్ర లక్ష్మణరావు. కార్యక్రమంలో సి. మృణాళిని, సి. కాశీం, దివాకర్ల రాజేశ్వరి, ఏలే విజయలక్ష్మి, ఎస్. రఘు పాల్గొంటారు.

సి. మృణాళిని

పిల్లల బొమ్మల పుస్తకాల కోసం రచనలకు ఆహ్వానం

తానా – మంచి పుస్తకం ఆధ్వర్యంలో పదేళ్ళ లోపు పిల్లల కోసం తెలుగులో బొమ్మల కథల పుస్తకాలు – 2025 కోసం రచనలకు ఆహ్వానం. ఎంపిక ప్రక్రియ రెండు దశలు. మొదటి దశలో మొత్తం కథ, నమూనా బొమ్మలు మాకు 2025 మార్చి 31లోపు అందజెయ్యాలి. ఎంపికైన కథలు రెండవ దశలోకి వెళ్తాయి. ఈ దశలో సుమారు 5 కథాంశాలను ఎంపిక చేస్తాం. ఒక పుస్తకానికి కథ రాసిన వారికి, బొమ్మలు వేసిన వారికి రూ.15వేల చొప్పున పారితోషికం ఇస్తాం. 2025 మే 31లోపు బొమ్మలతో సహా ముద్రణకు సిద్ధంగా ఉన్న పుస్తకాన్ని అందజేయాలి. ఈ పుస్తకాలను తానా – మంచిపుస్తకం కలిసి 2025 జులై నాటికి ప్రచురిస్తాయి. మరిన్ని వివరాలకు: కె. సురేష్ (99638 62926), వాసిరెడ్డి నవీన్ (98483 10560). చిరునామా: మంచి పుస్తకం, 12-13-439, వీధి నెం.1, తార్నాక, సికింద్రాబాద్ 500017. ఈమెయిల్: info@manchipustakam.in.

కె. సురేష్

వేమన పద్య పోటీలు

వేమన ఫౌండేషన్, అనంతపురం ఆధ్వర్యంలో జనవరి 9లోగా వంద విద్యా సంస్థలలో వేమన పద్య పోటీలను నిర్వహించాలనుకొన్నాం. ఎంపికైన విద్యా సంస్థలకు ప్రసంశా పత్రాలు, పతకాలు, వేమన చిత్రం, పుస్తకాలు అందచేస్తాం. ఆసక్తి ఉన్నవారు 99639 17187 నెంబరులో సంప్రదించగలరు.

అప్పిరెడ్డి హరినాథరెడ్డి

కథా సంపుటాలకు ఆహ్వానం

కందికొండ రామస్వామి స్మారక జాతీయ పురస్కారం కోసం 2023లో ముద్రితమైన కథా సంపుటాలు మూడు ప్రతులను జనవరి 31, 2024 లోపు పంపాలి. బహుమతి పొందిన కథా సంపుటికి నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక తరఫున ఏప్రిల్ నెలలో రూ.10వేల నగదు పురస్కారం, జ్ఞాపిక ప్రదానం జరుగును. ప్రతులు పంపే చిరునామా: పి. అబ్దుల్ వహీద్ ఖాన్, ఇంటి నెం. 15 120/4/1, రహత్ నాగర్ కాలనీ, నాగర్ కర్నూల్ – 509209, ఫోన్: 9441946909.

వనపట్ల సుబ్బయ్య



లాహిరి

మరో మజిలీ
ప్రతి ఏడూ ఒక విడిది.
అవును విడిపోయేది విడిచేవరకూ
ప్రయాణం ఎప్పటికప్పుడు 'విడిది'

కలిపి కుట్టేది ఏదోతెలియదు
బంధాలూ, బంధనాలూ
ఏర్పడుతూనే వుంటాయి
వదిలించుకుని విరాగి కావలసిన వయసునా
ప్రేమానురాగాలు పెనవేసుకుంటూనే వుంటాయి.
జీవన లాలస పట్టుకుని జీరాడుతూనే వుంటుంది.
తండ్రీ కొడుకు నుండి తాతా మనుమడుకు ఎదిగాక
బాధ్యత కావడి బరువు కాకున్నా
ఆపేక్ష సాపేక్షికమై
కొత్త ఆశల ఆనంద శ్వాసలందుకుంటుంది

వద్దనుకుంటే రద్దయ్యే చట్టం కాదు
పెనవేసుకునే బుల్లి చుట్టం.
కనపట్టం తరువాయి
విచ్చుకునే చిట్టిహాసరేఖలు
చుట్టుకునే వంశవృక్షశాఖలు
ఎంత వద్దనుకున్నా ఆరాటం
అటు వశీకరణమవుతూంటుంది.

ఎదుగుదల అక్కడిదే ఇక నవప్రభాతం
ఇక్కడిది కృష్ణపక్ష అవనతం
వెన్నెలకూ అమావాస్యకూ పొత్తు అంటే
గమ్మత్తు కావచ్చు కానీ
అదే జీవితం మత్తు.
నిజమే!
అమ్మా నాన్న, భార్యాభర్త,
కొడుకు కోడలు, తాతా మనుమడు
ఏమన్నా నాణేనికి ఇరు పార్శ్వాలే
బంధం 'విలువ' అదే.

అందుకే
పాడుకుంటాను ఆడుకుంటాను.
తోడు అంటాను వీడు తంటాను.
ఆఖరిచరణం తర్వాత కూడా పల్లవి వుంటుంది.
పాట సాగుతూనే వుంటుంది
బాట సాగుతూనే వుంటుంది.

మజిలీ మజిలీ లోనూ బిజిలీ వుంటుంది
వెలుగు నిజదారయై
ఒకరి నుంచి మరొకరికి సంక్రమిస్తుంది
సమకాలీనం లోనే భవిష్యత్తు రూపుదిద్దుకుని
వర్తమానం గతమయ్యే 'వర్తమానం' వుంటుంది.

విడిదిని అలంకరించుకుంటూనే వుండాలి.
ఆఖరి మజిలీ వరకూ
ఆశావిశ్వాసాల ఆనందం జీవనదిలో
లాహిరి సాగుతూనే వుండాలి.

■ సుధామ



రచన గుర్తున్నంతగా రచయిత గుర్తుండరు

చదువు ముచ్చట

శ్రీసుధ మోదుగు

మొదటిసారి ఏ పుస్తకాన్ని ఇష్టంగా చదవటం గుర్తుంది?

చిన్నప్పుడు స్కూల్లో టీచర్ చెప్పిన కథలలో గుర్తున్న కథ గజేంద్రమోక్షం, భాగవతంలోనిది. ఆ సమయంలోనే ఇష్టంగా చదివిన పుస్తకం పంచతంత్రం. ఒక కథలోంచి మరో కథలోకి వెళ్లడం, కథలన్నీ ఒకదానితో ఒకటి అల్లుకొని ఉండడం... ఆ కనెక్టివిటీ అప్పట్లో బాగా ఆకర్షించింది. ఆ కథల్లో ప్రతి కథ చివర్లో నీతి ఉంటుంది. నీతి ఎందుకు చెప్పాలి, ఇదే నీతి ఎందుకు అవుతుందని మా టీచర్‌ని అడిగితే.. కథలో నువ్వు తెలుసుకున్న విషయం, అర్థం చేసుకున్న విషయం ఏంటి అని అడిగారు. అది కథలను నా దృష్టితో చూడటానికి తోడ్పడింది.

ఈమధ్య చదివిన పుస్తకాల్లో నచ్చినవి?

రచనా రంగం లోకి వచ్చి కవిత్వం, కథలు, నవలలు ఇలా అనేకంగా నన్ను నేను వ్యక్తీకరించుకుంటున్న క్రమంలో చదవడం కొంత తగ్గింది. ఈమధ్య చదువుతున్న వాటిలో రమణజీవి కథలు, త్రిపుర కథలు, అజయ్ ప్రసాద్ కథలు, చంద్ర కన్నెగంటి కథలు నాకు నచ్చిన వాటిలో ఉన్నాయి. అనువాదాల్లో తమిళ రచయిత జయమోహన్ కథలు నచ్చాయి.

మీ పఠనాభిరుచి కాలంతోపాటు ఎలా మారింది?

చాలా డ్రాస్టిక్‌గా మారింది. నేను మెడిసిన్ చదువుతున్నప్పుడే శరత్ సాహిత్యంతోపాటు స్పిరిచువల్ బుక్స్ కూడా చదివాను. అలాగే మొదటిసారి చార్లెస్ డికెన్స్ రాసిన చారిత్రక నవల 'ఏ టేల్ ఆఫ్ టూ సిటీస్' చదివాను. దాంతో అప్పటి వరకు క్లాసిక్ లిటరేచర్, ఇంగ్లీష్ నవలలపైన ఉన్న అభిప్రాయం మారిపోయింది. మరో పదేళ్ళకి ఒక స్నేహితురాలు పరిచయం చేసిన భగవద్గీత, డిసైపుల్స్ ఆఫ్ రామకృష్ణ లాంటి పుస్తకాలు చదివాను. అది క్రమంగా స్పిరిచువల్ అండ్ ఫిలసాఫికల్స్ పుస్తకాలు వైపు మళ్ళడానికి దోహదం చేసింది.


మీ నమ్మకాల్ని, దృక్పథాన్ని ప్రభావితం చేసిన రచయిత?

రచన గుర్తున్నంతగా రచయిత గుర్తుండరు నాకు. పెద్దయ్యాక నన్ను ఎక్కువ ప్రభావితం చేసిన పుస్తకం భగవద్గీత. అదేవిధంగా పాశ్చాత్య ప్రపంచానికి బుద్ధిజాన్ని పరిచయం చేసిన పాల్ కారస్ 'ద గాస్పెల్ ఆఫ్ బుద్ధ' పుస్తకం కూడా నా మీద ప్రభావం చూపింది. కవిత్వం విషయంలో బాలగంగాధర్ తిలక్ 'అమృతం కురిసిన రాత్రి', ఠాగూర్ 'గీతాంజలి' చాలా ఇష్టంగా చదివాను. మాయా ఏంజెలో, ఖలీల్ జిబ్రాన్‌ల కవిత్వం చదివిన కొద్దీ నచ్చేది.

సాహిత్యంలో మీకు బాగా నచ్చిన పాత్ర ఏది?

మార్క్ ట్వైన్ 'టామ్ సాయర్' చిన్నప్పుడు నన్ను నేను ఐడెంటిఫై చేసుకున్న పాత్ర. అది తొమ్మిదో తరగతిలో నాన్ డీటెయిల్‌గా వచ్చిన పుస్తకం. 'మర్చెంట్ ఆఫ్ వెనిస్'లో షైలాక్ పాత్ర కూడా చాలా రోజులు వెంటాడింది. పెద్దయ్యే కొద్దీ పాత్రల కంటే బాగా, నచ్చిన పుస్తకంతో ప్రయాణించడం అలవాటయింది. అలా వచ్చిన అనుభూతి చాలా రోజులు నన్ను అంటిపెట్టుకొనే ఉండటం గమనించాను.

ఏ గత కాలం రచయితనైనా కలిసి మాట్లాడగలిగితే ఎవరితో, ఏం మాట్లాడతారు?



బాగా ఇష్టం రచనలే, రచయితల గురించి ఎప్పుడూ ఆలోచించలేదు. కానీ ఒక్కసారి గాంధీ గారి ఆత్మకథ 'ద స్టోరీ ఆఫ్ మై ఎక్స్‌పెరిమెంట్స్ విత్ ట్రూత్' చదివినప్పుడు డిస్టర్బ్ అయ్యాను. ఆయనను ఒక్కసారి కలిసి కొన్ని ప్రశ్నలు అడిగి నిజాలు తెలుసుకోగలిగితే బావుండేదనిపించింది. ఆయన పూర్తి చేయకుండా వదిలివేసిన ఖాళీల వల్ల ఆ పుస్తకం పాక్షికమైన నిజాయితీతో రాసినట్లు అనిపించడం వల్లనేమో.

రచన విషయంలో మీకు దొరికిన మంచి సలహా, మీరు ఎప్పుడూ పాటించేది?

నాకు నచ్చిన మంచి సలహా– మన పాదముద్రలు ఈ భూమ్మీద నుంచి ఎంత త్వరగా మాయమైతే అంత మంచిది. రచన విషయంలో కచ్చితంగా పాటించేది ఒక్కసారి రచన అయిపోయాక దానిని డిస్టెన్స్ చేసుకోవడం. రచనలో నా ప్రమేయం లేకుండా చూసుకోవడం.

(శ్రీసుధ మోదుగు కవి, రచయిత. ఆమె కవిత్వ సంపుటాలు 'అమోహం', 'విహారి', 'గొంగళి పురుగుల సామ్రాజ్యం'; కథా సంపుటాలు 'రెక్కల పిల్ల', 'డిస్టోపియా', 'జాగ్రత స్వప్నం'; నవల 'అంతర్హిత'.)

అనుభూతి కవిత్వ చర్చల మధ్య అస్తిత్వ ఒరిపిడి

నా మొదటి పుస్తకం

అఫ్సర్

'I came here not to give peace
but to war' - Matthew 10:34

ఎలా దొరికిందో దొరికింది బైబిల్. స్కూల్లో వున్నప్పుడు పాఠ్య పుస్తకాల మీద తిరుగుబాటు బావుటా ఎగరేసి ఖమ్మం లైబ్రరీ లోనో, బెజవాడ ట్రిప్ వేసి ప్రబోధ బుక్ సెంటర్ లోనో, ఖాదర్ బాబాయ్ ఇంట్లోనో దొరికిన ప్రతి పుస్తకం చదివే కాలంలో. అందులో Psalms చదివి, వాటి ప్రేమలో పడిపోయి, కొన్ని బట్టీ కొట్టడం అలవాటైంది. అలా బట్టీ కొట్టిన వాక్యాల్లో ఇదొకటి.



అదే 1990 కవిత్వ సంపుటి 'ఇవాళ'కి టాగ్‌లైన్‌గా మారింది. అట్లా మతప్రతీకల్ని తీసుకొని, సమకాలీన వాస్తవికత గురించి, స్వానుభవాల గురించీ రాయడం ఎక్కువమందికి నచ్చింది. అనుభూతి కవిత్వం గురించి చర్చలు జరుగుతున్న కాలంలో 'ఇవాళ'లో ఈ అస్తిత్వ ఒరిపిడి చాలామందికి కొత్తగా అనిపించింది. అంతకు నాలుగేళ్ల కిందట సీతారాం, ప్రసేన్‌తో కలిసి 'రక్తస్పర్శ' అచ్చయినా, అన్నివిధాలుగా నా తొలి పుస్తకం అనదగ్గది 'ఇవాళ'.

ఇస్మాయిల్ తరచూ ఉత్తరాలు రాసే కాలం అది. "మీరు తెలుగు కవిత్వం చట్రాలు బద్దలు కొడుతున్నారు. విమర్శకులు ఏం అనబోతున్నారో నేను ఇవాళే చెప్పేస్తున్నా వాళ్లందరి మొదటి వాక్యం ఇది 'తెలుగు కవిత్వం' కానే కాదు!" ఆయన అన్నదానికి భిన్నంగా ఏమీ జరగలేదు. అయితే, ఆ మాట పాజిటివ్ కోణం నుంచి అనడం మొదలు పెట్టారు. కవిత్వ అభిమానులు పుస్తకాన్ని హాయిగా అందుకున్నారు. వెంటవెంటనే సమీక్షలు వచ్చాయి. ఫ్రీ వర్స్ ఫ్రంట్ తో సహా ఆ రెండేళ్లలో కనీసం పదిహేను అవార్డులు 'ఇవాళ'కి దక్కాయి.

ఆంధ్రజ్యోతిలో పనిచేస్తున్న తొలిరోజుల నుంచీ పొనుగోటి కృష్ణారెడ్డికి నేనంటే అవ్యాజమైన ప్రేమ. "నీ కవిత్వం పుస్తకం రావాల్సిందే!" అని వెంటాడి మరీ ఈ పుస్తకం వేయించాడు. ఈ పుస్తకానికి స్నేహపూర్వక ప్రూఫ్ రీడర్ కొండేపూడి నిర్మల. పుస్తకంలో ఒక్క అచ్చుతప్పు లేదంటే కారణం ఆమె శ్రద్ధ మాత్రమే. ఇందులో కవితలు తొలిసారిగా విన్నవాళ్లు అప్పటి నా రూమ్మేట్ సౌదా, ఆంధ్రజ్యోతిలో కొత్తగా చేరిన వంశీకృష్ణ, అల్లం నారాయణ.

పుస్తకం వచ్చేసింది అని తెలియగానే వేగుంట మోహన ప్రసాద్, ఇంద్రగంటి శ్రీకాంత శర్మ, టీయల్ కాంతారావు పరుగుపరుగున ప్రెస్‌కి వచ్చి, తొలి ప్రతులు రెండేసి కొనుక్కున్నారు. ఆ తరవాతి కాపీ బెజవాడ మొగల్రాజపురంలో మా పక్కింట్లో వున్న చిరకాల మిత్రుడు వేణుగోపాల్‌కి అందింది. ఆవిష్కరణల హడావుడి ఏమీ చేయలేదు. కానీ, 1992 తరవాత ఈ పుస్తకానికి ఉమ్మడిశెట్టి అవార్డుతో మొదలుపెట్టి మద్రాస్ తెలుగు అకాడెమీ పురస్కారం దాకా రావడంతో అటు ప్రొద్దుటూరు నుంచి మద్రాస్ దాకా, మళ్ళీ హైదరాబాద్ నుంచి ఢిల్లీ దాకా సత్కార సభలు జరిగాయి. నా ప్రమేయం ఏమీ లేకుండానే అప్పటి ప్రసిద్ధులు ఈ సభల్లో అతిథులుగా వచ్చి 'ఇవాళ' గురించి మాట్లాడారు.

ఇందులోని 'ఇదే నా జాతీయ గీతం' కవితను కొన్ని వందల సభల్లో సినారె వినిపించేవారు. అదే సమయంలో కవిత్వంలో ఇంత సంక్లిష్టత అవసరమా అంటూ త్రిపురనేని మధుసూదన రావు గారు ఈ పుస్తకం మీదే దాదాపు 15 పేజీల విమర్శ రాశారు. కెకె రంగనాథా చార్యులు 'సమాంతర' వేదిక మీద మొట్టమొదటిసారి "సంక్లిష్టత" అన్న అంశంపై హైదరాబాద్ పిలిపించి మరీ నా చేత ఉపన్యాసం ఇప్పించారు. ఇంకోవైపు "అఫ్సర్ బ్రాండ్ కవిత్వం" అంటూ రాజీవ్ ఆంధ్రజ్యోతిలో రాసిన సగం పేజీ వ్యాసం అనేక చర్చలకు దారితీసింది. కొత్త కవిత్వానికి ఇది కొండగుర్తు అని కేవీయార్ ప్రతి సభలో ఈ కవిత్వ శిల్పాన్ని, అందులోని ప్రతిఘటన తత్వాన్ని చెప్పేవారు. "రక్తస్పర్శతో పాటు ఇది నా బెడ్ సైడ్ బుక్" అని వీవీ అన్నారు. 1992 ఫ్రీ వర్స్ ఫ్రంట్ అవార్డు వచ్చినప్పుడు మొట్టమొదటిసారిగా శీలా వీర్రాజు గారు అవార్డు మెమేంటోని ఆస్కార్ ఫలకం మోడల్లో చేయడం కూడా అప్పుడు సాహిత్య వార్తగా మారింది. ఆ విధంగా 'ఇవాళ' అనేక కొత్తదనాలకు నాంది పలికి, అనిర్వచనీయమైన తృప్తినిచ్చింది, నాకూ నా నిజమైన మిత్రులకు!





ఈ నదిని దాటాలి...

ఇది రక్త నది
ఋతువు ఏదైనా ఎండిపోని రుధిర ఝరి

విశ్వాసాలు విఘాతాలై
విచ్చుకుంటున్న కత్తుల విన్యాసంలో
కుత్తుకలు తెగి
వెల్లువెత్తుతున్న ఆగని నెత్తుటి ప్రవాహాల తడి

దీని పుట్టుక ఏ పర్వత సానువుల్లోనో కాదు
పరాయి నీడను పడగ నీడగా తలచే
అసహన అరాచక ఆలోచనల సుడుల్లో..

ఈ నదిని దాటాలి
రక్తపు జాడలు లేని దరిని చేరాలి

మతాలు మానవత్వపు తడి లేని మరీచికలు
మనుషులను విడదీసి ఆడించే
మాయా జలతారు తెరలు

అధికార దండానికై ఆరాటపడే
దండ నాయకుల దహన క్రీడలో
గుండెల్లో గుణపాలు దించుకుంటున్న
గుళ్ళు.. మసీదులు

మనిషి రంగు రుచి వాసన మతమే అయ్యి
వికర్షిత ధ్రువాలై విస్ఫోటిస్తున్న విపత్కర కాలమిది

ఎండి ఎడారై పొడిబారిన ఏ ఎదలోనూ
చిగురించని ప్రేమ మొలకలు

గుహలు వీడి.. గహనాంతర గండాలు దాటి
నడిచిన నాగరికతా దారుల్లో
ఉన్మాద ఉత్పాతాలను ఎదిరించి నిర్మించిన
లౌకిక సౌధాలను సమాధి చేసే
వ్యతిరిక్త వ్యూహాలు

ఇది హృదయాలను అంటుకట్టాల్సిన సమయం
సామరస్య సహజీవన నినాద సందర్భం

మాటలు నేర్వకముందు
మతం వాసన పీల్చకముందు
ఆకలికి అమ్మ చన్ను అన్నమై చప్పరించిన
చనుబాల తీపిని తలుచుకోవాలి
మానవ సమూహాల సమైక్యజాడలు
తడిగా తగులుతాయి

మక్సద్ అలగ్ అలగ్
మగర్ అబ్ హమ్ భీ యెహీ బోలేంగే..

'ఏక్ హై తో సేఫ్ హై'


వెలివాడలు.. అగ్రహారాల మధ్య
రాకపోకల రహదారులేయాలి
మందిర్ మస్జిదులు అలయ్ బలయ్ తీసుకోవాలి
బతుకమ్మ సద్దులు.. బక్రీద్ ఖీర్లు
చర్చిలో కలిసి ప్రేమగా పంచుకోవాలి

'ఏక్ హై తో సేఫ్ హై'
హమ్ ఏక్ హీ రహేంగే!

■ గాజోజు నాగభూషణం
✆ 98854 62052

నేటి ప్రజావాణి కార్యక్రమం రద్దు

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజల సమస్యలు తెలుసుకుని సత్వర పరిష్కారం కోసం ప్రతీ వారం వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం కొన్ని అనివార్య కారణాల వల్ల నేడు రద్దు చేస్తున్నట్టు వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. పరిపాలనాపరమైన కారణాల దృష్ట్యా ప్రజావాణి కార్యక్రమం రద్దు చేస్తున్నట్టు కమిషనర్ వెల్లడించారు. ప్రజలు గమనించి ఫిర్యాదులు సమర్పించేందుకు వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు సోమవారం రాకూడదని కమిషనర్ వెల్లడించారు.





- రైతన్నలకు ఈ ఏడాదంతా అవరోధాలే
- సన్నవడ్లకు రూ.500 బోనస్‌తో కొంత ఊరట
- రుణమాఫీతో అన్నదాతలకు కాస్త ఉపశమనం
- 'సాయం' అందక పెట్టుబడి కష్టాలు ఎదుర్కొంటున్న వైనం
- ఓరుగల్లుకు పత్తి పరిశోధన కేంద్రం మంజూరు
- వరంగల్ వారసత్వ పంట చపాట మిర్చికి జీఐ ట్యాగ్
- సాగునీటి ప్రాజెక్టు పనుల్లో కదలిక

సాగు తడబాటు!

2024 కాలచక్రం

ఆశించిన స్థాయిలో పత్తి, మిర్చి పంటలకు దక్కని మద్దతు ధర

ఆరుగాలం శ్రమించిన రైతన్నకు ఈ ఏడాది కూడా సాగు కష్టాలు తప్పలేదు. ప్రకృతి విపత్తులకు ఎదురొడ్డి మరీ పంటలు పండించినా.. చివరకు మద్దతు ధర కరువై కుదేలయ్యాడు. అసలే పరిస్థితులు అనుకూలించక.. దిగుబడులు ఆశించిన మేరరాక దిగాలు పడుతున్న వేళ.. పంటలకు సరైన ధరలు దక్కకపోవడంతో తీవ్ర నష్టాలను మూటగట్టుకున్నాడు. ముఖ్యంగా పత్తి, మిర్చి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. సన్న వడ్లకు ప్రభుత్వం రూ. 500బోనస్ ఇవ్వడం కొంత ఉపశమనాన్నిచ్చింది. ఇక కాంగ్రెస్ ఎన్నికల హామీగా ఇచ్చిన రూ.2లక్షల రుణమాఫీ అమలుతో ఊరట లభించినా.. పెట్టుబడి సాయంగా రైతు భరోసా ఇవ్వకపోవడం, రూ.2లక్షలకుపైగా రుణం ఉన్నవారికి మాఫీ చేయకపోవడం పట్ల అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇదిలాఉంటే సాగురంగానికి ప్రాధాన్యం కల్పిస్తూ వరంగల్ మిర్చికి జియోగ్రాఫికల్ ఇండికేషన్ (జీఐ) ట్యాగ్ లభించడం.. అఖిల భారత పత్తి పరిశోధన పథకం(ఏఐసీఆర్) కింద వరంగల్‌లో పత్తి పరిశోధన కేంద్రం మంజూరు కావటం.. సాగునీటి ప్రాజెక్టుల పనుల్లో కొంత కదిలిక రావడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

7



భయపెట్టిన విపత్తులు

ఈ ఏడాది ప్రకృతి వైపరీత్యాలతో తల్లడిల్లిన ఓరుగల్లు

- కుంభవృష్టి వానలు.. జల ప్రళయాలతో జనం విలవిల
- పచ్చని అడవిలో విధ్వంసం సృష్టించిన పెనుగాలులు
- మేడారం కేంద్రంగా భూ ప్రకంపనలతో ప్రజలు గజగజ

7

రుణమాఫీ లబ్ధిదారులకు కొత్త రుణాలివ్వండి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు



టెస్కాబ్ -2024 డైరీని ఆవిష్కరించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): రుణమాఫీ పొందిన రైతులకు సకాలంలో కొత్త రుణాలు మంజూరు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఆదివారం హైదరాబాద్‌లోని టెస్కాబ్ కార్యాలయంలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు ఆధ్వర్యంలో డీసీసీ బ్యాంకు చైర్మన్‌లు, అధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష జరిపారు. రైతులకు కొత్త రుణాల మంజూరులో జాప్యం ఉండొద్దని ఆదేశించారు. సాంకేతిక కారణాలతో రుణమాఫీ పొందని లబ్ధిదారుల సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తగిన ఏర్పాట్లు ఉండాలని సూచించారు. సంఘాల ద్వారా జారీ అయిన రుణాలను రికవరీ చేయాలని, లక్ష్యాలు వంద శాతం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అనంతరం టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావుతో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు టెస్కాబ్-2025 డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో టెస్కాబ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బి.గోపి, టెస్కాబ్ పాలకవర్గ సభ్యులు, రాష్ట్రంలోని డీసీసీ బ్యాంకు చైర్మన్లు తదితరలు పాల్గొన్నారు.

వరంగల్ క్రీడాకారుల విజయదుందుభి

- బ్యాడ్మింటన్‌లో క్లీన్‌స్వీప్, హ్యాండ్‌బాల్‌లో బాలుర జట్టు విజయకేతనం
- ముగిసిన రాష్ట్ర స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు



హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన క్రీడాకారులతో నిర్వాహకులు

వరంగల్ స్పోర్ట్స్, డిసెంబరు29 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జేఎన్ క్రీడా మైదానంతో పాటు ఎర్రగట్టుగుట్ట సమీపంలోని కిట్స్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి సీఎం కప్ క్రీడా పోటీల్లో ఆతిథ్య వరంగల్ జిల్లాకు చెందిన క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి పలు పతకాలను కొల్లగొట్టారు. మూడు రోజులుగా రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న బ్యాడ్మింటన్ సింగిల్స్ డబుల్స్‌లో ఆతిథ్య వరంగల్ జిల్లాకు చెందిన షట్లర్లు ఆరు స్వర్ణ పతకాలు సాధించి జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తీసుకువచ్చారు. అదే విధంగా బాలుర హ్యాండ్‌బాల్ విభాగంలో ఆతిథ్య వరంగల్ జిల్లా క్రీడాకారులు విజయ కేతనం ఎగరవేశారు. సెపక్‌తాక్ర పురుషుల, మహిళల విభాగంలో హైదరాబాద్ జట్టు విజయం సాధించింది. పురుషుల హ్యాండ్‌బాల్ విభాగంలో ప్రథమస్థానంలో వరంగల్, ద్వితీయ స్థానంలో మహబూబ్‌నగర్, తృతీయస్థానంలో కరీంనగర్ జట్లు నిలిచాయి. మహిళల విభాగంలో ఆదిలాబాద్ ప్రథమస్థానం, వరంగల్ ద్వితీయ స్థానం, రంగారెడ్డి తృతీయస్థానంలో నిలిచాయి. సెపక్‌తాక్ర పురుషుల విభాగంలో హైదరాబాద్ ప్రథమ, రంగారెడ్డి ద్వితీయ, ఆసిఫాబాద్ తృతీయ స్థానం సాధించగా, మహిళల విభాగంలో హైదరాబాద్ ప్రథమ, కామారెడ్డి ద్వితీయ, నిజామాబాద్ తృతీయస్థానంలో నిలిచాయి. బ్యాడ్మింటన్ అండర్-19 మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో ఎం.అజయ్‌కార్తీక్, ఎం.కీర్తి హనుమకొండ, అండర్-19 బాలుర డబుల్స్‌లో అఖిల్‌రావు, ఎం.అజయ్ కార్తీక్ హనుమకొండ, అండర్-19 బాలికల డబుల్స్‌లో ఎం.పూజిత నిఖితారావు హనుమకొండ, అండర్-19 బాలికల సింగిల్స్‌లో ఎం.కీర్తి, అండర్-19 సింగిల్స్ బాలురలో అఖిల్‌రావు, అండర్-15 బాలుర డబుల్స్‌లో ఎస్.అక్షయ్‌కుమార్, శ్రీచైతన్ శౌర్యలు అత్యుత్తమ ప్రతిభతో బ్యాడ్మింటన్‌లో రాణించి పతకాలు సాధించారు.

మూడు రోజుల పాటు వివిధ జిల్లాల నుంచి పలు క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారుల మధ్య హోరాహోరీగా క్రీడా పోటీలు కొనసాగాయి. క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చిన విజేతలను హనుమకొండ డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఏ కోచ్‌లు, వివిధ క్రీడా సంఘాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.



ముత్యాలమ్మతండాలో పులి పాదముద్రలను పరిశీలిస్తున్న ఫారెస్ట్ అధికారులు

పులి అలజడి

- నర్సంపేట, ఖానాపురం మండలాల్లో సంచారం
- పంట పొలాల్లో పాదముద్రలను గుర్తించిన అటవీశాఖ
- అప్రమత్తంగా ఉండాలని పోలీసుల హెచ్చరిక

7



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

నేత్రపర్వంగా రుద్రేశ్వర కల్యాణం

- వైభవంగా మాస శివరాత్రి వేడుకలు

హనుమకొండ కల్చరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రసిద్ధ వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో ఆదివారం మాసశివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహించారు. సెలవుదినం కావడంతో వందలాది మంది భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఆలయ కల్యాణ మండపంలో ప్రత్యేకంగా కల్యాణ వేదిక ఏర్పాట్లు చేసి పంచమరాత్ర ఆగమానుసారంగా శాస్త్రోయుక్తంగా రుద్రేశ్వరీ, రుద్రేశ్వరుల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో మంగళవాయిద్యాలు కల్యాణ మంత్రాల మధ్య జరిగిన వివాహవేడుకల్లో భక్తుల పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎదుర్కోలు బాసికాధారణ, మంగళ సూత్రం, తలంబ్రాలు లాంటి వైదిక కార్యక్రమాలను ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో సందీప్ శర్మ, మణికంఠశర్మ, శ్రవణ్‌కుమారాచార్యులు నిర్వహించారు. సాయంత్రం ప్రదోశకాల సమయంలో వందలాది మహిళలు నందీశ్వరుడి వద్ద దీపారాధనలు నిర్వహించారు. శోడషోపాచార పూజలు నీరాజన మంత్రపుష్పం లాంటి వైదిక కార్యక్రమాల విశేషాలను భక్తులకు తెలియజేస్తూ కల్యాణోత్సవ వేదికలను నిర్వహించారు. భక్తులందరికి ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పారదర్శకంగా నిర్వహించండి

రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ చీఫ్ ఇంజనీర్ చాణక్య



కాశిబుగ్గలో మహిళల నుంచి సర్వే వివరాలు తెలుసుకుంటున్న చాణక్య

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ పరిధిలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నమోదు సర్వే పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ చీఫ్ ఇంజనీర్ చాణక్య సూచించారు. ఆదివారం బల్దియా పరిధిలోని పలు కాలనీలలో జిల్లా అధికారులతో కలిసి సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరంగల్ నగరంలోని కాశిబుగ్గ, లష్కర్‌సింగారం, కాజీపేట, వెంకటాద్రినగర్, బాబు క్యాంపుతో పాటు పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా చాణక్య మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో అక్రమాలు జరుగకుండా పారదర్శకంగా నిర్వహించాలన్నారు. సర్వే నమోదు తీరును జాగ్రత్తగా తప్పులకు తావులేకుండా ఆన్‌లైన్ చేయాలన్నారు. సర్వే సమయంతో ఏదైనా సాంకేతికలోపం ఉంటే వెంటనే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని అన్నారు. ఇండ్లు లేని నిరుపేదలను గుర్తించి తప్పకుండా న్యాయం జరిగే విధంగా చూడాలని దళారుల చేత ప్రజలు మోసపోవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో రామిరెడ్డి, బల్దియా అదనపు కమిషనర్ జోనా, డిప్యూటీ కమిషనర్‌లు నిమ్మ కృష్ణారెడ్డి, రవీందర్, రెవెన్యూ అధికారులు శ్రీనివాస్, శహజాది బేగం, సర్వేయర్లు పాల్గొన్నారు.



డాక్టర్ బొల్లం రాజేశ్‌కు ఘన సన్మానం

• హాజరైన వివిధ ఓసీ సంఘాల నాయకులు



డాక్టర్ రాజేశ్‌ను సత్కరిస్తున్న వివిధ బీసీ సంఘాల నాయకులు

హనుమకొండ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రైడ్ ఆఫ్ నేషన్-2024 పురస్కారం పొందిన సందర్భంగా డాక్టర్ బొల్లం రాజేశ్‌కు ఆదివారం వరంగల్ హంటర్‌రోడ్డులోని సహస్ర డీఎల్‌ఏ కన్వెన్షన్ హాల్‌లో ఓసీ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా ఆత్మీయ సన్మానం జరిగింది. ఉత్తమ అంకాలజిస్టు, హెమటాలజిస్టు కేటగిరిలో డాక్టర్ రాజేశ్ ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ఈనెల 21న హైదరాబాద్‌లో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ చేతుల మీదుగా ప్రతిష్ఠాత్మకమైన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈసందర్భంగా నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి బీసీ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వారిలో రాష్ట్ర రెడ్డి సంఘం అధ్యక్షుడు గోపు జయపాల్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర కమ్మ సంఘం ప్రధాన కార్యదర్శి రామక్రిష్ణ ప్రసాద్, రాష్ట్ర బ్రాహ్మణ, అర్చకసంఘం అధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ, తెలంగాణ రాష్ట్ర వైశ్య మహాసభ కార్యదర్శి వంగేటి అశోక్‌కుమార్, తెలంగాణ వెలమ సంఘం రాష్ట్ర నాయకుడు కొల్లూరి రాజేశ్వర్‌రావు, ప్రగతి శీల మార్వాడీ సంఘం అధ్యక్షుడు మాదాడి వేణుగోపాల్ తదితరులు ఉన్నారు. వైద్య రంగంలో డాక్టర్ రాజేశ్ సేవలను కొనియాడారు.

కొమురం ప్రభాకర్‌కు డాక్టరేట్



డాక్టరేట్ ఇచ్చిన ప్రతినిధులతో కొమురం ప్రభాకర్

కేయూ క్యాంపస్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల హక్కుల కోసం చేసిన సామాజిక సేవలకు గుర్తింపుగా కొమురం ప్రభాకర్‌కు గౌరవ డాక్టరేట్ లభించింది. ఈ మేరకు ఆదివారం ఏషియా వేదిక కల్చరల్, రీసెర్చ్ యూనివర్సిటీ, స్ఫూర్తి అకాడమీ వారు సంయుక్తంగా ప్రభాకర్‌ను డాక్టరేట్‌కు ఎంపిక చేసి ప్రకటించారు. హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో గల కళాభారతి భవనలో కొమురం ప్రభాకర్‌ను సత్కరించి గౌరవ డాక్టరేట్ పట్టాను అందచేశారు. మంగపేట మండలం తిమ్మాపురంలో కొమురం సమ్మక్క- భద్రయ్యల కుమారుడైన ప్రభాకర్.. కాకతీయ యూనివర్సిటీ మ్యాథ్స్ విభాగంలో పీజీ పూర్తి చేశారు. చదువుతోపాటు ఆదివాసీ హక్కుల పోరాట సమితి, తుడుందెబ్బ, ఆదివాసీ విద్యార్థి సంఘాల్లో పనిచేస్తున్నారు. ఉమ్మడి ఏపీలో 9 ఐటీడీఏ ప్రాంతాల్లో విద్యార్థి సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేశారు. తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడిగా ఆదివాసీలను రాజ్యాంగ హక్కులు-చట్టాలపై చైతన్య పరుస్తున్నారు. పీసా చట్టం జిల్లా కోఆర్డినేటర్‌గా ఐటీడీఏలో ఉద్యోగం చేస్తున్నారు. గిరిజన ప్రాంతాలలో గ్రామ సభలల్లో ఖనిజ సంపదపై హక్కులు భూములపై అవగాహన కల్పిస్తున్నారు. గిరిజన సంస్కృతి- సంప్రదాయాల పరిరక్షణ కోసం పాటుపడు టతున్నారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులకు ఇచ్చే పథకాలను అందరూ సద్వినియోగం చేసుకునే విధంగా చైతన్య పరుస్తున్నారు. గతంలో కొమురం ప్రభాకర్‌కు కొమురం భీమ్ జాతీయ అవార్డు-2023, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జాతీయ అవార్డు దక్కింది. కాగా, గౌరవ డాక్టరేట్ పొందిన కొమురం ప్రభాకర్‌ను పలువురు అభినందించారు.

జర్నలిస్టుల సమస్యలపై నిరంతర పోరాటం

- అక్రిడియేషన్లలో కోత పెట్టేందుకు సర్కారు కుట్ర
- టీయూడబ్ల్యూజే-హెచ్ 143 రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ



మహాసభలో మాట్లాడుతున్న అల్లం నారాయణ

వడ్డెపల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జర్నలిస్టుల సమస్యలపై తమ సంఘం నిరంతర పోరాటం చేస్తుందని టీయూడబ్ల్యూజే-హెచ్ 143 రాష్ట్ర అధ్యక్షుడు, మీడియా అకాడమీ మాజీ ఛైర్మన్ అల్లం నారాయణ అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్ ఆవరణలో ఆదివారం తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే)-హెచ్ 143 హనుమకొండ, వరంగల్ జిల్లాల మహాసభ సంఘం జిల్లాఅధ్యక్షుడు మస్కపురి సుధాకర్ అధ్యక్షతననిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన అల్లం నారాయణ మాట్లాడుతూ.. డెస్క్ జర్నలిస్టులను నాన్ జర్నలిస్టులుగా చూపిస్తూ అక్రిడియేషన్లలో కోత పెట్టేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందని దుయ్యబట్టారు. యూనియన్‌ను బలోపేతం చేయడమే లక్ష్యమన్నారు. తాను మీడియా అకాడమీ ఛైర్మన్‌గా ఉన్న కాలంలో జర్నలిస్టులందరికీ హెల్త్ కార్డులు, అక్రిడియేషన్లు ఇప్పించి వారిసంక్షేమంకోసం కృషిచేశానని చెప్పారు. కరోనా సమయంలో మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలకు ఆర్థిక సహాయాన్ని అందించినట్లు తెలిపారు.

యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్ మాట్లాడుతూ.. తెలంగాణ కోసమే తెలంగాణ జర్నలిస్టులు అనే నినాదం వరంగల్‌లోనే పుట్టిందని అన్నారు. రూ.100 కోట్లతో జర్నలిస్టుల సంక్షేమ నిధిని ఏర్పాటు చేసిన ఘనత అల్లం నారాయణకే దక్కుతుందని అన్నారు. ఈ మహాసభలో యూనియన్ రాష్ట్ర, జిల్లా నాయకులు రమేష్ అజారే, యోగి, బీఆర్. లెనిన్, తడక రాజనారాయణ, చిలుముల్ల సుధాకర్, కక్కెర్ల అనిల్‌కుమార్ గౌడ్, తుమ్మ శ్రీధర్‌రెడ్డి, మెండు రవీందర్, గోకారపు శ్యామ్, పొగాకుల అశోక్, జి.ఉమేందర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం టీయూడబ్ల్యూజే-హెచ్ - 143 వరంగల్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కోరుకొప్పుల నరేందర్, ప్రధాన కార్యదర్శిగా వాంకిడి శ్రీనివాస్, కోశాధికారిగా రాపల్లి ఉపేందర్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడిగా మిట్ట నవనీత్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా నీలం శివ, కోశాధికారిగా బైరి శ్రీనివాస్‌లు ఎన్నికయ్యారు. వరంగల్ ఉమ్మడి జిల్లా వీడియో జర్నలిస్టుల అధ్యక్షుడిగా కె.రాంచందర్, ప్రధాన కార్యదర్శిగా సుంచు రామరాజు, కోశాధికారిగా చోటాలసంతోష్‌కుమార్ ఎన్నికయ్యారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ఫొటో జర్నలిస్టు అధ్యక్షుడిగా గొట్టె వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా సంపెట సుధాకర్, కోశాధికారిగా చేతి శ్రీనివాస్‌లు ఎన్నికయ్యారని రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ తెలిపారు.



వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన నరేందర్‌కు సత్కారం

బాటనీలో భగీరథ్‌కు డాక్టరేట్



వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వృక్షశాస్త్రం అధ్యాపకుడు గోగికర్ భగీరథ్‌కు కాకతీయ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఈ మేరకు కాకతీయ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ శనివారం ప్రకటన జారీ చేశారు. భగీరథ్ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎం.డి.ముస్తాఫా పర్యవేక్షణలో 'ఇన్ విట్రో ప్రొపగేషన్, ఫైటో కెమికల్స్ స్క్రీనింగ్ అండ్ యాంటీ మైక్రోబియల్ స్టడీస్ ఆఫ్ సొరాలియా కొరిలిఫోలియాఎల్ - ఏ థ్రెటెన్‌డెడ్ మెడిసినల్ లెగిమ్' అనే అంశంపై చేసిన పరిశోధనకు భగీరథ్‌కు డాక్టరేట్ ప్రకటించినట్లు ఆయన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, భగీరథ్ ప్రస్తుతం రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీకళాశాలలో వృక్షశాస్త్రంలో అధ్యాపకుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. భగీరథ్ డాక్టరేట్ సాధించడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాస్‌తో పాటు అధ్యాపక బృందం అభినందనలు తెలిపారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సహాయం

వరంగల్ క్రైం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మరణించిన ఏఆర్ కానిస్టేబుల్ కుటుంబానికి ఆదివారం సీపీ అంబర్ కిషోర్ ఝా చేతుల మీదుగా 2013 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుళ్లు ఆర్థిక సహాయం అందజేశారు. గత నెల 6న 2012 బ్యాచ్‌కు చెందిన బండారి కిరణ్ గుండెపోటుతో మరణించడంతో తోటి కానిస్టేబుళ్లు తమవంతు సహకారంగా కిరణ్ భార్య విషాలికి సీపీ చేతుల మీదుగా రూ.60వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్థిక సహాయం అందజేసేందుకు ముందుకొచ్చినకానిస్టేబుళ్లనుసీపీ అభినందించారు.

కేయూ సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ ఖోఖో పురుషుల జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకయ్య తదితరులు

కేయూ క్యాంపస్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని యూనివర్సిటీ ఆఫ్ తమిళనాడులో డిసెంబరు 28 నుంచి 31 వరకు జరిగే సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ పురుషుల ఖోఖో జట్టును 2024-25 ఏడాదికి ఆదివారం ఎంపిక చేసినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య తెలిపారు. ఎంపికైన క్రీడాకారులలో కె.సిద్ధూ, పి.నేతాజీ, బి.నవీన్, ఎం.వినయ్(కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హనుమకొండ), పి.అజిత్‌కుమార్, బి.వినోద్, ఎం.రాజేశ్, పి.సాయికిరణ్(యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల, కేయూ క్యాంపస్), ఎన్.రాకేశ్(యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, సుబేదారి), జె.ప్రదీప్‌నాయక్(టీజీటీడబ్ల్యూఆర్‌డీసీ, ఆదిలాబాద్) పి.పృథ్వీరాజ్(ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆదిలాబాద్), బి.విష్ణు(కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల, హసన్‌పర్తి), జి.ప్రేమ్‌కుమార్, ఎం.విప్లవ్‌కుమార్(కేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల, కేయూ క్యాంపస్)లున్నట్లు పేర్కొన్నారు. ఈ జట్టుకు కోచ్, మేనేజర్‌గా హనుమకొండ జాగృతి డిగ్రీ కళాశాల పీడీ ఎ.రాజేశ్ వ్యవహరిస్తారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, డైరెక్టర్ ప్రొఫెసర్ వై.వెంకయ్యలు అభినందించారు.

ఉత్సాహంగా అంధుల క్రీడలు

- పాల్గొన్న 100 మంది దివ్యాంగులు



క్రికెట్ పోటీల్లో పాల్గొన్న దివ్యాంగులు

వరంగల్ స్పోర్ట్స్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జనవరి 4న అంధుల లిపి సృష్టికర్త డాక్టర్ లూయిస్ బ్రెయిలీ జయంతిని పురస్కరించుకొని తెలంగాణ అంధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో హనుమకొండ ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం జిల్లా స్థాయి దివ్యాంగుల క్రీడా పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో నిర్వహించిన కబడ్డీ, క్రికెట్, చెస్, సాంస్కృతిక క్రీడా పోటీలను యూనియన్ బ్యాంకు చీఫ్ మేనేజర్ కుందన్‌సింగ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులు క్రీడల్లో పాల్గొని రాణించాలని సూచించారు. దివ్యాంగుల క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి రాజు మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లా స్థాయిలో కబడ్డీ, క్రికెట్, చెస్, షాట్ పుట్, సాంస్కృతికంలో మెన్ అండ్ ఉమెన్ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో 100 మంది దివ్యాంగులు పాల్గొన్నారన్నారు. ఇక్కడ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు జనవరి 4న హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య చేతుల మీదుగా బహుమతుల ప్రదానం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జి.శ్రీను, వైఎస్ఆర్ కృష్ణ, కార్తీక్, టి.శ్రీనివాస్, సీహెచ్.కమల, కన్నయ్య, వీరన్న, నరేష్, ఎస్.కృష్ణయ్య, ఎ.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

• కుమార్తె హైదరాబాద్‌కు తరలింపు



నల్లబెల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగిన వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగిన వివాహిత పిండి మానస(28) నర్సంపేటలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందింది. మృతురాలి కుమార్తె స్వాతికను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. పిండి శ్రీను మొదటి భార్యకు పిల్లలు కాకపోవడంతో దుగ్గొండి మండలంలోని బిక్కాజిపల్లికి చెందిన మానసను రెండో భార్యగా ఎనిమిదేళ్ల కిందట వివాహం చేసుకున్నాడు. అనంతరం వీరికి కుమారుడు, కుమార్తె పుట్టారు. ఈ క్రమంలో ఇటీవల గొడవలు ఎక్కువ కావడంతో జీవితంపై విరక్తి మానస పురుగుల మందు తాగింది. తన కుమార్తెకు తాగించింది. నర్సంపేటలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మానస మృతి చెందింది. కుమార్తెను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోవర్ధన్ తెలిపారు.

భద్రకాళి బండ్‌పై ఫుడ్ స్ట్రీట్

- కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు
- త్వరలో మంజూరు కానున్న నిధులు
- డీపీఆర్ పంపిన వరంగల్ నగర పాలక సంస్థ
- పెరగనున్న పర్యాటకులు.. భద్రకాళి బండ్‌కు మరింత శోభ



హనుమకొండ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ భద్రకాళి బండ్‌పై త్వరలో ఫుడ్ స్ట్రీట్ (ఆహార వీధి) ఏర్పాటు కానున్నది. భవిష్యత్తులో దీనిని ఫుడ్ హబ్‌గా అభివృద్ధి చేయనున్నారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం త్వరలో నిధులు మంజూరు చేయనున్నట్టు తెలుస్తోంది. ఈ ఫుడ్ హబ్ ఏర్పాటుకు సంబంధించిన డిటెయిల్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్)ను కొద్ది నెలల కిందటే వరంగల్ మహా నగర పాలక సంస్థ రాష్ట్ర ఆహార భద్రతా కమిషనర్‌కు పంపింది. కమిషనర్ దీనిని కేంద్ర ప్రభుత్వానికి సమర్పించారు. రూ.కోటి అంచనా వ్యయంతో దీనిని ఏర్పాటు చేస్తారు.

ఒక్కొక్కటి రూ.కోటితో..

పరిశుభ్రమైన, సురక్షితమైన ఆహారపు అలవాట్లు, విధానాలను ప్రోత్సహించడానికి దేశ వ్యాప్తంగా 100 జిల్లాల్లో ఫుడ్ స్ట్రీట్స్‌ను (ఆహార వీధులు) ఏర్పాటు చేయాలి కేంద్రం నిర్ణయించింది. ఇందులో తెలంగాణలో 4, ఆంధ్రప్రదేశ్‌లో 4 చొప్పున ఏర్పాటు అవుతాయి. ఇందులో ఒకటి వరంగల్‌లో ఏర్పాటు కానున్నది. ఒక్కో ఆహార హబ్‌కు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు రూ.కోటి కేటాయిస్తుంది. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖతో కలిసి ఈ వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించనున్నది. ఆహార వ్యాపారంలో ఉన్నవారికి పరిశుభ్రత గురించి చెప్పి తినుబండారాల ద్వారా వచ్చే రోగాలను తగ్గించి ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం ఈ కార్యక్రమం లక్ష్యం. ఈ మేరకు కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి రాజేశ్ భూషణ్, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి మనోష్ జోష్‌లు సంయుక్తంగా అన్ని రాష్ట్రాలకు లేఖలు రాశారు. ఈ మేరకు రాష్ట్ర ఆహార భద్రతా కమిషనర్ వరంగల్‌లో ఈ ఫుడ్ స్ట్రీట్ ఏర్పాటుకు గల అవకాశాలు, సాధ్యాసాధ్యాలపై డీపీఆర్‌ను పంపవలసిందిగా కొద్ది నెలల కిందట వరంగల్ నగర పాలక సంస్థకు లేఖ రాశారు. ఇందుకు నగర పాలక సంస్థ వెంటనే స్పందించి వరంగల్ నగరం నడిబొడ్డున ఉన్న భద్రకాళి బండ్ ఈ ఫుడ్ స్ట్రీట్ ఏర్పాటు అనువైన ప్రదేశమని, ఇక్కడ ఏర్పాటు కేసినట్లయితే సందర్శకులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొంటూ డీపీఆర్‌ను రూపొందించి పంపించారు. ఆహార భద్రతా కమిషనర్ ద్వారా కేంద్రానికి చేరిన ఈ నివేదికను కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ పరిశీలించి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు సమాచారం.

పర్యాటకం వృద్ధి

ఫుడ్ స్ట్రీట్ ఏర్పాటు వల్ల స్థానిక ఆహార తయారీదారులు, విక్రయదారులు, చిరువ్యాపారులకు ఎంతో లబ్ధి చేకూరుతుంది. స్థానికంగా ఎంతోమందికి ఉపాధి లభించడంతో పాటు పర్యాటక రంగం అభివృద్ధికి ఎంతో దోహదపడుతుంది. ఫుడ్‌స్ట్రీట్ ఏర్పాటుకు కేటాయించిన నిధులను మౌలిక వసతుల కల్పనకు ఉపయోగించాల్సి ఉంటుంది. భారత ఆహార ప్రమాణాల సంస్థ నిర్దేశించిన మార్గదర్శకా లకు అనుగుణంగా ఈ ఆహార వీధికి ప్రామాణిక బ్రాండింగ్ కల్పించాల్సి ఉంటుంది. భవిష్యత్తులో ఫుడ్‌స్ట్రీట్ అభివృద్ధి, విస్తరణకు అవసరమైన ఆర్థిక వనరుల కల్పనకు మున్సిపల్ కార్పొరేషన్, జిల్లా కలెక్టర్ చొరవ చూపాల్సి ఉంటుంది.

స్ట్రీట్‌ఫుడ్ వ్యాపారులకు ప్రోత్సాహం

ఈ ఫుడ్ హబ్‌లో వ్యాపారం చేసుకునే చిరు స్ట్రీట్ ఫుడ్ వ్యాపారులకు కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్ విజన్, ఆత్మ నిర్భర్ భారత్ వంటి కార్యక్రమాల ద్వారా ప్రోత్సాహకాలను అందిస్తోంది. పరిశుభ్రంగా, ఆహార భద్రతా ప్రమాణాలకు లోబడి ఆహార పదార్థాలను తయారు చేసి విక్రయించడంలో శిక్షణ ఇస్తుంది. ముద్ర యోజన ద్వారా చిన్న వ్యాపారులకు రుణాలు అందించడం ద్వారా స్ట్రీట్‌ఫుడ్ వ్యాపారులు తమ వ్యాపారాన్ని విస్తరించుకోవడానికి సహాయపడుతుంది. రాష్ట్రప్రభుత్వం కూడా తనవంతు సహాయాన్ని అందిస్తుంది. స్ట్రీట్‌ఫుడ్ వ్యాపారులకు సబ్సిడీలు ఇస్తుంది. స్ట్రీట్ ఫుడ్ ఏర్పాటుతో పర్యాటకుల రాక పెరుగుతుంది. స్థానిక ఆహార సంస్కృతికి విస్తృత ప్రచారం లభిస్తుంది. కొన్ని ఆహార పదార్థాలకు బ్రాండ్ లభిస్తుంది. ఎగుమతులకు అవకాశం కలుగుతుంది.

భద్రకాళి బండ్‌కు కొత్తకళ

ఈ స్ట్రీట్ హబ్ ఏర్పాటుతో భద్రకాళి బండ్ కొత్తకళ సంతరించుకోనున్నది. స్మార్ట్‌సిటీ పథకం కింద సుమారు రూ.40కోట్ల అంచనా వ్యయంతో భద్రకాళి బండ్‌ను సుందరీకరించింది తెలిసిందే. జీవ వైవిధ్య పార్క్‌గా అభివృద్ధి చేసిన ఈ బండ్‌ను ఇప్పటికే పర్యాటకులు పెద్ద ఎత్తును సందర్శిస్తున్నారు. బండ్ రెండోదశ అభివృద్ధి పనులు కూడా కొనసాగుతున్నాయి. భద్రకాళి చెరువులో పర్యాటకు కోసం బోటింగ్ సౌకర్యాన్ని కూడా కల్పించారు. భద్రకాళి చెరువును అభివృద్ధి చేసేందుకు అందులోని పూడికతీత పనులు కూడా మొదలయ్యాయి. పూడికతీతలో భాగంగా ఇటీవల నీటిని బయటకు పంపి చెరువును ఖాళీ చేశారు. జనవరి రెండో వారం నుంచి పూడిక తీత పనులు మొదలు కానున్నాయి. చెరువును అభివృద్ధి చేసిన తర్వాత పర్యాటకుల రాక మరింత పెరిగే అవకాశం ఉంది.

రాజ్యాధికారమే లక్ష్యంగా బీసీలంతా ఏకం కావాలి

- బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్

కేయూ క్యాంపస్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : 2028 ఎన్నికల్లో రాజ్యాధికార మే లక్ష్యంగా బీసీలంతా ఏకం కావాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం కేయూ గెస్ట్‌హౌస్ వద్ద బీసీ విద్యార్థి సంఘం కేయూ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కేయూ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కేయూ ఇన్ చార్జ్ ఆరెగంటి నాగరాజుగౌడ్ అధ్యక్షత సమావేశం జరిగింది. సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన వడ్లకొండ వేణుగోపాల్ మాట్లాడుతూ.. జనాభాలో సగ భాగమైన బీసీలపై రాజకీయ పార్టీలన్నీ వివక్ష చూపుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బీసీ కులాల లెక్కలు తీయాలని డిమాండ్ చేశారు. బీసీలకు జనా బాదామాషా మేరకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో తగిన విధంగా రిజర్వేషన్లు కల్పించాలని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 22 శాతమే రిజర్వేషన్లు అమలు చేస్తున్నారని అన్నారు. కుల గణన చేపట్టిన 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీలంతా సంఘటితమై న్యాయమైన డిమాండ్లను సాధించుకోవాలని అన్నారు. రాష్ట్రానికి బీసీ ముఖ్యమంత్రిని చేయాలని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో గ్రామ స్థాయినుంచి బీసీలంతా ఏకమై బీసీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం గౌరవ అధ్యక్షుడు, కేయూపాలక మండలి సభ్యులు డాక్టర్ చిర్రా రాజుగౌడ్, హనుమకొండ బీసీ సంఘం అధ్యక్షుడు మాడిశెట్టి నాగరాజు, బీసీ సంక్షేమ సం ఘం జిల్లా ఉపాధ్యక్షుడు కరిమిళ్ల శ్రీనివాస్, స్కాలర్లు శృంగారపు విష్ణు, మహబూబ్ పాషా, అభిరామ్, రాజ్‌కుమార్, శ్రీసాయి పాల్గొన్నారు.

కేయూ బీసీ విద్యార్థి సంఘం ఎన్నిక

కేయూ బీసీ విద్యార్థి సంఘం నూతన కమిటీని వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ ఆదివారం ప్రకటించారు. కేయూ బీసీ విద్యార్థి ఇన్‌చార్జ్‌గా ఆరెగంటి నాగరాజు గౌడ్, అధ్యక్షుడిగా సుమన్‌రాజ్, ప్రధాన కార్యదర్శిగా జి.భీమన్న, కోశాధికారిగా రవితేజ, ఉపాధ్యక్షులుగా రతన్, కె.గణేశ్, అజయ్‌సింగ్, సహాయ కార్యదర్శిగా కె.సాంబరాజు, రాఘవేందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్.గణేశ్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా హర్షవర్ధన్‌లను ఎన్నుకున్నారు. బీసీ విద్యార్థి సంఘం గౌరవ అధ్యక్షులుగా కేయూ పాలక మండలి సభ్యులు చిర్రా రాజుగౌడ్‌ను ఎన్నుకున్నారు.



సాగు.. తడబాటు!

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

రైతులకు ఈ ఏడాదీ సాగు కష్టాలు తప్పలేదు. ప్రకృతి వైపరీత్యాల ప్రభావం పంటలపై పడి.. ఆశించిన స్థాయిలో దిగుబడి లేకపోవడంతో పాటు మద్దతు ధర లభించక పత్తి, మిర్చి రైతులు తీవ్రంగా నష్టాలను ఎదుర్కొంటున్నారు. అయితే సన్న రకం వడ్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 500 బోనస్ ఇవ్వటం అన్నదాతలకు కొంత ఊరటనిచ్చిన అంశం. అయితే ఈ ఏడాది రెండు పంటలకు ప్రభుత్వం పెట్టుబడి సాయం రైతు భరోసా ఇవ్వకపోవటం, రూ.2 లక్షలకు పైగా రుణం ఉన్న రైతులకు కూడా మాఫీ చేస్తామని చెప్పి అమలు చేయకపోవటం పట్ల అన్నదాతలు అసంతృప్తితో ఉన్నారు. ఇక వరంగల్ మిర్చికి జియోగ్రాఫికల్ ఇండికేషన్ (జీఐ) ట్యాగ్ లభించటంతో పాటు అఖిల భారత పత్తి పరిశోధన పథకం (ఏఐసీఆర్) కింద పత్తి పరిశోధన కేంద్రం మంజూరు కావటంతో ఊరట నిచ్చాయి. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పనుల్లో కదలిక రావడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- రైతన్నలకు ఈ ఏడాదంతా అవరోధాలే..
- ఆశించిన స్థాయిలో పత్తి, మిర్చి పంటలకు దక్కని మద్దతు ధర
- రుణమాఫీతో అన్నదాతలకు కాస్త ఉపశమనం
- సాయం అందక అన్నదాతకు పెట్టుబడి కష్టాలు

మద్దతు ధర ధమాల్.. అన్నదాతలు డీలా

పత్తికి ఆశించిన స్థాయిలో ధరలు లేక రైతులు డీలా పడుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సుమారు 6.30లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయగా.. పత్తి విక్రయాలకు పెద్ద మార్కెట్టుగా ఉన్న వరంగల్ వ్యవసాయ మార్కెట్లో క్వింటా పత్తికి రూ.5,300 నుంచి రూ.7,100 వరకు ధర పలుకుతోంది. కేంద్ర ప్రభుత్వం క్వింటాలు పత్తికి మద్దతు ధరను రూ.7,521ను ప్రకటించింది. సీసీఐ తేమ నిబంధనలతో రైతులు ప్రైవేటులోనే అమ్ముకుంటూ తీవ్రంగా నష్టాలను ఎదుర్కొంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పత్తిపై క్వింటాలుకు రూ.475 బోనస్ ఇస్తామని ఇచ్చిన హామీని కూడా ఈ ఏడాది నెరవేర్చలేదు. అలాగే మిర్చి రైతులకు కూడా ఆశించిన స్థాయిలో ధరలు లేక డీలా పడుతున్నారు. రైతులు ఎక్కువ సాగు చేసే తేజ రకం మిర్చికి తొలుత రూ. 9వేల నుంచి రూ.16వేల మధ్య ధరలు కొనసాగుతున్నాయి. వండర్ హాట్ మిర్చి రూ.11వేల నుంచి రూ.14వేల మధ్య ధరలున్నాయి. గతేడాది డిసెంబరులో తేజ రకం మిర్చికి గరిష్ఠంగా రూ.23,200 ధర వచ్చింది. వండర్ హాట్‌కు గరిష్ఠంగా రూ.28,503 ధర వచ్చింది. గతేడాది ధరలతో పోల్చితే ఈసారి భారీగా మిర్చి ధరలు పతనమవుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. తేజ రకం మిర్చికి క్వింటాలుకు రూ.7వేల వరకు, వండర్‌హాట్‌కు సగానికి సగంగా రూ.14వేల వరకు ధరలు తగ్గినట్లుగా మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. వీటితో పాటు గతేడాది డిసెంబరులో తేజ రకం ఏసీ మిర్చికి గరిష్ఠంగా రూ. 24,250 ధర ఉండగా, వండర్‌హాట్ రకం ఏసీ మిర్చి గరిష్ఠంగా రూ.27,300 వరకు ధరలు పలికాయి.

అయితే ప్రస్తుతం తేజ రకం ఏసీ మిర్చికి గరిష్ఠంగా రూ.15,500 వరకు, వండర్ హాట్ రూ.13వేల వరకే ధరలున్నాయి. దీంతో గతేడాదితో పోల్చితే సగం ధరలే ఉండడంతో కోల్‌స్టోరేజీల్లో నిల్వ చేసుకున్న రైతులు తీవ్రంగా నష్టపోతున్నామని ఆందోళన చెందుతున్నారు. అయితే ప్రభుత్వం ప్రకటించినట్టుగా సన్నధాన్యం పండించిన రైతులకు రూ.500బోనస్ ఇవ్వడం ఒక్కటే రైతులకు ఊరట.

భరోసా లేక దిగాలు

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రైతు భరోసా అందక అన్నదాతలు పెట్టుబడికి ఇబ్బందులు పడుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు పథకం కింద ఎకరాకు యాసంగి, వానకాలం పంటలకు రెండు విడతల్లో రూ. 10వేల ఆర్థిక సాయాన్ని రైతులకు అందించింది.

అయితే తాము అధికారంలోకి వస్తే రైతుబంధు పథకం స్థానంలో రైతు భరోసా పథకం ద్వారా రైతులకు ఎకరాకు రెండు విడతల్లో రూ.15వేల పెట్టుబడి సాయం అందిస్తామని హామీ ఇచ్చింది. గతేడాది డిసెంబరులో యాసంగి పంటలకు పాత పద్ధతిలోనే రూ.5వేల చొప్పున ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 8,89,787మంది రైతులకు రూ. 903.93కోట్ల పెట్టుబడి సాయాన్ని అందించింది. ఈ ఏడాది ఖరీఫ్, యాసంగి పంటలకు ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వకపోవటంతో రైతులు పెట్టుబడికి ప్రైవేటు అప్పులు చేయాల్సి వస్తుంది.

మన చపాటకు జీఐ ట్యాగ్



వరంగల్ ప్రాంతంలోనే ప్రత్యేకంగా సాగు చేసే చపాట మిర్చికి జియోగ్రాఫికల్ ఇండికేషన్ (జీఐ) ట్యాగ్ లభించింది. ఇందుకోసం 2021 నుంచి చేస్తున్న ప్రయత్నాలు ఫలించాయి. జీఐ కోసం తిమ్మంపేట మిర్చి ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ 2022లో దాఖలు చేసిన అప్లికేషన్ ఇటీవలే ఇండియన్ పేటెంట్ ఆఫీస్ (ఐపీవో) ఆమోదం పొందింది. 1972లోనే ఉమ్మడి వరంగల్ జిల్లాలో నగర విఎర్చిగా పిలిచినా.. వరంగల్ మిర్చి గానే మార్కెట్‌లోకి వచ్చింది. ఎక్కువగా పచ్చళ్లలో ఈ మిరప పొడిని, ఎండు మిర్చిలను వినియోగిస్తూ వస్తున్నారు. కారంతో పాటు తీపి కలిసి ఉండటం, ఎరుపు రంగు ఎక్కువగా ఉండటంతో పచ్చళ్లు కూడా చాలా రోజులు పాడవ్వకుండా ఉండటంతో ఈ మిర్చి సాగు క్రమంగా ఇతర ప్రాంతాలకు పాకింది. మెక్సికన్ క్యాప్సికమ్‌ను పోలి ఉండే ఈ మిరప ఎక్కువ కారం లేకుండా కొంచెం తీపిగా ఉండటం దీని ప్రత్యేకత. వరంగల్ మిర్చిగా మొదట పిలిచేవారు. ఆ తరువాత లంబుకాయ, సింగిల్ పట్టి, డబుల్ పట్టి, టమాట మిర్చి అని పిలుస్తున్నారు. జీఐ ట్యాగ్ లభించటంతో అంతర్జాతీయ మార్కెట్‌లో చపాట మిర్చికి డిమాండ్ పెరగనుంది.

రుణమాఫీ.. రైతు హ్యాపీ

ప్రభుత్వం మూడు విడతల్లో రైతలకు రుణమాఫీ చేయగా.. మొదటి రెండు విడతల్లో ఉమ్మడి జిల్లాలో 2,08,077మంది రైతులకు రూ.1,506.50కోట్ల రుణం మాఫీ అయ్యింది. మూడో విడతగా ఆగస్టు 15వ తేదీన 56,704మంది రైతులకు రూ.735.29కోట్లు కాగా.. మొత్తం మూడు విడతల్లో 2,64,781మంది రైతులకు రూ.2,241.79కోట్ల రుణమాఫీ చేసింది. ఏకకాలంలో ఇంత పెద్దమొత్తంలో రుణమాఫీ కావటంతో రైతుల్లో ఆనందం వ్యక్తం అవుతుంది. అయితే నాలుగో విడతలో రూ.2లక్షలకు పైన రుణం ఉన్న రైతులకు కూడా డిసెంబరు ఆఖరుకల్లా రెండు లక్షల వరకు మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా, అమలు కాకపోవటంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. రూ.2లక్షలకుపైగా రుణం ఉన్న రైతులు సుమారు 10వేల మందికి పైగా ఉండే అవకాశం ఉంది. వీరికి కూడా రుణమాఫీ చేస్తారనే ఆశతో ఈ ఏడాదంతా ఎదురుచూస్తూనే ఉన్నారు.



ప్రాజెక్టుల్లో కదలిక

పాతికేళ్ల క్రితం మొదలైన దేవాదుల ప్రాజెక్టు పను లు ఇంకా పూర్తి కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత దేవాదుల ప్రాజెక్టుపై ప్రత్యేకంగా దృష్టి పెట్టిం ది. ఆగస్టు 30న భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ములుగు జిల్లాలోని దేవాదుల ప్రాజెక్టును పరిశీలించారు.

2026 మార్చినాటికి దేవాదుల పనులు పూర్తి చేస్తామని, ఇందుకు కావాల్సిన రూ. 680కోట్ల నిధులను కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అలాగే భూపాలపల్లి జిల్లాలో రూ.286కోట్లతో చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు పనులను పూర్తి చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు.

ఓరుగల్లుకు పత్తి పరిశోధన కేంద్రం

అఖిల భారత పత్తి పరిశోధన పథకం(ఏఐసీఆర్) కింద డిసెంబరు 4వ తేదీన వరంగల్‌లో పత్తి పరిశోధన కేంద్రాన్ని మంజూరు చేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ఈ పరిశోధన కేంద్రం అమల్లోకి రానుంది. దీంతో జాతీయ స్థాయిలో పత్తి సాగుపై వరంగల్ కేంద్రంగా పరిశోధనలు చేయనున్నారు. అధిక దిగుబడులను ఇచ్చే సాగు, సమతుల ఎరువులు, చీడలు, తెగుళ్ల నివారణ చర్యలు, పరిశోధన కేంద్రం నుంచి అభివృద్ధి చేసిన మెరుగైన రకాల పెంపకం, ఆధిక నాణ్యత, స్థిరమైన ఉత్పత్తి లక్ష్యంగా ఈ కేంద్రంలో పరిశోధనలు జరగనున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 20 నుంచి 30రకాల బీజీ-2 విత్తనాలనే సాగు చేస్తున్నారు. వీటిపై కూడా ఓరుగల్లులో పరిశోధనలు చేసి, ఈ రకం విత్తనాలు ఇక్కడి భూములకు అనుకూలమో.. కాదో వ్యవసాయ శాస్త్రవేత్తలు వివరించనున్నారు. రైతులు వేరు తెగుళ్లతో పాటు గులాబీ పురుగు ఉధృతితో తీవ్రంగా నష్టపోతున్నారు. దీనిపై పరిశోధనలు చేసి, రిపోర్టు వచ్చే సరికే పంటకు జరగాల్సిన నష్టం జరిగి పోతుంది. వరంగల్‌లోనే పరిశోధన కేంద్రం ఉండటంతో స్థానికంగానే టెక్నాలజీతో వరంగల్ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై పరిశోధనలు చేసి, నివారణ చర్యలు సూచించే అవకాశం ఏర్పడుతుంది.

2024 కాలచక్రం

భయపెట్టిన విపత్తులు

- ఈ ఏడాది ప్రకృతి వైపరీత్యాలతో జల్లుమన్న ఓరుగల్లు
- కుంభవృష్టి వానలు.. జల ప్రళయాలతో జనం విలవిల
- పచ్చని అడవిలో విధ్వంసం సృష్టించిన పెను గాలులు
- మేడారం కేంద్రంగా భూ ప్రకంపనలతో ప్రజలు గజగజ

కేసముద్రంలో వరద ఉధృతికి వేలాడుతున్న రైల్వే లైన్ (ఫైల్)





(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కుంభవృష్టి వానలు.. జలప్రళయాలు.. పచ్చని అడవుల్లో పెనుగాలులు.. భూ ప్రకంపనలు.. ఇవీ ఈఏడాది ఓరుగల్లు వాసులను భయపెట్టిన విపత్తులు. ఈ ఏడాది ప్రకృతి చేసిన కన్నెర్రతో ప్రజలు వణికిపోయారు. ములుగు జిల్లా మేడారం అడవులు కేంద్రంగా టోర్నడోల బీభత్సానికి వేలాది చెట్లు నేలకూలగా, ఇవే అడవుల సాక్షిగా ప్రకృతి సృష్టించిన భూకంపం ప్రపంచాన్ని జల్లుమనిపించింది. ఆకాశానికి చిల్లు పడినట్లుగా కురిసిన కుంభవృష్టితో జనజీవనం అతలాకుతలమైంది. ఈ ఏడాది వరుసగా తలెత్తుతున్న ప్రకృతి వైపరీత్యాలు ఓరుగల్లువాసులను టెన్షన్ పెట్టాయి.

మేడారం అడవుల్లో టొర్నాడోల బీభత్సం

ఆగస్టు 31వ తేదీన సాయంత్రం 5.30గంటల నుంచి రాత్రి 7గంటల వాతావరణంలో ఏర్పడిన మార్పులతో ములుగు జిల్లా తాడ్వాయి- మేడారం అడవుల్లో ఒక్కసారిగా భారీ అలజడి చెలరేగింది. పెద్దఎత్తున గాలిదుమారం, సుడి గాలులతో మేడారం అడవుల్లో మహావృక్షాలు కూడా చిగురాటకులా వణికిపోయాయి. ఈ భారీ గాలికి ఒకటి కాదు రెండు వందలు కాదు.. ఏకంగా 500హెక్టార్లలో 1.20 లక్షలకు పైగా చెట్లు ఒకే నమూనాలో కుప్పకూలిపోయాయి.

ఏకకాలంలో కుంభవృష్టి వానతో పాటు పెనుగాలులు సృష్టించిన బీభత్సం పర్యావరణ శాస్త్రవేత్తలను కూడా ఆశ్చర్యపరుస్తున్నాయి. దీనిని గ్రీన్‌హౌస్ ఎఫెక్ట్‌గా పర్యావరణవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

క్లౌడ్ బరస్ట్ కలకలం

ఆకాశానికి చిల్లుపడినట్టుగా వర్షం మొత్తం ఒకే చోట కుప్పగా పడటాన్ని క్లౌడ్ బరస్ట్‌గా పేర్కొంటారు. ఈ ఏడాది ఆగస్టు 31 రాత్రి మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేటలో 40.56సె.మీ, జిల్లా కేంద్రంలో అత్యధికంగా 29.67సె.మీ వర్షం పడింది. కేసముద్రంలో 37.72సె.మీ. వర్షపాతం నమోదవగా, దంతాలపల్లి, కురవి మండలంలో 35.42 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. కుండపోత వానతో ఆకేరు, మున్నేరు వాగుల్లో ప్రవాహం పెరగటంతో పాటు రైల్వేట్రాక్‌లు కూడా ధ్వంసమయ్యాయి.

సైంటిస్ట్ అశ్విని తన తండ్రి మోతీలాల్ సహా వరదలో కొట్టుకుపోయి మృతి చెందారు. ఒక్కసారిగా రాత్రికిరాత్రే క్లౌడ్‌బరస్ట్‌తో వరదను అంచనా వేయలేకపోతున్నారు. 2023 జూలై 27వ తేదీన తెలంగాణ చరిత్రలోనే తొలిసారిగా ములుగు జిల్లా లక్ష్మీదేవిపేటలో రికార్డు స్థాయిలో 64.98సె.మీ వర్షపాతం నమోదైంది. భూపాలపల్లి జిల్లా చిట్యాలలో 61.65సెం.మీలు, గణపురంలో 47.58సెం.మీటర్ల వర్షపాతం నమోదైంది. ఒక ఏడాదంతా పడాల్సిన వాన ఆకాశానికి చిల్లుపడినట్టుగా ఒకేచోట ఒకేసారి కుమ్మరించినట్టు పడటంతో వాగులు, చెరువులు వాన తాకిడిని తట్టుకోలేకపోయాయి. ఈ ఏడాది మానుకోట జిల్లాను క్లౌడ్‌బరస్ట్ కాకవికలం చేసింది. వరుసగా గతేడాది నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాలో భారీ వర్షాలు ఒకే చోట పడుతుండటం వాతావరణ మార్పులే కారణమని చెబుతున్నారు.

ములుగులో టొర్నాడోకు కూలిపోయిన చెట్లు (ఫైల్)



ఓరుగల్లులో భూ ప్రకంపన

మేడారం- ఐలాపూర్ అడవులు కేంద్రంగా ఏర్పడిన భూకంపం తెలుగు రాష్ట్రాలను వణికించింది. డిసెంబరు 4వ తేదీ ఉదయం 7.27గంటలకు ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం-ఐలాపూర్ అడవుల్లో 40కిలో మీటర్ల లోతున రిక్టర్ స్కేల్‌పై 5.3తీవ్రతతో భూమి కంపించింది. ఐదు నుంచి 10 సెకన్ల వ్యవధిలో 225కిలో మీటర్ల మేర ప్రకంపనలు వచ్చాయి. దీంతో ప్రజలు భయంతో ఇళ్లనుంచి బయటకు పరుగులు తీయగా, మరికొందరు ఏం జరుగుతుందో అని తెలుసుకునేలోపే సాధారణ స్థితికి వచ్చింది. అయితే రిక్టర్ స్కేల్‌పై 5.3మాగ్నిట్యూడ్‌తో 40కిలో మీటర్ల లోతులో భూకంపం రావటం వల్ల పెద్దగా నష్టం జరగలేదని, అదే 10కిలో మీటర్ల లోతులోనే వచ్చి ఉంటే భారీ నష్టం జరిగి ఉండేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రకంపనల తీవ్రత తక్కువగా ఉన్నప్పటికీ అక్కడక్కడ ఇంటి సీలింగ్‌లు, పిట్ట గోడలు కూలిపోయాయి. అయితే ఎక్కడ పెద్దగా ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదు. ఇలా ఈ ఏడాది మొత్తం ప్రకృతి వైపరీత్యాల మధ్య ప్రజలు వణికిపోయారు.

టైగర్.. అలర్ట్!

పెద్దపులి ప్రవేశంతో అటవీ శాఖ అప్రమత్తం

- నల్లబెల్లి, కొత్తగూడ మండలాల్లో ఆనవాళ్లు
- ఎరవేసే పనిలో అధికారులు

గూడూరు అటవీ ప్రాంతంలో అమర్చిన ట్రాప్ సీసీ కెమెరా



గూడూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో పులి సంచారం.. ములుగు, భూపాలపల్లి, వరంగల్, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల అటవీశాఖ యంత్రాన్ని పరుగులు పెట్టిస్తోంది. అక్కడక్కడా కనిపిస్తున్న పులి పాదముద్రలు సమీప ప్రాంతాల ప్రజలను ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం రుద్రగూడెం, మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని కోనాపురం గ్రామాల్లో పులి పాదముద్రలు కనిపించగా, పులి తన ప్రదేశానికి క్షేమానికి తిరిగి వెళ్లేలా అటవీశాఖ యంత్రాంగం చర్యలు చేపట్టింది. పెద్ద పులి గమనం తీరుతెన్నులపై అధికారులు దృష్టిపెట్టారు. పులి అడుగుజాడల కోసం ముమ్మర అన్వేషణ కొనసాగిస్తున్నారు. రెండ్రోజుల కిందట కొత్తగూడ మండలం కోనాపురంలో పులి సంచరించిన అనవాళ్లను అటవీ శాఖ అధికారులు పులి పాదముద్రల ద్వారా సేకరించారు. గూడూరు అటవీశాఖ డివిజన్ పరిధిలోని కొత్తగూడలో పులి సంచరించగా, అది గూడూరు రేంజ్ పరిధిలోకి వచ్చే అవకాశం ఉందని అటవీశాఖ అధికారులు భావిస్తున్నారు. ముందస్తుగా పులి కోసం ఎప్పటికప్పుడు గాలిస్తున్నారు. ఎఫ్‌డీవో చంద్రశేఖర్ నేతృత్వంలో గూడూరు, కొత్తగూడ, గంగారం రేంజ్ అధికారులు సురేష్, వజహత్, శ్రీనివాసన్ ఆధ్వర్యంలో బృందాలను ఏర్పాటు చేశారు. నీటి నిల్వల ప్రదేశాలను పరిశీలించారు.

ఉచ్చులు ఉంటే చిక్కులే..

అటవీ సమీప వ్యవసాయ భూముల్లో అడవి పందులు, ఇతర జంతువుల తాకిడి తట్టుకునేందుకు కొందరు రైతులు ఉచ్చులు, కరెంట్ తీగలు ఏర్పాటు చేస్తుంటారు. వీటిని గుర్తించి తొలగించే పనిలో అటవీశాఖ అధికారులు ఉన్నారు. ఉచ్చులను గుర్తించి తొలగిస్తున్నారు. ఒకవేళ వాటిని అలాగే వదిలేస్తే పులి చిక్కుకునే ప్రమాదం ఉంది. జిల్లా అధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. అటవీశాఖ బృందాలు రంగంలోకి దిగారు. వేటగాళ్ల కదలికలపై అనుమానంతో అధికారులు పులి సంచారం, సమాచారంతో గోప్యతను పాటిస్తున్నట్లు తెలుస్తోంది.

పులి ఎదురుపడితే జాగ్రత్త!

ఒకవేళ మనం పులిని చూసినా.. లేదా పులి మనల్ని చూసినా.. ఆత్మ రక్షణ చర్యలు చేపట్టక తప్పదు. పులి ఎక్కడైనా తారసపడితే ముందుగా కదలకుండా నిశ్శబ్దంగా నిల్చోవాలి. శ్వాస వేగంగా తీసుకోకూడదు. పులి వెళ్లిన దిశకు వ్యతిరేక దిశలో వెంటనే వెళ్లిపోవాలి. ఇక్కడ తప్పించుకోవడం ఒక్కటే లక్ష్యంగా ఉండాలి. పులులు సాధారణంగా జింకలాంటి వాటిపై వెనుక నుంచి దాడి చేస్తాయి.

ముఖ్యంగా అవి కూర్చొని ఉన్నప్పుడు వేటాడుతాయి. పైగా అవి జంతువులకు, మనుషులకు మధ్య తేడాను గుర్తించలేవు. అందుకే మనిషి నిల్చొని ఉంటే పులి బారి నుంచి తప్పించుకోవచ్చు. ఇది వేటాడే జంతువు కాదని అది వెళ్లిపోతుంది. గతంలో అటవీ ప్రదేశాల్లో కట్టెలు పొగు చేసుకుంటున్న వారు, లేదా వంగి వ్యవసాయ పనులు చేసుకుంటున్న మనుషులపై వెనుక నుంచి పులి దాడులు జరిపిన సంఘటనలున్నాయి. సాధారణంగా పులికి తలపై దాడి చేసే ఉద్దేశం ఉంటే.. అది ఒక్కసారిగా ఉన్నచోటనే ఆగిపోతుంది. పులి వేటాడాలనుకున్న వారిపై దృష్టి పెడుతుంది. కాళ్లను వంచుతుంది.. దాని చెవులు వెనక్కి వెళ్లినట్లుగా అవుతాయి. ఆగ్రహంగా గాండ్రించి ముందుకు దూకుతుంది. పులి కొంచెం దూరంలో ఉంటే చెట్లు ఎక్కవస్తే వెంటనే చెట్లు ఎక్కేయ్యాలి. కనీసం 15 అడుగుల ఎత్తు ఎక్కే దాకా ఆగొద్దు. అవకాశం ఉంటే ఇంకా పైకి ఎక్కాలి.



నల్లబెల్లిలో డ్రోన్ ఎగరవేస్తున్న ఫారెస్ట్ సిబ్బంది

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



చంద్రశేఖర్, ఎఫ్‌డీవో, గూడూరు

పెద్దపులి ప్రవేశంతో అప్రమత్తంగా ఉన్నాం. ప్రస్తుతం పెద్దపులి కొత్తగూడ రేంజ్ పరిధిలోని కోనాపురం, నర్సంపేట రేంజ్ పరిధిలోని రుద్రగూడెంలో సంచరించినట్లు అనవాళ్లు గుర్తించాం. దాని గమనం ఎటువైపు ఉంటుందనే దానిపై దృష్టి పెట్టాం. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అటవీశాఖ ఆధ్వర్యంలో బృందాల వారీగా గాలింపు చర్యలు చేపట్టాం. నీటి ప్రదేశాలు, అటవీప్రాంతాల్లో ఉచ్చులు ఉంటే తొలగించే చర్యలు చేపట్టాం.

వేరే ప్రాంతానికి పెద్దపులి

నల్లబెల్లి (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని రుద్రగూడెం గ్రామంలో మూడు రోజులుగా పెద్దపులి ఉందని భయం భయంగా రైతులు, ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఆదివారం రుద్రగూడెం ఏనే అడవిలో డ్రోన్‌తో గాలింపు చేశారు.

ఈ ఏనేలో పెద్దపులి లేదని తేల్చేశారు. అలాగే పెద్దపులి అడుగులను వివిధ ప్రాంతాల్లో గుర్తించిన ఫారెస్ట్ అధికారులు.. పెద్దపులి వేరే ప్రాంతానికి పోయిందని నల్లబెల్లి ఫారెస్ట్ సెక్షన్ అధికారి సోమ, నర్సంపేట ఎఫ్ఆర్వో రవికిరణ్ తెలిపారు. రైతులు, ప్రజలు యథావిధిగా తమ పనులు తాము చేసుకోవచ్చన్నారు. అయితే ఇక్కడి నుంచే నర్సంపేట, ఖానాపురం మండలాలకు పులి వెళ్లవచ్చనే అనుమానాలు కలుగుతున్నాయి.

నర్సంపేట, ఖానాపురం మండలాల్లో సంచారం

పొలాల్లో పాద ముద్రలు ▸ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

నర్సంపేట టౌన్ (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా నల్లబెల్లి మండలంలోని రుద్రగూడెం శివారులో పులి సంచరిస్తోందని ఫారెస్టు అధికారులు ధ్రువీకరించిన క్రమంలో.. ఆదివారం నల్లబెల్లి మండల శివారులోని నర్సంపేట మండలంలోని రాజుపేట గ్రామ పరిధిలోని జంగాలపల్లి తండాలోని పొలాల్లో పులి సంచరించినట్లు ఆనవాళ్లు కనిపించడంతో రైతులు, ప్రజల్లో కలకలం రేకెత్తింది. పులి సంచరించిందని తండావాసులు తెలపడంతో నర్సంపేట టౌన్ సీఐ రమణమూర్తి ఎస్సైలు రవికుమార్, అరుణ్‌లతో పాటు పోలీసు సిబ్బంది తండా శివారులోని పంట పొలాలను పరిశీలించారు. అలాగే ఫారెస్టు అధికారులు సైతం తండాను సందర్శించి పులి సంచరించినట్లు ధ్రువీకరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రజలు, రైతులు, పశువుల కాపరులు సాయంత్రం 4 గంటల లోపే తమ తమ ఇళ్లకు చేరుకోవాలని సూచించారు. ఇదిలా వుండగా, పులి సంచారంతో ప్రజలు భయం గుప్పిట్లో కాలం వెళ్లదీస్తున్నారు. పులిని పట్టుకుంటే తప్ప ఎవ్వరికీ కంటి మీద కునుకు తీసే పరిస్థితులు కనిపించడం లేదు.

కీర్యాతండాలో పులి తిరిగిన ఆనవాళ్లు

ఖానాపురం: మండలంలోని కీర్యాతండా, ముత్యాలమ్మతండా, దబీర్‌పేట శివారుల్లోని పంటపొలాల్లో పులి సంచరించిన ఆనవాళ్లు స్థానికులు ఆదివారం గుర్తించారు. కొన్నిరోజులుగా నల్లబెల్లి మండల పరిధిలోని మేడపెల్లి, రుద్రగూడెం గ్రామ శివారుల్లో సంచరించిన పెద్దపులి.. ఖానాపురం మండలంలోకి ప్రవేశించడంతో అటవీ సరిహద్దు గ్రామాల్లోని ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఆదివారం అశోక్‌నగర్, దబీర్‌పేట బీట్ పరిధిలోని ముత్యాలమ్మతండా, కీర్యాతండా సమీపంలోని పొలాల్లోకి వెళ్లిన రైతులకు పులి పాదముద్రలు కనిపించడంతో భయాందోళనకు గురయ్యారు. కీర్యాతండా మాజీ సర్పంచ్ హట్యా తన పొలంలో పులి పాదముద్రలు గుర్తించి ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. ఎఫ్ఆర్వో రవికిరణ్, డీఆర్వో రీనా ఆధ్వర్యంలో ఫారెస్ట్ అధికారులు కీర్యాతండాలో పులి పాదముద్రలను గుర్తించి నమూనాలను సేకరించారు.

ఎవరూ అడవుల్లోకి వెళ్లొద్దు

పాఖాల అడవుల్లో పెద్దపులి సంచరిస్తున్న క్రమంలో అడవుల్లోకి ఎవరూ వెళ్లొద్దని నర్సంపేట ఎఫ్ఆర్వో రవికిరణ్, ఎస్సై రఘుపతి తెలిపారు. పశువులను అడవుల్లోకి మేతకు తీసుకెళ్లొద్దన్నారు.

ఎక్కడైనా పులి పాద ముద్రలు కలిపిస్తే అటవీ శాఖకు సమాచారం అందించాలన్నారు. పులికి హాని తలపెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మల్లన్న కల్యాణం కమనీయం

▸ వెల్లివిరిసిన ఆధ్యాత్మికత ▸ జనసంద్రంగా ఆలయ పరిసరాలు

చేర్యాల, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): వీరశైవపండితుల మంత్రోచ్చరణలు, భక్తుల జయజయధ్వానాలు, మేళతాళాల చప్పుళ్లు, మంగళవాయిద్యాల నడుమ కొమురవెల్లి మల్లికార్జున స్వామి కేతలమ్మ, మేడలా దేవీలను వివాహమాడినాడు. సనాతన వీరశైవాగమశాస్త్రం ప్రకారం మార్గశిర మాసం చివరి ఆదివారం రోజును పురస్కరించుకుని ఆలయప్రాంగణంలోని తోటబావి ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కల్యాణ వేదికపై వీరశైవ కాశీపీఠాధిపతి మల్లికార్జున విశ్వారాధ్య శివాచార్య వేద పర్యవేక్షణతో పాటు దేవాదాయశాఖ ఆర్‌జేసీ రామకృష్ణారావు పర్యవేక్షణ, ఈవో బాలాజీశర్మ, కల్యాణ ఉత్సవ అధికారి సురేం దర్‌రెడ్డి ఆధ్వర్యంలో నభూతో నభవిష్యత్తు అన్న చందంగా కమనీయంగా, రమణీ యంగా కైంకర్యం నిర్వ హించారు.

కల్యాణ క్రతువు

వీరశైవార్చకులు మల్లికార్జునస్వామి, కేతమ్మ, మేడలాదేవీల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఊరేగిస్తూ మహిళల కోలాటాల నడుమ భాజాభజంత్రీల మధ్య కల్యాణ మంటపానికి తీసుకువచ్చారు. వరుడు మల్లిఖార్జునస్వామి తరఫున కన్యాగ్రహీతలుగా పడిగన్నగారి ఆంజనేయులు దంపతులు, అమ్మవార్లు గొల్ల కేతమ్మ, మేడలాదేవీల తరఫున కన్యాదాతలుగా మహదేవుని భాస్కర్ దంపతులు వ్యవహరించారు. వీరశైవ ఆగమపండితులు గణపతిపూజ, స్వస్తివాచనం, మంటప దేవతారాధన ప్రతిష్ఠ, పాదార్చన, భాషింగధారణ, వస్త్రాలంకరణ, మధుసంపర్క స్వీకరణ, గూడజీర శిఖారాధన, కన్యాదానం, మంగ ళసూత్రధారణ జరిపారు. అనంతరం ముత్యాల తలంబ్రాలు, ఓడుబియ్యం పోశారు. ప్రత్యేక పూలఅలంకరణ వేదికపై పట్టు వస్త్రాలతో దేవతామూర్తులు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి కల్యాణ నిర్వహణ తీరు, విశేషాలను డాక్టర్ మహంతయ్య, షశిభూషణ సిద్ధాంతి చేసిన వ్యాఖ్యానం భక్తులను అలరించింది. మల్లన్నకీ జై.. అన్న భక్తులు చేసిన జయజయధ్వానాలతో ఆలయ పరిసరాలు ప్రతిధ్వ నించాయి. దేవదేవుల నామస్మరణలో పులకించిపోయారు.

గర్భాలయంలోనూ..

గర్భాలయంలోనూ మల్లన్నకు శాస్త్రోక్తయుక్తంగా కల్యాణాన్ని నిర్వహించారు. కన్యాదాతలుగా మహదేవుని రవి దంపతులు, కన్యా గ్రహీతలుగా పడిగన్నగారి వంశస్తులైన పడిగన్నగారి మల్లయ్య దంపతులు వ్యవహరించారు. ఏకాదశరుద్రాభిషేకం పూజలు నిర్వహిల్చాచారు. కాగా, మల్లన్న కల్యాణం అద్యంతం ఆలస్యంగా జరిగింది. ఉదయం 10-45గంటలకు జరగాల్సి ఉండగా, మధ్యాహ్నం 12-28గంటలకు మాంగళ్యధారణ చేశారు. కల్యాణ కైంకర్యం నిర్ణీత సమయానికన్నా గంటన్నరపాటు ఆలస్యమడంతో భక్తులు విస్మయం వ్యక్తంచేశారు.

దృష్టి కుంభం-బలిహరణ

తెల్లవారుజామున 4.30గంటలకు గర్భాలయ మండపంలోని వీరభద్రుడికి బలిహరణ చేసి దృష్టికుంభాన్ని ఘనంగా నిర్వహించారు. వీరశైవార్చకులు అన్నంరాశులపై గుమ్మడికాయలు నెలకొల్పి దండకాలతో హోరెత్తించిన అనంతరం గుమ్మడికాయను బలిఇచ్చి స్వామివారి తొలిదర్శనాన్ని ప్రారంభించారు. మల్లన్నకు చత్రకన్ను అమర్చి శతరుద్రాభిషేకం పూజలు నిర్వహించారు.



మంగళ సూత్ర ధారణ చేస్తున్న అర్చకులు ←

బిగ్‌బాస్ ఫేమ్ అఫ్రిది యువతకు స్ఫూర్తి



బిగ్‌బాస్ ఫేమ్ అఫ్రిదిని సన్మానిస్తున్న సామాజిక వేత్త ఈవీ శ్రీనివాస్

హనుమకొండ సిటీ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): బిగ్‌బాస్ ఫేమ్ నబీల్ అఫ్రిది జీవన యాత్ర యువతకు స్ఫూర్తిదాయకమని టీపీసీసీ నాయకుడు, సామాజికవేత్త ఈవీ శ్రీనివాస్ కొనియాడారు. ఆదివారం హనుమకొండ వడ్డెపల్లిలో అఫ్రిదిని ఆయన సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ ముస్తాక్ నేహాల్, రోషన్ గైక్వాడ్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యోదయహిల్స్ కాలనీ సమస్యలు పరిష్కరించండి

▸▸ ఎమ్మెల్యే నాయినికి కాలనీ కమిటీ వినతి



ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సూర్యోదయహిల్స్ కాలనీ కమిటీ నాయకులు

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ హంటర్ రోడ్‌లోని 31వ డివిజన్ సూర్యోదయహిల్స్ కాలనీలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కాలనీ కమిటీ నాయకులు ఆదివారం పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. హనుమకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాలనీ కమిటీ నాయకులు ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. కాలనీలో అంతర్గత రహదారులు, డ్రైనేజీలు లేవని, రోడ్లు వేయించి, డ్రైనేజీలు నిర్మించాలని వినతిపత్రంలో ఎమ్మెల్యేను కోరారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు సూర్యోదయ హిల్స్‌కాలనీ అధ్యక్షుడు జన్నపురెడ్డి అశోక్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో 31వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంకేశ్వరపు సురేందర్, సూర్యోదయ హిల్స్‌కాలనీ ప్రధాన కార్యదర్శి నల్లపు కోటేశ్వర్, కోశాధికారి కీర్తి లక్ష్మయ్య, గౌరవ సలహాదారుడు జూలపల్లి కారుణాకర్‌రావు, ఉపాధ్యక్షుడు పుట్ట శ్రీనివాస్, సహాయ కార్యదర్శి ఎస్.నారాయణ, కార్యవర్గ సభ్యులు ఆర్.వి.శరత్ బాబు, కంచర్ల పూర్ణచందర్, పున్నంప్రదీప్‌రెడ్డి, ఎల్.మహేందర్‌రెడ్డి ఉన్నారు.

కేయూ సేవాలాల్ విద్యార్థి సేన కమిటీ ఎన్నిక



నూతన బాధ్యులకు ఎంపిక పత్రాన్ని ఇస్తున్న సేవాలాల్ నేతలు

కేయూ క్యాంపస్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సేవాలాల్ విద్యార్థి సేన కాకతీయ యూనివర్సిటీ నూతన కమిటీని ఆదివారం సేవాలాల్ సేన విద్యార్థి సేన కేయూ ఇన్‌చార్జ్ తిరుపతినాయక్ నేతృత్వంలో ఎంపిక చేశారు. కేయూ క్యాంటీన్ వద్ద జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎంపిక చేసినట్లు తిరుపతినాయక్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు భూక్య సిద్ధూ నాయక్‌లు సంయుక్తంగా ప్రకటించారు. కేయూ సేవాలాల్ విద్యార్థి సేన అధ్యక్షుడిగా కేతావత్ కుమార్, ఉపాధ్యక్షులుగా ధరావత్ రవి, బాలాజీ, జాటోత్ అనిల్, ప్రధాన కార్యదర్శిగా పవర్ అంజుకుమార్, సహాయ కార్యదర్శిగా విజయ్, సురేశ్, సందీప్, కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా లాల్‌సింగ్, మంగీలాల్, ట్రెజరర్‌గా రఘురాం, సోషల్‌మీడియా కన్వీనర్‌గా వినోద్, వెంకటేశ్‌లను ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంఘాల నేతలు కల్యాణ్ నాయక్, నరేశ్, నగేశ్, లాల్‌సింగ్, సంతోష్, వసంత్, గణేశ్, సంజీవ్,రవి, రాజు, మహేశ్, రవీందర్, యేగేశ్, పవన్, రాకేశ్, హన్మంతు, సుధీర్, జైపాల్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న జయలక్ష్మి

వడ్డెపల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశావర్కర్లకు రూ.18వేల ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.జయలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని నేరెళ్ల వేణు మాధవ్ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన బహిరంగ సభలో ఆమె మాట్లాడారు. ఆశావర్కర్లకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాన్ని కల్పించాలని, పర్మినెంట్ చేయాలని కోరారు. సభలో తెలంగాణ ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాసు మాధవి, సీపీఎం జిల్లా కార్యదర్శి జి.ప్రభాకర్‌రెడ్డి, సీఐటీయూ నాయకులు రాగుల రమేష్, తెలూరి ఉప్పలయ్య, ముక్కెర రామస్వామి, బొట్ల చక్రపాణి, సంపత్, పద్మ, శ్వేత, చైతన్య, శోభ, శ్రీవాణి, పద్మ, పుతిలి, రాజేశ్వరి, రమ, నీరజ తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సమాజం అన్ని రంగాల్లో రాణించాలి

▸▸ శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి



సమావేశంలో మాట్లాడుతున్న సిరికొండ మధుసూదనాచారి

వడ్డెపల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్వయంకృషితో విశ్వబ్రాహ్మణ సమాజం అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్సీ, శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి పిలుపునిచ్చారు. హనుమకొండలోని ఓ ప్రైవేటు సమావేశ మందిరంలో ఆదివారం వరంగల్ ఉమ్మడి జిల్లా శ్రీకామాక్షి విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మహిళా సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మధుసూదనాచారి మాట్లాడుతూ.. జాతి మనుగడ కోసం పుట్టిన సంఘాలు జాతి ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన పెంచుకొని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృ సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ లాలుకోట వెంకటాచారి మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో సమాజంలో మహిళల ప్రాధాన్యత మరింత పెరగాలని కోరారు. సమావేశంలో విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు గుగ్గిళ్ల శశిరేఖ, సంస్థ రాష్ట్ర ప్రధాన సలహాదారు చొల్లేటి కృష్ణమాచారి, విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మసంఘం రాష్ట్రజిల్లా నాయకులు పెండోట శ్రీనివాస్, చిలుపూరి లక్ష్మి, దంతోజు యశోద, అద్దంకి నాగేశ్వర్‌రావు, సరోజన పాల్గొన్నారు.

ఎర్రజెండా నీడలోనే పేదరిక నిర్మూలన

▸▸ సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు



ఎల్లాపూర్‌లో సీపీఐ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

హసన్‌పర్తి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎర్రజెండా నీడలోనే పేదరిక నిర్మూలన సాధ్యమని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ శత జయంతి ఉత్సవాలలో భాగంగా ఆదివారం గ్రేటర్ 65వ డివిజన్ పరిధి ఎల్లాపూర్‌లో నూతనంగా నిర్మించిన సీపీఐ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ముందుగా సీపీఐ పార్టీ జెండాను ఆవిష్కరించి పార్టీ కోసం పోరాటం చేసి అసువులు బాసిన అమరవీరులకు నివాళులర్పించి వారి సేవలను కొనియాడారు. అనంతరంఆయన మాట్లాడుతూ.. దేశంలోని వామపక్ష, లౌకిక పార్టీలు, ఐక్య పోరాటాలు నిర్వహిస్తూ అభివృద్ధి నిరోధక బీజేపీని ప్రజల నుంచి తరిమికొట్టాలన్నారు. వీరోచిత పోరాటాలు చేసి స్వాతంత్ర్యం సాధించామని, స్వాతంత్ర్య పోరాటంలో సీపీఐ పార్టీ గణనీయమైన పాత్ర పోషించిన విషయాన్ని గుర్తుచేశారు. లౌకిక ప్రజాతంత్ర శక్తుల బలం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలోని ఎన్నికలు ధన స్వామ్యంగా మారాయన్నారు. ఇదే తీరు కొనసాగితే ప్రజాస్వామ్యం ధనస్వామ్యవాదుల చేతుల్లో కీలుబొమ్మగా మారుతుందన్నారు. ఇది దేశానికి అత్యంత ప్రమాదకరమన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా సీపీఐ కార్యదర్శి కర్రె భిక్షపతి, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, మహిళా సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మంద సదాలక్ష్మి, సీపీఐ సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి, నేదునూరి రాజమౌళి, సీపీఐ మండల కార్యదర్శి మెట్టు శ్యాంసుందర్‌రెడ్డి, సీపీఐ నాయకులు షేక్ బాబు, తిరుపతి, పాడి రామక్రిష్ణారెడ్డి, కుమారస్వామి, సుదర్శన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమాజ స్పృహ మెండుగా ఉన్న కవి కార్తీకరాజు

హనుమకొండ కల్చరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సమాజ స్పృహ మెండుగా ఉన్న కవి కార్తీకరాజు అని ఆచార్య బన్న ఐలయ్య అన్నారు. తెలంగాణ రచయితల సంఘం వరంగల్ ఆధ్వర్యంలో యువ కవి, గాయకుడు కార్తీకరాజు రచించిన అలికిడి కవితా సంపుటి పుస్తక పరిచయ సభ హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హైస్కూల్‌లో ఆదివారం జరిగింది. సమావేశానికి అధ్యక్షత వహించిన ప్రముఖ కవి బిల్లా మహేందర్ మాట్లాడుతూ.. కార్తీకరాజు ఒక కొత్త గొంతుకతో సమాజంలోని అసమానతల పట్ల తన కవిత్వాన్ని వెలువరించడం ఆశించదగ్గ పరిణామమని అన్నారు. పుస్తకాన్ని సమీక్షించిన ప్రముఖ కవయిత్రి గట్టు రాధిక మాట్లాడుతూ.. ఈ కవితలు సమాజంతో అల్లుకున్న భావోద్వేగాల సందడిని, ఇందులోని కవితా వస్తువులను గమనిస్తే కవి కార్తీకరాజు తాను గమనించే ఏ సమస్యను వదిలిపెట్టలేదని అన్నారు. కవికి ఇది మొట్టమొదటి పుస్తకమే అయిన తన అభ్యసనంతో పరిశీలనతో మంచి కవిత్వాన్ని అందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెరసం అధ్యక్షుడు పొట్లపల్లి శ్రీనివాసరావు, కవులు నెల్లుట్ల రమాదేవి, డాక్టర్ చింతం ప్రవీణ్, బీవీఎస్ స్వామి, తాడిచెర్ల రవి, దేశిని శ్రీధర్, చందర్‌రావు, నాగబెల్లి జితేందర్, మంతని శంకర్, అనంతోజు మోహనకృష్ణ, పల్లేరు వీరస్వామి, రామా రత్నమాల, కవి అన్వర్, అస్నాల శ్రీను, నిధి, వాణి దేవులపల్లి, పాము భాస్కర్, సోమయ్య, అంజనీ దేవి తదితరులు పాల్గొన్నారు.

మెట్టుగుట్టపై ప్రత్యేక పూజలు



మెట్టురామలింగేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న భక్తులు

మడికొండ, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మడికొండలోని మెట్టుగుట్టపై అతిపురాతనమైన, దక్షిణ కాశిగా ప్రసిద్ధిగాంచిన మెట్టురామలింగేశ్వరస్వామి, సీతారామచంద్రస్వామి వారి దివ్యక్షేత్రంలో ఆదివారం మాస శివరాత్రి సందర్భంగా స్వయంభూ శివలింగానికి ప్రాతఃకాల రుద్రాభిషేకం జరిగింది. అనంతరం స్వామివారికి భక్తులు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అలాగే సీతారామచంద్రస్వామి వారికి విశేష అర్చనలు అనంతరం యాగశాలలో రుద్రహోమం నిర్వహించారు. ఈవో శేషు భారతి, చైర్మన్ పైడిపాల రఘుచందర్ ఆధ్వర్యంలో జరిగిన పూజలలో అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధనాచార్యులు, పారుపెల్లి సత్యనారాయణ శర్మ, ధర్మకర్తలు బైరి రాజు, వస్కుల ఉమ, దండిగం శ్రీనివాస్, రొడ్డ దయాకర్, బోగి కేదారి, మాడిశెట్టి జ్ఞానేశ్వరి, అయ్యప్పస్వామి మాలధారులు ఓర్సు యాకయ్య, పల్లపు రాజేందర్, బుర్ర రాజ్‌కుమార్, అంకేశ్వరపు బాబురావు, ఎలగొండ శివ, మాచర్ల రాజు, సిబ్బంది రణధీర్, అనిల్, కుమార్, సురేష్, రాజమణి, వెంకటలక్ష్మి, భక్తులు పాల్గొన్నారు.

నేడు పెన్షనర్స్ డే వేడుకలు

వడ్డెపల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ రాంనగర్‌లోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు అఖిల భారత పెన్షనర్స్ డే నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు కుందూరు గోపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎ. సత్యనారాయణలు తెలిపారు. ముఖ్య అతిథులుగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, రిటైర్డ్ ఎస్పీ వో సత్యనారాయణ హాజరయ్యే పెన్షనర్లు అధికంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బీజేపీ డివిజన్ బూత్ అధ్యక్షుడిగా కుమార్



హసన్‌పర్తి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ గ్రేటర్ 55వ డివిజన్ బూత్ అధ్యక్షుడిగా భీమారానికి చెందిన బండారి కుమార్ యాదవ్‌ను నియమిస్తూ వర్ధన్నపేట బీజేపీ ఇన్‌చార్జ్ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్‌తో పాటు బీజేపీ డివిజన్ నాయకులకు, కార్యకర్తలకు కుమార్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.

హెచ్‌ఎంపై దాడిని ఖండిస్తున్నాం

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా మహేశ్వర్ మండలంలోని తుక్కుగూడ జడ్పీహెచ్ఎస్ హెడ్మాస్టర్ రాములుపై జరిగిన దాడిని తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ హెడ్మాస్టర్ల సంఘం తీవ్రంగా ఖండిస్తోందని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.రవీందర్, ఎల్.సుధాకర్‌రావు పేర్కొన్నారు. ఈ మేరకు వారు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అయ్యప్ప మాల ధరించిన విద్యార్థినిని కాలితో తన్నాడనే అబద్ధపు ఆరోపణలతో హెడ్మాస్టర్‌తో క్షమాపణ చెప్పించడంతో పాటు భౌతికదాడి చేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. ఇలాంటి చర్యలతో సమాజంలో ఉపాధ్యాయుల పట్ల చులకన భావం ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చర్యలు సమాజ పురోగతికి మంచిదికాదని హితవుపలికారు. హెడ్మాస్టర్‌పై దాడిచేసిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని వారు ప్రకటనలో డిమాండ్ చేశారు.

ఆకట్టుకుంటున్న నాటకోత్సవాలు

హసన్‌పర్తి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పందిళ్ల శేఖర్‌బాబు స్మారక నాటకోత్సవాలు నాలుగు రోజుల కార్యక్రమంలో భాగంగా ఆదివారం 3వ రోజు భీమారం వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన వసంత రాజీయం చారిత్రాత్మక పద్యనాటకం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, సంగీత నాటక అకాడమీ, చలన చిత్ర అభివృద్ధి సంస్థ సంయుక్త సౌజన్యంతో సాహితీవేత్త గిరిజా మనోహర్‌బాబు సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిటైర్డ్ పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాధారపు సంజీవరెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. సమాజంలో పెరుగుతున్న నేరాలను అరికట్టడంలో వాటిపై అవగాహన కల్పించి నేరాలను నియంత్రించడంలో నాటకాలు ఎంతో కీలకంగా దోహదపడుతాయన్నారు. కళ్లకు రక్తి కట్టించే విధంగా కళాకారుల నాటక ప్రదర్శనలతో ప్రజలను చైతన్యవంతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు.

అనంతరం మహబూబ్‌నగర్‌కు చెందిన దర్శకుడు, రంగస్థల నటుడు టి.కృష్ణ, శివాని ఆర్ట్స్ హైదరాబాద్ సంస్థ అధ్యక్షుడు, మేకప్ ఆర్టిస్టు పరమేష్‌ను సంస్థ కార్యవర్గం శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీసాయి సద్భావన సాంస్కృతిక స్వచ్ఛంద సేవా సంస్థ వారు తడకమల్ల రాంచందర్‌రావు రచనలో సోమ అజిరెడ్డి దర్శకత్వంలో నిర్వహించిన వసంత రాజీయం నాటకం ఆహూతులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా టెంట్ హౌస్, భోజన వసతులు కల్పించిన అటికం రవీందర్, ఆకుల సదానందంలను కళాకారులు అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాటక సమాజాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల సదానందం, వరంగల్ జిల్లా నాటక సమాజాల సమాఖ్య అధ్యక్షుడు మాడిశెట్టి రమేష్, హనుమకొండ నాటక సమాజాల సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ ఓడపల్లి చక్రపాణి, నాటక, కళాకారులు వనం లక్ష్మీకాంతరావు, దేవరాజు రవీందర్, గూడూరు బాలాజీ, సీత వెంకటేశ్వర్లు, వనపర్తి ప్రసాద్, జూలూరి నాగరాజు, ముంద్రాతి రవీందర్, బూర సురేందర్ గౌడ్, ఆకుల రాజేందర్, బైరి సోమయ్య, ఆకుల రాజమౌళి, స్థానిక నాయకులు కవులు, కళాకారులు, కళాభిమానులు గ్రామస్తులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పరిమళ కాలనీ బ్రిడ్జి

▸▸ ప్రమాదకరంగా ఉన్నా పట్టింపులేని అధికారులు

▸▸ కొత్త బ్రిడ్జి నిర్మించాలని విజ్ఞప్తి



శిథిలావస్థలో మగ్గుతున్న పరిమళ కాలనీలోని బ్రిడ్జి

వడ్డెపల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సుమారు మూడు దశాబ్దాల కిందట వడ్డెపల్లి నాలాపై పరిమళ కాలనీ వద్ద నిర్మించిన బ్రిడ్జి శిథిలావస్థలో మగ్గుతోంది. ప్రమాదకరంగా ఉన్న ఈ బ్రిడ్జిపై బల్దియా అధికారులకు పట్టింపు కొరవడిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొత్తగా బ్రిడ్జి నిర్మించాలని వివిధ కాలనీల ప్రజలు ఉన్నతాధికారులకు, ప్రజాప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేస్తున్నారు. వడ్డెపల్లి చెరువు మత్తడి ప్రవహించే నాలాపై పరిమళ కాలనీ పరిసరాల్లో నిర్మించిన బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుంది. బ్రిడ్జికి ఏర్పాటుచేసిన రెయిలింగ్ (గోడలు) సైతం దెబ్బతిన్నాయి. దీనికి అధికారుల ఆలనా పాలన లేకపోవడంతో ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. గత జూన్, జూలైలో కురిసిన భారీ వర్షాలకు వడ్డెపల్లి చెరువు పెద్దఎత్తున ప్రవహించడంతో పరిమళ కాలనీలోని బ్రిడ్జి సైతం దెబ్బతింది. నాలుగైదు ఫీట్ల ఎత్తుతో వరద ప్రవహించడం వలన 30 ఏళ్ల కిందట నిర్మించిన ఈ బ్రిడ్జి వరద తాకిడికి కోతకు గురైంది. తాత్కాలికంగా రేయిలింగ్ గోడలకు మరమ్మతులు చేసి అధికారులు చేతులు దులుపుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. శిథిలావస్థలో ఉన్న ఈ బ్రిడ్జి సైతం ఇరుకుగా ఉండడం వాహనాల రాకపోకలు అధికంగా ఉండడంతో నిత్యం రద్దీగా ఉంటోంది. శిథిలావస్థలో ఉన్న ఈ వంతెన ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొందని స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గ్రేటర్ వరంగల్ మునిసిపల్ అధికారులతో పాటు ఆర్‌అండ్‌బీ అధికారులు బ్రిడ్జిని పరిశీలించి కొత్త బ్రిడ్జిని నిర్మించాలని పరిమళకాలనీ, పోలీసు కాలనీ, సప్తగిరి కాలనీ, పూరిగుట్ట తండా, ఉషోదయ కాలనీల ప్రజలు కోరుతున్నారు.

రెవెన్యూ వ్యవస్థ పునర్నిర్మాణం జరగాలి



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి

డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి

వరంగల్ టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రెవెన్యూ వ్యవస్థ పునర్నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని తెలంగాణ డిప్యూటీ కలెక్టర్ అసోసియేషన్ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి అన్నారు. వరంగల్ ఐశ్వర్య గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించిన రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. గత పాలకులు రెవెన్యూ వ్యవస్థను ధ్వంసం చేశారని, ఉద్యోగులు ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నారని అన్నారు. రాత్రికి రాత్రే 5200 మంది వీఆర్వోలను నిర్దాక్షిణ్యంగా వేరే శాఖలోకి పంపించారన్నారు. దీంతో రెవెన్యూ శాఖలో గ్రామస్థాయిలో అధికారులు లేక తహసీల్దార్ నుంచి కలెక్టర్ స్థాయి వరకు అందరూ ఇబ్బందులు పడ్డారని అన్నారు. వరదలు, కరువు వంటి ప్రకృతి విపత్తులు వచ్చినప్పుడు ప్రాథమిక విచారణ చేసి నివేదిక సమర్పించే అధికారులు లేరని తెలిపారు. రెవెన్యూ వ్యవస్థను తిరిగి బలోపేతం చేసేందుకు ఉద్యోగులు కృషి చేయాలన్నారు. అనంతరం వరంగల్, హనుమకొండ జిల్లాల టీజీఆర్ఎస్ఏ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో టీజీజీఏ స్టేట్ జనరల్ ప్రెసిడెంట్ పాక రమేష్, జనరల్ సెక్రటరీ పూల్‌సింగ్ చౌహాన్, స్టేట్ ప్రెసిడెంట్ రాములు, అసోసియేట్ ప్రెసిడెంట్ మహ్మద్ ఇక్బాల్, ఆర్గనైజింగ్ సెక్రటరీ విక్రమ్ కుమార్ పాల్గొన్నారు.

బీఎస్ఎం నేతలపై అక్రమ కేసులను ఎత్తివేయాలి



మనుస్మృతులను దహనం చేసి నిరసన తెలుపుతున్న డీఎస్ఏ నేతలు, విద్యార్థులు

కేయూ క్యాంపస్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): యూపీ బెనారస్ వర్సిటీలో శాంతియుతంగా నిరసన చేపట్టిన బీఎస్ఎం విద్యార్థులపై అక్రమ కేసులను ఎత్తివేయాలని డెమోక్రటిక్ స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ కె.శ్రావణ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం కేయూ మొదటి గేటు ఎదుట డీఎస్ఏ రాష్ట్ర కమిటీ నేతృత్వంలో మనుస్మృతులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రావణ్ మాట్లాడారు. అంబేద్కర్ స్ఫూర్తితో మనుస్మృతికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రశ్నించడమే నేరమా?అని ప్రశ్నించారు. భగత్‌సింగ్ మోర్చా (బీఎస్ఎం) విద్యార్థులు మనుస్మృతి వ్యతిరేక శాంతి సమావేశం నిర్వహించే క్రమంలో మనువాద హిందూ మతోన్మాద గుండాలు బెనారస్ హిందూ వర్సిటీ గార్డ్స్ ముసుగులో 13 మంది బీఎస్ఎం విద్యార్థి నేతలపై అక్రమ కేసులు వేసి జైలులో వేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయా విద్యార్థులపై కేసులను నిరసిస్తూ ప్రజాస్వామ్య వాదులు, ప్రజలు, విద్యార్థులు మేధావులంతా మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. దేశంలో భావ ప్రకటన స్వేచ్ఛను హరిస్తున్నారని మండిపడ్డారు. పౌరుల జీవించే హక్కులను హరిస్తున్నారని ధ్వజమెత్తారు. రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యత అందరిపై ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో డీఎస్ఏ హనుమకొండ జిల్లా కన్వీనర్ ఉప్పుల శివ, యూనివర్సిటీ కన్వీనర్ కె.శివలపాటు విద్యార్థి సంఘం నేతలు సునిల్, శంకర్, సంజయ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నాగమల్ల సురేష్ సేవలు మరువలేనివి



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న నాగమల్ల సురేష్ ఫౌండేషన్ సభ్యులు

హసన్‌పర్తి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నాగమల్ల సురేష్ పేద ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని నాగమల్ల సురేష్ ఫౌండేషన్ ప్రతినిధి గొడిశాల రవిప్రసాద్ అన్నారు. గ్రేటర్ 66వ డివిజన్ కేంద్రం హసన్‌పర్తిలో నాగమల్ల సురేష్ 4వ వర్ధంతి సందర్భంగా శివరచన రోగులకు పండ్ల పంపిణీ చేశారు. అనంతరం భీమారం లార్డ్ అనాథ వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగమల్ల సురేష్ ఫౌండేషన్ ప్రతినిధిలు మేకల యుగేందర్, ఇమ్మడి అర్జున్, పుల్ల నరేష్, మేకల సిద్ధార్థ, ప్రమోద్, మేకల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో ఉద్యోగుల బాధ్యత కీలకం



రిటైర్డ్ ఉద్యోగి కుమారస్వామిని సన్మానిస్తున్న ఉద్యోగుల సహకార పరపతి సంఘం ప్రతినిధులు

హసన్‌పర్తి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో ఉద్యోగుల బాధ్యత అత్యంత కీలకమైనదని ఉద్యోగులు, సహకార పరపతి సంఘం మాజీ అధ్యక్షుడు శీలం యాదగిరి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఉద్యోగులు, ఇతరుల సహకార పరపతి సంఘం వార్షిక సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడిగా తంగెళ్లపల్లి కుమారస్వామి, కార్యదర్శిగా గూడూరు లక్ష్మీనారయణ, గౌరవ అధ్యక్షుడుగా కాజీపేట వెంకట్రాంనర్సయ్య, పి.సదానందం, కోశాధికారిగా పాపిశెట్టి వెంకటేషంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులు వేల్పుల ఓదేలు, గోపరాజు కుమారస్వామిలను శాలువాతో సత్కరించి వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు వై.విజయ, పి.సారంగం, కనకస్వామి, ఖాజా నయీమొద్దీన్, శీలం సారయ్య, గుండమీది రవీందర్, కందుకూరి శేషవేణి, కందుకూరి సంతోష్, పెద్దులు తదితరులు పాల్గొన్నారు.

బాలాజీనగర్ జంక్షన్‌లో జలధారలు

▸▸ టూరిస్ట్ స్పాట్‌గా మారిన సెంటర్



జంక్షన్‌లో ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటెన్

వరంగల్ సిటీ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏనుమాముల బాలాజీ నగర్ జంక్షన్‌లో ఇటీవల ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటెన్‌తో ఆ ప్రాంతానికి కళ వచ్చింది. రాత్రి వేళ్లలో కలర్ ఫుల్ లైటింగ్‌తో పాటు ఫౌంటేన్ నుంచి జలధారలు పడుతుండడంతో పిల్లలు, పెద్దలు చూసేందుకు తరలివస్తున్నారు. మొగిలిచర్ల, కాశిబుగ్గ, లేబర్ కాలనీ, ఏనుమాముల ప్రజలు సెల్ఫీలు దిగుతూ సందడి చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
సోమవారం
30 డిసెంబరు 2024

నిన్నటి ఘనతలు 2024
2025 రేపటి ఆశలు

ప్రముఖ అమెరికన్ పత్రిక 'ఫోర్బ్స్' ఏటా వ్యాపారం, వినోదం, రాజకీయాలు, దాతృత్వం వంటి విభిన్న రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా ఖ్యాతినార్జించిన వ్యక్తుల జాబితాలను విడుదల చేస్తూ ఉంటుంది. ఈ ఏడాది విడుదల చేసిన వందమంది అత్యంత శక్తిమంతులైన మహిళల జాబితాలో ముగ్గురు భారతీయ మహిళలు చోటు దక్కించుకున్నారు.



నిర్మలా సీతారామన్

ఈ జాబితాలో భారత ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రి నిర్మలా సీతారామన్ 28వ స్థానంలో నిలిచారు. ఆమె 2019 మేలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఎంతో క్లిష్టమైన ఆర్థిక శాఖను పూర్తిస్థాయిలో నిర్వహించిన మొదటి మహిళగా గుర్తింపు పొందారు. 2024 సార్వత్రిక ఎన్నికల తరవాత తిరిగి అదే శాఖకు నియమితురాలయ్యారు. ఆమె సారథ్యంలో భారత్ దాదాపు నాలుగు ట్రిలియన్ డాలర్లతో ప్రపంచంలోనే అయిదవ పెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిచింది. 2027 నాటికి దేశ జీడీపీ జర్మనీ, జపాన్‌లను దాటి... భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని ఆమె గర్వంగా చెబుతున్నారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం అక్షరాస్యత, వ్యవస్థాపకత కార్యక్రమాలు రూపొందించి విజయవంతంగా అమలు చేశారు. నిర్మలా సీతారామన్ రాజకీయాల్లోకి రాకముందు యూకెలోని అగ్రికల్చరల్ ఇంజనీర్స్ అసోసియేషన్, బీబీసీ వరల్డ్ సర్వీస్‌లలో కీలక పదవులు నిర్వహించారు. భారత జాతీయ మహిళా మిషన్ సభ్యురాలిగా కూడా పనిచేశారు.

హర్షనిశా పరేజన్



ఆరోగ్యంతోనే సాధికారత సాధ్యం... ఇది హర్షనిశా పరేజన్ నినాదం. ఆమె బెంగళూరు కేంద్రంగా 'టక్కీన్' అనే సంస్థను స్థాపించి... మహిళల రుతుక్రమ సమస్యలకు పరిష్కారాలను చూపడానికి కృషి చేస్తున్నారు. "మా కుటుంబంలో మొదటి గ్రాడ్యుయేట్‌ను నేనే. పేదరికం కారణంగా ఎదురయ్యే సవాళ్లను ప్రత్యక్షంగా చూశాను. చదువు పూర్తి చేసుకొని, ఆరోగ్య రంగంలోకి అడుగుపెట్టిన తరువాత... సమాజంలో అర్థవంతమైన మార్పును సృష్టించడానికి నా వంతు కృషి చేయాలని నిర్ణయించుకున్నాను. అందుకే 'టక్కీన్'ను ఏర్పాటు చేసి, సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా మారాను అంటున్నారు హర్షనిశా. "మహిళలు సాధికారత సాధించాలంటే.. ఆరోగ్యంగా ఉండాలి. ప్రత్యేకించి రుతుసంబంధమైన ఇబ్బందులు దీర్ఘకాలంలో ఆరోగ్యాన్ని దెబ్బతీయడమే కాదు... మహిళల పురోగతికి కూడా అవరోధాలు నిలుస్తాయి. అందుకే ఈ క్లిష్టమైన ఆరోగ్య సమస్యలకు స్థిరమైన పరిష్కారాలు సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నాను" అని చెబుతున్నారు. సైకాలజీలో మాస్టర్స్ డిగ్రీ చేసిన ఆమెకు నిధుల సేకరణ, విద్యా కార్యక్రమాల రూపకల్పన తదితరాల్లో అనుభవం ఉంది. పలు అంతర్జాతీయ సంస్థల్లో, పలు ఐక్య రాజ్య సమితి ప్రాజెక్టుల్లో పని చేశారు. ఆ తరువాత 'టక్కీన్'ను ఏర్పాటు చేసి... మహిళలకు, బాలికలకు నెలసరి ఆరోగ్యం, పరిశుభ్రత గురించి అవగాహన కల్పిస్తున్నారు. సురక్షితమైన పద్ధతులు పాటించేలా చేస్తున్నారు. ప్రతి ఒక్కరితోనూ స్వయంగా సంభాషించి వారి సమస్యలు తెలుసుకోవడానికి, వాటిని నివారించుకొనే మార్గాలు చూపడానికి ఈ సంస్థ ప్రాధాన్యత ఇస్తోంది. ఇప్పటివరకూ గ్రామీణ ప్రాంతాల్లో దాదాపు 5 వేల మందికి కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు... అట్టడుగు వర్గాలకు చెందిన సుమారు 2 వేల మందికి 'మెన్‌స్ట్రువల్ కప్స్' ఉచితంగా అందజేసింది. 2025ను తన ప్రయాణంలో ప్రతిష్ఠాత్మకమైన సంవత్సరంగా హర్షనిశా భావిస్తున్నారు. దేశవ్యాప్తంగా మెన్‌స్ట్రువల్ కప్స్ లాంటి దీర్ఘకాలికంగా వినియోగించగలిగే, చవకయిన, పర్యావరణ హితమైన ప్రత్యామ్నాయాల గురించి మరింత విస్తృతంగా ప్రచారం చెయ్యడం, అవసరమైనవారికి అందజేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. "నెలసరి గురించి ధైర్యంగా మాట్లాడే పరిస్థితి ఇప్పటికీ చాలా చోట్ల లేదు. ఈ పరిస్థితిలో మార్పు కోసమే నా ప్రయత్నం" అంటారు హర్షనిశా.

రెండు రోజుల్లో కొత్త సంవత్సరం వచ్చేస్తోంది. 2025 మీద తమ ముద్ర వేయడానికి సిద్ధమవుతున్న ఎందరో మహిళల్లో... ఒకరు నెలసరి సమయంలో మహిళల ఇబ్బందులను పరిష్కరించే సాధనాన్ని దేశమంతా విస్తరించే ప్రయత్నంలో ఉన్నారు. మరొకరు ఈ ఏడాది 'కేన్స్'లో పురస్కారం సాధించి... 'గోల్డెన్ గ్లోబ్' రేసులో ఉన్నారు. ఆ సంగతులివి..



రోష్నీ నాడార్ మల్హోత్రా

దేశంలోని ప్రముఖ ఐటీ సంస్థ హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ చైర్‌పర్సన్ రోష్నీ నాడార్ మల్హోత్రా ఈ ఏడాది ఫోర్బ్స్ జాబితాలో 81వ స్థానాన్ని దక్కించుకున్నారు. ఆమె హెచ్‌సీఎల్ కార్పొరేషన్ సీఈఓ కూడా! తండ్రి శివ్ నాడార్ స్థాపించిన 12 బిలియన్ డాలర్ల వ్యాపారాన్ని పర్యవేక్షిస్తూ, అంచెలంచెలుగా అభివృద్ధి చేసి... తనకు సాటిలేదనిపించుకున్నారు. ఎంఎస్ మల్హోత్రా- శివ్ నాడార్ ఫౌండేషన్ ధర్మకర్తగా కూడా వ్యవహరిస్తున్నారు. ట్రాన్స్‌ఫర్మేటివ్ ఎడ్యుకేషన్ ఆవశ్యకతను చాటిచెబుతూ ఎన్నో సంస్థలు స్థాపించారు. స్వదేశీ జాతుల పరిరక్షణకు 'ది హాబిటాట్స్ ట్రస్ట్'ను నెలకొల్పారు. కెల్లాగ్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ నుంచి ఎంబీఏ పూర్తిచేసిన రోష్నీ నాడార్‌కు జర్నలిజంలో కూడా ప్రవేశం ఉంది.



కిరణ్ మజుందార్ షా

బయోకాన్ బయోఫార్మాస్యూటికల్ కంపెనీ వ్యవస్థాపకురాలు కిరణ్ మజుందార్ షా 82వ స్థానంలో నిలిచారు. 1978లో ఆ సంస్థ స్థాపన నుంచి దాని అభివృద్ధి కోసం అలుపెరుగని కృషి చేస్తూ ఎన్నో విజయాలు సాధించారు, అంతర్జాతీయ మార్కెట్లో స్థానం సంపాదించారు. ఆసియాలోనే అతిపెద్ద ఇన్సులిన్ తయారీ కేంద్రాన్ని మలేసియాలో నిర్వహిస్తున్నారు. రెండేళ్ల క్రితం వయాట్రిస్ గ్లోబల్ హెల్త్ కంపెనీకి 3.3 బిలియన్ డాలర్లు చెల్లించి బయోసిమిలర్స్ వ్యాపారాన్ని సొంతం చేసుకున్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలోని బికారా థెరప్యూటిక్స్ విలువ నాస్డాక్‌లో 362 మిలియన్ డాలర్లకు చేరడం ఆమె సాధించిన ఘన విజయంగా చెప్పవచ్చు. క్యాన్సర్ పరిశోధనల కోసం గ్లాస్గో విశ్వవిద్యాలయానికి 7.5 మిలియన్ డాలర్లు విరాళంగా ఇచ్చారు. మొదట కిరణ్ వైద్యురాలిగా ప్రజలకు సేవ చేయాలనుకున్నారు. కానీ విభిన్నమార్గాన్ని ఎంచుకుని దేశం గర్వించదగ్గ వ్యవస్థాపకురాలిగా ఎదిగారు. ప్రస్తుతం బయోకాన్ సంస్థ కరోనా వైరస్ వేరియంట్ల కోసం యాంటీ బాడీ థెరపీ విధానాలపై పనిచేస్తోంది. ఫోర్బ్స్- భారతదేశంలోని అత్యంత సంపన్నుల జాబితా-2024లో కిరణ్ మజుందార్ షా 91వ స్థానంలో నిలిచారు.

పాయల్ కపాడియా



గోల్డెన్ గ్లోబ్... సినీ, టెలివిజన్ రంగాలకు ఇచ్చే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఈ అంతర్జాతీయ పురస్కారం కోసం ప్రపంచవ్యాప్తంగా ఎందరో కలలుకంటారు. 1943లో ప్రారంభమైన ఈ అవార్డులకు భారతదేశం నుంచి గతంలో ఏడుసార్లు నామినేషన్స్ ఆమోదం పొందగా, నాలుగు పురస్కారాలు లభించాయి. అయితే ఈ అవార్డు గ్రహీతలైన భారతీయుల్లో మహిళలు ఎవరూ లేరు. మీరానాయర్ రెండుసార్లు నామినేట్ అయినా... పురస్కారం అందుకోలేకపోయారు. 2025లో... పాయల్ కపాడియా 'ఆల్ వియ్ ఇమాజిన్ యాజ్ లైట్' చిత్రం ఆ లోటు తీరుస్తుందని సినీ అభిమానులు ఆశిస్తున్నారు. ఈ ఏడాది 'కేన్స్ చలనచిత్రోత్సవం'లో... రెండవ అతి పెద్ద అవార్డ్ 'గ్రాండ్ ప్రిక్స్'ను పాయల్ అందుకున్నారు. చిత్రకారిణి అయిన తల్లి నళినీ మాలిని ప్రోత్సాహంతో కళలపై అభిమానం పెంచుకున్న పాయల్ విద్యాభ్యాసం ఆంధ్రప్రదేశ్‌లోని మదనపల్లెలో ఉన్న రుషీ వ్యాలీ స్కూల్‌లో సాగింది. ఆ తరువాత 'పుణే ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా' (ఎఫ్‌టిఐఐ)లో ఫిల్మ్ డైరెక్షన్ కోర్సు చేశారు. ప్రకటనలు, వీడియో చిత్రాలను రూపొందించారు. బిజెపి నాయకుడైన నటుడు గజేంద్ర చౌహాన్‌ను ఎఫ్‌టిఐఐకి ఛైర్మన్‌గా నియమించడాన్ని నిరసిస్తూ విద్యార్థులు చేపట్టిన 139 రోజుల సుదీర్ఘ సమ్మెకు నాయకత్వం వహించినవారిలో ఆమె ఒకరు. దీంతో ఒక వర్గం ఆమెను 'దేశద్రోహి'గా ముద్ర వేసింది. ఎఫ్‌టిఐఐ కేసు కూడా పెట్టింది. ఇలాంటి అవరోధాలు ఎదుర్కొంటూనే 'ది లాస్ట్ మ్యాంగో బిఫోర్ మాన్‌సూన్' చిత్రం తీశారు. అది 'ఒబెర్హాసెన్ అంతర్జాతీయ చలన చిత్రోత్సవం'లో ప్రత్యేక జ్యూరీ పురస్కారం సాధించింది. తరువాత తీసిన 'ఆఫ్టర్‌నూన్ క్లౌడ్స్' లఘు చిత్రం 'కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్'కు భారతదేశం నుంచి అధికారిక ఎంట్రీగా ఎంపికైంది. అలాగే మరో చిత్రం '...అండ్ వాట్ ఈజ్ ది సమ్మర్ సేయింగ్' కూడా అనేక అంతర్జాతీయచలన చిత్రోత్సవాల్లో ప్రదర్శితమైంది. ఆమె కొత్త చిత్రం 'ఆల్ వియ్ ఇమాజిన్ యాజ్ లైట్' ఈ ఏడాది 'కేన్స్'లో మెరిసింది. వచ్చే ఏడాది 'గోల్డెన్ గ్లోబ్'ను లక్ష్యంగా చేసుకుంది. అది ముంబాయిలోని ఒక నర్సింగ్ హోమ్‌లో పని చేస్తున్న ఇద్దరు నర్సుల కథ. వారిద్దరూ చేపట్టిన ఒక ప్రయాణంతో వారి జీవితాలు ఎలాంటి మలుపులు తిరిగాయో పాయల్ ఆసక్తికరంగా మలిచారు. 82వ 'గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్' కోసం బెస్ట్ డైరెక్టర్, ఉత్తమ విదేశీ చిత్రం కేటగిరీల్లో రెండు నామినేషన్లు ఈ చిత్రానికి లభించాయి. 2025 జనవరి మొదటివారంలో పురస్కార వేడుక జరుగుతుంది. 'గోల్డెన్ గ్లోబ్' సాధించిన తొలి భారతీయ మహిళగా పాయల్ చరిత్ర సృష్టిస్తారా? తెలుసుకోవాలంటే కొన్నాళ్ళు ఆగాల్సిందే...

వీరిది విజయ పథం

కొందరి విజయాలు లక్షల మందిలో స్ఫూర్తిని నింపుతాయి. సామాన్య కుటుంబాల నుంచి వచ్చినా పట్టుదల ఉంటే సాధించలేనిదేమి లేదనే ఆశను రేకెత్తిస్తాయి. 2024లో ఈ విధంగా కొన్ని లక్షల మందిలో స్ఫూర్తిని నింపిన మహిళలెవ్వరో ఒక్కసారి చూద్దాం..

శీతల్‌దేవి



వైకల్యం శరీరానికే కానీ మెదడుకు కాదని నిరూపించిన వ్యక్తి శీతల్‌దేవి. చేతులు లేని విలువిద్యా క్రీడాకారిణి. 2024 సమ్మర్ పారా ఒలింపిక్‌లో ప్రపంచ రికార్డు నెలకొల్పడమే కాకుండా కాంస్య పతకం కూడా గెలుచుకుంది. అతి సామాన్య కుటుంబానికి చెందిన శీతల్‌దేవి- భారతీయ సైన్యం నిర్వహించిన ఒక కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు- ఆమెలో ఏదో ఒకటి సాధించాలనే తపన మొదలైంది. అనేక కష్టనష్టాలకు ఎదురొడ్డి ప్రపంచ రికార్డు సాధించేలా చేసింది. దివ్యాంగులకే కాకుండా కోట్లాది మంది యువతకు స్ఫూర్తిగా నిలిచింది.

మనూ బాకర్

ఇంటిపక్క అమాయకంగా కనిపించే అమ్మాయిలా ఉండే మనూ బాకర్ ఈ ఏడాది పారిస్ ఒలింపిక్స్‌లో మూడు మెడల్స్ సాధించింది. ఒలింపిక్స్‌లో ఒకే తరహా గేమ్‌లో ఎక్కువ మెడల్స్ సాధించిన క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించింది. ఒకప్పుడు మహిళా క్రీడాకారిణిలు అథ్లెట్స్, బాక్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్ మొదలైన క్రీడల్లో మాత్రమే రాణించేవారు. మనూ బాకర్ ఇతర క్రీడల్లో కూడా మన వాళ్లు రాణించగలరని నిరూపించింది.



మోహనా సింగ్ జితర్‌వాల్



శత్రువులతో యుద్ధాలు కేవలం పురుషులకు మాత్రమే అనేది ఒకప్పటి మాట! ప్రస్తుతం భారతీయ సైనిక దళాలలో మహిళలు కూడా చురుకైన పాత్ర పోషిస్తున్నారు. మన భారతీయ సరిహద్దుల్లోని ఇతరులు చొచ్చుకురాకుండా కాపలాకాసే 'ఫ్లైయింగ్ బులెట్స్'లో చేరిన తొలి ఫైటర్ పైలట్‌గా మోహనా సింగ్ ఈ ఏడాది చరిత్ర సృష్టించింది. ఒకప్పుడు వైమానిక దళంలో ఫైటర్ పైలెట్స్ ఉండేవారు కారు! కేవలం పురుషులకు మాత్రమే ఆ అవకాశం లభించేది. 2016లో మోహనా సింగ్ తొలిసారి మహిళా ఫైటర్ పైలెట్ అయింది. ఆ తర్వాత ఆమె ఎప్పుడూ వెనక్కి తిరిగి చూడలేదు.



రేచల్ గుప్తా

అందంతో పాటుగా సమాజానికి ఏదో చేయాలనే తపన ఉన్నవారు అతి తక్కువ ఉంటారు. అలాంటి వారిలో ఒకరు రేచల్ గుప్తా. ఈ ఏడాది మిస్ గ్రాండ్ ఇంటర్నేషనల్‌ను గెలుచుకొంది. ఈ పోటీ ఫైనల్స్‌లోని ప్రశ్నలకు రేచల్ ఇచ్చిన సమాధానాలు అనేక మందిని ఆకట్టుకున్నాయి. మోడలింగ్‌తో పాటుగా ఒక స్వచ్ఛంద సంస్థను నడుపుతున్న రేచల్ అనేక సామాజిక కార్యక్రమాల్లో కూడా పాల్గొంటోంది.

దివ్యా దేశ్‌ముఖ్

చెస్‌లో మన దేశానికి ప్రత్యేక స్థానముంది. దీనిని ఈ ఏడాది మరో ఎత్తుకు తీసుకువెళ్లిన వారిలో దివ్యా దేశ్‌ముఖ్ ఒకరు. ఈ ఏడాది అండర్ 20 మహిళా ప్రపంచ చాంపియన్‌షిప్‌ను గెలుచుకొంది. 2025లో దివ్య మరిన్ని ఛాంపియన్‌షిప్‌లు గెలుస్తుందని చెస్ అభిమానులు ఎదురుచూస్తున్నారు.





సాధ్నా సక్సేనా నాయర్

సైనిక దళాలలో డైరక్టర్ జనరల్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ (ఆర్మీ)కి ఒక ప్రత్యేక స్థానం ఉంటుంది. ఈ ఏడాది ఈ స్థానానికి సాధ్నా సక్సేనా నాయర్ చేరుకొని చరిత్ర సృష్టించారు. సైనిక దళాల చరిత్రలో ఈ స్థానాన్ని చేరుకొన్న తొలి మహిళా అధికారి సాధ్నా కావటం ఒక విశేషం.

ముత్యాల ముగ్గు

మాకు పంపండి

మీరు ముగ్గులు బాగా వేస్తారా? అయితే చక్కటి చుక్కల ముగ్గులను కాగితంపై గీసి, రంగులు వేసి మాకు పంపండి! ఎన్ని చుక్కలు, ఎన్ని వరసలు లాంటి వివరాలను కూడా రాయండి. మీ పేరు, మీ పూర్తి అడ్రస్సు, పాస్ పోర్టు సైజు ఫొటో పంపడం తప్పనిసరి.

మా చిరునామా...
నవ్య, ముత్యాలముగ్గు,
ఆంధ్రజ్యోతి కార్యాలయం, రోడ్ నెంబర్ 70,
హుడా హైట్స్, జూబ్లీ హిల్స్,
హైదరాబాద్-500033.

ఈ-మెయిల్:
features@andhrajyothy.com

23 చుక్కలు వరుస వచ్చేవరకు ఎదురెదురు





పి. జ్యోతి,
పలాస,
శ్రీకాకుళం, ఆంధ్రప్రదేశ్



సైనిక పాఠశాలల్లో ప్రవేశాలు

త్రివిధ దళాలకు అవసరమైన అధికారులను పాఠశాల స్థాయి నుంచే సిద్ధం చేసేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వం 33 సైనిక పాఠశాలలు ఏర్పాటు చేసింది. ఇక్కడ విద్యార్థులకు సీబీఎస్‌ఈ విద్యతోపాటు, క్రమశిక్షణ, భౌతిక నైపుణ్యాలు పెరిగేలా శిక్షణ ఇస్తారు. ఈ పాఠశాలల్లో 2025-26 సంవత్సరానికి సంబంధించిన ఆరు, తొమ్మిది తరగతుల ప్రవేశాల నోటిఫికేషన్(ఆల్ ఇండియా సైనిక్ స్కూల్స్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్-2025) వెలువడింది. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు నేషనల్ డిఫెన్స్ అకాడమీ, ఇండియన్ నేవీ అకాడమీ, ఇతర అకాడమీల్లో చేరడానికి సిద్ధం అవుతారు. 'ఏఐఎస్ఎస్ఈఈ' దరఖాస్తులను ఆన్‌లైన్‌లోనే దాఖలు చేయాల్సి ఉంటుంది.

చివరి తేదీ 2025 జనవరి 13.

6వ తరగతి: 10 నుంచి 12 సంవత్సరాల మధ్య వయస్సు (2013 ఏప్రిల్ 1 నుంచి 2015 మార్చి 31లోపు జన్మించి) ఉండాలి.

9వ తరగతి: 13 నుంచి 15 సంవత్సరాల మధ్య వయస్సు (2010 ఏప్రిల్ 1 నుంచి 2012 మార్చి 31లోపు జన్మించి) ఉండాలి.

పరీక్షా విధానం: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ద్వారా నిర్వహించే ఈ పరీక్ష పూర్తిగా రాత విధానంలో ఉంటుంది. ఆరో తరగతి పరీక్ష అన్ని ప్రాంతీయ భాషల్లో ఉంటుంది. దీనిని రెండున్నర గంటల్లో రాయాలి. తొమ్మిదో తరగతి పరీక్ష ఇంగ్లీషులో మాత్రమే నిర్వహిస్తారు. దీనిని విద్యార్థులు మూడు గంటల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది.

దరఖాస్తు విధానం: https://aissee.nta.nic.in/ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. కుల, నివాస, జనన ధ్రువీకరణ సర్టిఫికెట్లతోపాటు పాస్‌పోర్ట్ ఫోటో అవసరం అవుతాయి. జనరల్, ఓబీసీ, డిఫెన్స్ కేటగిరీ వారికి రూ.800/- ఫీజు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 650/- ఫీజు ఉంటుంది.

సైనిక్ స్కూల్స్: తెలుగు రాష్ట్రాల విద్యార్థుల కోసం రెండు సైనిక పాఠశాలలు ఉన్నాయి. ఒకటి విజయనగరం జిల్లాలోని కోరుకొండ, చిత్తూరు జిల్లాలోని కలికిరి. దీనిలో 65 స్థానిక విద్యార్థులకు, మిగిలిన 35 శాతం జాతీయ కోటాలోకి వెళుతుంది. అంటే తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఇక్కడి స్కూల్స్‌తోపాటు జాతీయ కోటా 35 శాతం(అంటే దాదాపు 400 సీట్ల)కి కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

కౌన్సెలింగ్ ప్రాసెస్: ప్రవేశ పరీక్ష పూర్తయిన 45 రోజుల లోపు స్కోర్ కార్డు ఇంటికి వస్తుంది. ఇందులో అర్హత పొందిన విద్యార్థులు కౌన్సెలింగ్‌లో పాల్గొనవచ్చు. ఇది దాదాపు 8 రౌండ్లుగా ఉంటుంది.

కలికిరి స్కూల్ - మొత్తం సీట్లు 105

స్థానిక కోటా	బాలురు	బాలికలు
ఎస్సీ	10	1
ఎస్టీ	04	1
ఓబీసీ	18	1
డిఫెన్స్	08	1
జనరల్	26	1

(మిగిలిన సీట్లు జాతీయ కోటా కిందకు వెళతాయి)

కోరుకొండ స్కూల్ - మొత్తం సీట్లు 93

స్థానిక కోటా	బాలురు	బాలికలు
ఎస్సీ	08	1
ఎస్టీ	04	1
ఓబీసీ	16	1
డిఫెన్స్	07	1
జనరల్	22	1

(మిగిలిన సీట్లు జాతీయ కోటా కిందకు వెళతాయి)

ప్రిపరేషన్: ఆరో తరగతి: ప్రధానంగా ఐదో తరగతి ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలు చదవాలి. మొత్తం మార్కులు 200(మేథ్స్: 50, జనరల్ నాలెడ్జ్: 50, ఇంగ్లిష్: 50, జనరల్ ఇంటెలిజెన్స్: 50)

తొమ్మిదో తరగతి: మొత్తం మార్కులు 400(మేథ్స్: 200, సైన్స్: 50, ఇంగ్లిష్: 50, ఇంటెలిజెన్స్: 50, సోషల్: 50) (ప్రతీ సబ్జెక్టులో కనీసం 25 శాతం మార్కులు రావాలి. టోటల్‌గా కనీసం 40 శాతం మార్కులు రావాలి)

తెలుగు రాష్ట్రాల్లోని పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, కరీంనగర్, అనంతపురం, గుంటూరు, కడప, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, రాజమహేంద్రవరం, శ్రీకాకుళం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరంల్లో పరీక్ష కేంద్రాలు ఉన్నాయి.

- ఎస్.కళ్యాణి
ప్రిన్స్‌పాల్, కాంత్రి కీన్ అకాడమి, హైదరాబాద్

నాల్కోలో టెన్త్, ఐటీఐ వారికి ఉద్యోగాలు

ప్రభుత్వ రంగ సంస్థ 'నేషనల్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్(నాల్కో)' నుంచి 518 నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల కోసం నోటిఫికేషన్ వెలువడింది. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, మెడికల్ టెస్ట్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేసి జూనియర్ ఆపరేటివ్ ట్రైనీలుగా నియమిస్తారు.

లాబొరేటరీ: 37 పోస్టులు- కెమిస్ట్రీ సబ్జెక్టుగా బీఎస్సీ ఆనర్స్ చదివి ఉండాలి.

ఆపరేటర్: 226 పోస్టులు. టెన్త్, ఐటీఐ చేసి ఎలక్ట్రానిక్స్, మెకానిక్స్, టెక్నీషియన్ మెకట్రానిక్స్, ఎలక్ట్రీషియన్, ఇన్‌స్ట్రుమెంటేషన్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, ఫిట్టర్ ట్రేడ్‌లలో ఏదో ఒకటి చేసి ఉండాలి.

ఫిట్టర్: 72 పోస్టులు-టెన్త్, ఫిట్టర్ ట్రేడ్‌లో ఐటీఐ అప్రెంటిస్‌షిప్ చేసి ఉండాలి.

ఎలక్ట్రికల్: 63 పోస్టులు-టెన్త్, ఐటీఐ ఎలక్ట్రీషియన్ ట్రేడ్ సర్టిఫికెట్ ఉండాలి

ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్: 48 పోస్టులు- టెన్త్, మెకానిక్ ట్రేడ్‌లో రెండు సంవత్సరాల ఐటీఐ అప్రెంటిస్‌షిప్ సర్టిఫికెట్ ఉండాలి.

మైనింగ్ మేట్: 15 పోస్టులు - టెన్త్, మైనింగ్ మేట్ సర్టిఫికెట్

మోటార్ మెకానిక్: 22 పోస్టులు-టెన్త్, మోటార్ మెకానిక్ ట్రేడ్‌లో రెండు సంవత్సరాల ఐటీఐ అప్రెంటిస్‌షిప్ సర్టిఫికెట్.

నర్స్(గ్రేడ్-3): 7 పోస్టులు- ఇంటర్‌తోపాటు, మూడు సంవత్సరాల జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ ట్రైనింగ్ ఉండాలి. లేదా డిప్లొమా/బీఎస్సీ నర్సింగ్, ఒక సంవత్సరం అనుభవం ఉండాలి.

ఫార్మసిస్ట్: 6 పోస్టులు- సైన్స్ సబ్జెక్టుతో ఇంటర్, ఫార్మసీ డిప్లొమా ఉండాలి. కనీసం రెండు సంవత్సరాల అనుభవం ఉంటే ప్రాధాన్యం.

లాబొరేటరీ, ఫస్ట్‌ఎయిడ్ తదితరాలకు దరఖాస్తు చేసుకోవాలనుకునే వారి వయసు 35 సంవత్సరాలు నిండి ఉండరాదు. మైనింగ్‌కు 28, ఇతర పోస్టులకు 27 సంవత్సరాలు దాటరాదు. అభ్యర్థులు ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్‌లో రిజిస్టర్ చేసుకొని ఉండాలి. 2024 డిసెంబరు 31 నుంచి 2025 జనవరి 21 తేదీలోపు దరఖాస్తులు స్వీకరిస్తారు. పూర్తి వివరాలకు https://nalco-india.com/ వెబ్‌సైట్ చూడొచ్చు.

దిక్సూచి DIKSUCHI



ఎస్‌బీఐలో పీఓలు 600

దేశంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు అయిన స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా 600 ప్రొబేషనరీ ఆఫీసర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసింది. 2025 జనవరి 16 తేదీ వరకు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో దాఖలు చేసుకోవాలి. అభ్యర్థులను ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేస్తారు. బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసిన వారు ఈ పోస్టులకు అర్హులు. డిగ్రీ చివరి సంవత్సరం పరీక్షలు రాసిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

పోస్టుల వివరాలు: ప్రొబేషనరీ ఆఫీసర్ 600 పోస్టులు (ఎస్సీ-87, ఎస్టీ-57, ఓబీసీ-158,ఈ డబ్ల్యూఎస్-58, యూఆర్-240)

అర్హతలు: ఏదైనా సబ్జెక్టులతో బ్యాచిలర్ డిగ్రీ, ఫైనల్ ఇయర్ పరీక్షలు రాసిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

వయస్సు: 21 నుంచి 30 సంవత్సరాల మధ్యలో ఉండాలి(2024 ఏప్రిల్ 1 నాటికి) (1994 ఏప్రిల్ 2 - 2003 ఏప్రిల్ 1 మధ్యలో జన్మించి ఉండాలి). వివిధ వర్గాల వారికి కేటగిరీలను అనుసరించి వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

ఫీజు: రూ.750/- (ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు చెల్లింపులో కొంత మినహాయింపు ఉంది)

చివరి తేదీ: 2025 జనవరి 16

ప్రిలిమినరీ పరీక్ష: మార్చి 8, 15న నిర్వహిస్తారు.

ఎంపిక విధానం

ప్రిలిమినరీ: వంద మార్కులకు వంద ప్రశ్నలుంటాయి. ఒక గంట సమయంలో పూర్తి చేయాలి. ఇందులో మూడు సెక్షన్లు ఉంటాయి. ఇంగ్లీషు 40 ప్రశ్నలు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 30 ప్రశ్నలు, రీజనింగ్ ఎబిలిటీ 30 ప్రశ్నలు

మెయిన్స్: మొత్తం 200 మార్కులకు 170 ప్రశ్నలు ఉంటాయి. మూడు గంటల్లో పూర్తి చేయాలి. రీజనింగ్ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్(40 ప్రశ్నలు-60 మార్కులు), డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రెటేషన్(30 ప్రశ్నలు-60 మార్కులు), జనరల్ అవేర్‌నెస్/ఎకానమీ/ బ్యాంకింగ్ నాలెడ్జ్(60 ప్రశ్నలు, 60 మార్కులు), ఇంగ్లీష్ లాంగ్వేజ్ (40 ప్రశ్నలు, 20 మార్కులు). డిస్క్రిప్టివ్ పేపర్ 50 మార్కులకు ఉంటుంది. దీనిని 30 నిమిషాల్లో పూర్తి చేయాలి.

ప్రిలిమినరీ పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, చిత్తూరు, ఏలూరు, గుంటూరు, విజయవాడ, కడప, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, రాజమండ్రి, శ్రీకాకుళం, తిరుపతి, విశాఖపట్నం, విజయనగరం.

వివరాలకు bank.sbi/web/careers/current-openings వెబ్‌సైట్‌లో చూడొచ్చు.

Dr. A.P.J.Abdul Kalam Young Research Fellowship



Description: Dr. A. P. J. Abdul Kalam Young Research Fellowship 2024 is an opportunity provided by the Technology, Education, Research and Rehabilitation for the Environment (TERRE) Policy Center to students pursuing or have completed undergraduate, postgraduate or Ph.D. degree in any field related to environmental research.

Eligibility: Applicants must be Indian citizens pursuing or having completed an undergraduate or postgraduate degree (M.Sc., M.E., M.A.) or Ph.D. degree in any field related to environmental research. They must be between the age group of 18 and 25 years old as of December 31st, 2024, and demonstrate outstanding research contributions made in India towards environmental protection or improvement.

Prizes & Rewards: A fellowship of up to 25,000 and a certificate

Last Date to Apply: 15-02-2025

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/APJF1

Deakin India Postgraduate Bursary

Description: The Deakin India 20% Postgraduate Bursary 2024 is an opportunity provided by Deakin University, Australia to Indian graduates. This bursary aims to financially assist deserving students with their university fees and all study costs.

Eligibility: Open for Indian citizens with a valid Indian passport and residing in India at the time of application. They must also apply through a Deakin Authorised Agent based in India and have an overall score of 55% – 74.99% in their undergraduate degree.

Prizes & Rewards: A 20% reduction in tuition fees

Last Date to Apply: 31-01-2025

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/DIPB4

SCHOLARSHIP ALERT

Kotak Suraksha

Description: Kotak Securities Limited (KSL) invites applications from students pursuing general/professional graduation.

Eligibility: Open to PwD applicants across India who are currently pursuing general or professional graduation courses. Applicants must have secured at least 55% marks in their previous academic year, and their annual family income must not exceed INR 3,20,000.

Prizes & Rewards: Scholarship up to INR 1,00,000 per year

Last Date to Apply: 23-01-2025

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/KSSP3

buddy4study.com

చిత్రజ్యోతి
SINCE 1965

ఇక దబిడి దిబిడే



నందమూరి బాలకృష్ణ హీరోగా బాబీ కొల్లి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'డాకు మహారాజ్'. నాగవంశీ, సాయి సౌజన్య నిర్మాతలు. ఈ చిత్రంలోని స్పెషల్ సాంగ్‌లో బాలకృష్ణతో కలసి స్టెప్పులేశారు బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలా. ఈ పాట ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు మేకర్స్. 'అమెరికాలో జనవరి 4న, ఇండియాలో జనవరి 5న 'డాకు మహారాజ్' సినిమాలోని మూడో పాటను విడుదల చేయనున్నాం. ఇక దబిడి దిబిడే' అంటూ చిత్ర బృందం సోషల్ మీడియాలో పేర్కొంది.

యాక్షన్ హంగామా



సల్మాన్ ఖాన్ కథానాయకుడిగా తమిళ దర్శకుడు ఏ.ఆర్. మురుగదాస్ తెరకెక్కిస్తున్న యాక్షన్ ఎంటర్టైనర్ 'సికందర్'. రష్మిక మందన్న కథానాయిక. సాజిద్ నడియడ్‌వాలా నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ఇందులో సల్మాన్ లుక్, సంభాషణలు, యాక్షన్ హంగామాతో పాటు విజువల్స్ ఆకట్టుకున్నాయి. ఈ టీజర్ చూసిన అభిమానులు.. ఈ సారి సల్మాన్‌కు హిట్ పక్కా అని ఆనందపడుతున్నారు. వచ్చే ఏడాది రంజాన్ కానుకగా చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. అయితే, ఈ టీజర్ సల్మాన్ పుట్టినరోజున విడుదల కావాల్సి ఉండగా.. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి సంతాపం తెలుపుతూ ఒక రోజు వాయిదా వేశారు. కాగా, ఇటీవలే విడుదలైన 'బేబీ జాన్', 'సింగమ్ అగైన్' చిత్రాల్లో అతిథి పాత్రల్లో కనిపించిన సల్మాన్ అభిమానులను అలరించారు.

జనవరి 1న ట్రైలర్



దిల్ రాజు

హీరో రామ్‌చరణ్ 256 అడుగుల భారీ కటౌట్ ఏర్పాటుచేసి మెగా అభిమానులు వరల్డ్ రికార్డు సాధించారని నిర్మాత దిల్ రాజు కొనియాడారు. విజయవాడలోని వజ్రా గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన ఈ కటౌట్‌కు ఆదివారం హెలికాప్టర్ ద్వారా పూలాభిషేకం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన దిల్ రాజు మాట్లాడుతూ సినీ రాజధాని, తెలుగు సినిమా పుట్టినిల్లుగా పేరొందిన విజయవాడలో ఈ ఈవెంట్ నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. జనవరి 1న గేమ్‌ఛేంజర్ ట్రైలర్ విడుదల చేస్తున్నామని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇచ్చే సమయాన్ని బట్టి జనవరి 4, 5 తేదీల్లో ఈ వేడుకను ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఈ కటౌట్‌ను ఏర్పాటు చేసినందుకు గాను ఇంటర్నేషనల్ వండర్ బుక్ రికార్డ్స్‌ను ఆ సంస్థ ప్రతినిధులు దిల్ రాజుకు అందజేశారు.

విజయవాడ (లబ్బీపేట),(ఆంధ్రజ్యోతి)

మలయాళ సినిమాకు రూ.700 కోట్ల నష్టం

ప్రతీ ఏడాది విభిన్న తరహా చిత్రాలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది మలయాళ చిత్ర పరిశ్రమ. కానీ ఈ ఏడాది మలయాళ చిత్ర పరిశ్రమ తీవ్రంగా నష్టపోయినట్లు కేరళ చిత్ర నిర్మాతల సంఘం ఓ ప్రకటనను విడుదల చేసింది. ఈ ఏడాది రూ. 1000 కోట్లు పెట్టి 199 సినిమాలు నిర్మించగా.. కేవలం 26 చిత్రాలు మాత్రమే విజయతీరాలకు చేరాయని తెలిపింది.

పారితోషికమే పెద్ద సమస్య

"సినిమాల బడ్జెట్ అదుపులో ఉంటే ఉండాలి. తక్కువ బడ్జెట్‌తో సినిమాలు తీయాలి. ఈ ఏడాది విడుదలైన చిత్రాల్లో ఎక్కువగా ఫ్లాప్ అయ్యినందున ప్రొడక్షన్ ఖర్చుల్లో కోత విధించాలి. నటీనటుల పారితోషికం ఒక పెద్ద సమస్యగా మారింది. నటులు తమ పారితోషికాన్ని తగ్గించుకోవడానికి సిద్ధపడాలి. ఈ విషయాన్ని పలుసార్లు నటీనటులతో ప్రస్తావించాం. కానీ వారు తగ్గించుకోకపోగా మరింతగా పారితోషికాన్ని పెంచుకుంటున్నారు. నటులు తమ పారితోషికాన్ని తగ్గించుకోకుంటే తీవ్ర సంక్షోభం తప్పదు. పక్క రాష్ట్రాల్లో తగిన మార్కెట్ లేకుండా ఏడాదికి దాదాపు 200 చిత్రాలు నిర్మించడం దీర్ఘకాలంలో పరిశ్రమ మనుగడకు చేటు చేస్తుంది. ఈ ఏడాది విడుదలైన చిత్రాల్లో స్టార్ హీరోలు నటించిన వాటికంటే మోస్తరు బడ్జెట్‌తో నిర్మించినవే హిట్ అవ్వడాన్ని మేకర్స్ గమనించాలి. అందుకు తగ్గట్లు సినిమాల నిర్మాణంలో మార్పులు చేసుకోవాలి. థియేటర్లకు ప్రజలని రప్పించే సినిమాలపై దృష్టి పెట్టాలి. ఈ ఏడాది మొత్తం 199 చిత్రాలు విడుదలయ్యాయి. అందులో కేవలం 26 చిత్రాలు విజయవంతం అయ్యాయి. రూ.1000 కోట్ల పెట్టుబడి పెడితే కేవలం రూ.300 కోట్లు మాత్రమే తిరిగి పొందగలిగాము. రూ.700 కోట్ల నష్టం వచ్చింది" అని రిపోర్ట్‌లో కేరళ చిత్ర నిర్మాతల సంఘం పేర్కొంది.


చక్కని ఆదరణ లభిస్తోంది



శివ రెడ్డి హీరోగా ప్రతాప్ భీమవరపు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఓ తండ్రి తీర్పు'. లయన్ శ్రీరాం దత్తి నిర్మించారు. రీసెంట్‌గా విడుదలైన ఈ చిత్రం మంచి టాక్ సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సక్సెస్ మీట్‌లో డాక్టర్ కె.వి.రమణాచారి మాట్లాడుతూ 'కుటుంబ విలువలతో 'ఓ తండ్రి తీర్పు' చిత్రాన్ని నిర్మించారు. ఆస్తులపై ఉన్న ప్రేమ తల్లిదండ్రులపై లేకపోవడం ఎంతో మానసిక క్షోభకు గురిచేస్తుంది అనే ఇతివృత్తంతో తీసిన ఈ చిత్రానికి చక్కని ఆదరణ లభిస్తోంది. మంచి సినిమాను ప్రేక్షకులు ఆదరిస్తారని మరోసారి రుజువు అయ్యింది. చక్కటి సందేశం ఉన్న ఈ సినిమాను ప్రతి కుటుంబం చూడాలని కోరుతున్నా' అని అన్నారు.


మార్చిలో సెట్స్‌పైకి షారుక్ చిత్రం

షారుక్ ఖాన్ సుజయ్ ఘోష్ దర్శకత్వంలో రూపొందనున్న చిత్రం 'కింగ్'. రెడ్ చిల్లీస్ సంస్థ నిర్మించనున్న ఈ సినిమాలో అభిషేక్ బచ్చన్ నెగిటివ్ షేడ్స్ ఉన్న రోల్‌లో నటించనున్నట్లు సమాచారం. ఈ చిత్రం షూటింగ్ వచ్చే ఏడాది మార్చిలో ప్రారంభం కానుంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు



జరుగుతున్నాయి. ఇందులోని యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ కోసం అంతర్జాతీయ స్టంట్ డైరెక్టర్లు పనిచేయనున్నట్లు బాలీవుడ్ వర్గాలు పేర్కొంటున్నాయి. యాక్షన్ నేపథ్యంలో తెరకెక్కనున్న ఈ చిత్రంలో షారుక్ కుమార్తె సుహానా ఖాన్ కూడా నటించనున్నట్లు సమాచారం. ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో అధికారికంగా ప్రకటించడానికి చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది.

రొమాంటిక్ ఎంటర్‌టైనర్




కిరణ్ అబ్బవరం నటించిన కొత్త సినిమా 'దిల్ రూబా'. రుక్సర్ ధిల్లాన్ హీరోయిన్. విశ్వకరుణ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రానికి రవి, జోజో జోస్, రాకేశ్ రెడ్డి, సారెగమ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో రిలీజ్‌కు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా సినిమా టీజర్ రిలీజ్ డేట్ అనౌన్స్ చేశారు మేకర్స్. జనవరి 3న టీజర్‌ను విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. 'ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుంది. లవ్, రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల్ని ఆకట్టుకోనుంది. 'క' సూపర్ హిట్ తరువాత కిరణ్ అబ్బవరం చేస్తున్న చిత్రంగా 'దిల్ రూబా'పై భారీ అంచనాలు ఏర్పడుతున్నాయి' అని చిత్ర బృందం పేర్కొంది.



ప్రియాంక రీ ఎంట్రీ

బాలీవుడ్ ముద్దుగుమ్మ ప్రియాంక చోప్రా తిరిగి భారతీయ చిత్రాల్లో నటించనున్నారా? అంటే అవుననే అంటోంది బాలీవుడ్ మీడియా. ఎనిమిదేళ్ల క్రితం హాలీవుడ్‌కి వెళ్లిన ప్రియాంక 'సిటాడెల్', 'ద మ్యాట్రిక్స్ రిసరెక్షన్స్' వంటి వెబ్‌సిరీస్, సినిమాలతో పాపులర్ అయ్యారు. కాగా, బాలీవుడ్ డైరెక్టర్ ఫర్హాన్ అక్తర్ తెరకెక్కించనున్న 'జీ లే జరా' చిత్రంలో ప్రియాంక నటించనున్నారనే వార్తలు వెలువడ్డాయి. అయితే ఈ వార్తలను ప్రియాంక గానీ, నిర్మాణ సంస్థ గానీ ధ్రువీకరించలేదు. దాంతో ఆమె రీ ఎంట్రీ ఇచ్చే సినిమా ఏమిటనేది ఆసక్తికరంగా మారింది. ఈ క్రమంలో మరో వార్త బాలీవుడ్ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. మహేశ్ బాబు హీరోగా ప్రముఖ దర్శకుడు రాజమౌళి తెరకెక్కించే ఎస్ఎస్ఎమ్‌బీ29 సినిమాలో ప్రియాంక ఛాన్స్ కొట్టేశారనే వార్తలు బాలీవుడ్ మీడియాలో వెలువడుతున్నాయి. దీంతో భారతీయ చిత్రాల్లోకి ప్రియాంక చోప్రా ఎంట్రీ ఇచ్చే మూవీ ఇదేనని ఆమె అభిమానులు చర్చించుకుంటున్నారు.



మరోసారి నువ్వే కావాలయ్యా

రజనీకాంత్ హీరోగా నటించిన 'జైలర్' చిత్రంలో 'నువ్వే కావాలయ్యా' అంటూ ప్రత్యేక గీతంలో నర్తించి ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేశారు తమన్నా భాటియా. సినిమా విజయంలో ఆ గీతం సైతం కీలకపాత్ర పోషించింది. ఇప్పుడు మరోసారి జైలర్‌తో కలసి సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారట తమన్నా. 'జైలర్ 2'లోనూ తమన్నా ప్రత్యేక గీతంలో మెరవనున్నారని కోలీవుడ్ టాక్. అంతేకాదు దర్శకుడు నెల్సన్ రెండో భాగంలో ఆమె పాత్ర నిడివిని పెంచారనీ, కథలో కీలకంగా ఉండబోతోందని తెలుస్తోంది. అలాగే 'కేజీఎఫ్' ఫేమ్ శ్రీనిధి శెట్టి కూడా ఈ చిత్రంలో నటించబోతున్నారని తెలుస్తోంది. అయితే అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. మార్చిలో ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లనుంది.

హంపి కొత్త చరిత్ర



భారత గ్రాండ్‌మాస్టర్, తెలుగమ్మాయి కోనేరు హంపి అంతర్జాతీయ వేదికపై మరోసారి మెరిసింది. ప్రపంచ ర్యాపిడ్ చెస్ మహిళల విభాగం చాంపియన్‌గా నిలిచింది. తద్వారా ప్రపంచ చెస్‌లో ఈ టైటిల్‌ను రెండుసార్లు అందుకున్న తొలి భారత మహిళగా.. ఓవరాల్‌గా రెండో క్రీడాకారిణిగా సరికొత్త చరిత్ర సృష్టించింది.

తెలుగు తేజానికి వరల్డ్ ర్యాపిడ్ చెస్ కిరీటం

రెండోసారి టైటిల్‌తో రికార్డు

ఓపెన్ విభాగం విజేత ముర్జిన్

న్యూయార్క్: ఎన్నాళ్ల కెన్నాళ్లకు..కోనేరు హంపి ఓ ప్రపంచ టైటిల్‌తో సత్తా చాటింది. తాను అద్భుతంగా రాణించే ర్యాపిడ్ చెస్‌లో విశ్వవిజేతగా ఆవిర్భవించింది. ఇక ఈ టోర్నమెంట్ పురుషుల విభాగంలో రష్యా టీనేజర్ వొలొదార్ ముర్జిన్ చాంపియన్‌గా నిలిచాడు. ఏడాదిగా ఎన్నో టోర్నమెంట్లలో పేలవ ప్రదర్శనతో నిరాశ పరుస్తున్న 37 ఏళ్ల హంపి ఎట్టకేలకు ట్రోఫీతో ఆనంద డోలికల్లో మునిగింది. వరల్డ్ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్‌లో టైటిలే లక్ష్యంగా బరిలో దిగిన ఆమె అనుకున్నది సాధించింది. ఆదివారం జరిగిన 11వ, ఆఖరి రౌండ్‌లో ఇండోనేసియాకు చెందిన సుకందర్‌ను హంపి చిత్తు చేసింది. తద్వారా మొత్తం 8.5 పాయింట్లతో తెలుగుతేజం టైటిల్ దక్కించుకుంది. అంతేకాదు..ఈ టైటిల్‌ను రెండోసారి అందుకోవడం ద్వారా చరిత్ర సృష్టించింది. 2019లో జార్జియాలో జరిగిన టోర్నీలో హంపి తొలిసారి ర్యాపిడ్ టైటిల్ సొంతం చేసుకుంది. భారత్‌కు చెందిన నెం.1 హంపి..చైనా గ్రాండ్‌మాస్టర్ జు వెన్‌జున్ తర్వాత ఈ ర్యాపిడ్ చాంపియన్‌షిప్‌ను ఒకటికంటే ఎక్కువసార్లు కైవసం చేసుకొని రికార్డు సృష్టించింది. కాగా హంపి గతేడాది రజతం అందుకుంది. ఈ విజయంతో హంపికి రూ. 51.2 లక్షల ప్రైజ్‌మనీ లభించింది. ఇక ఇదే టోర్నీలోని బ్లిట్జ్ చాంపియన్‌షిప్ ఓపెన్, మహిళల విభాగం పోటీలు భారత కాలమానం ప్రకారం సోమవారం అర్ధరాత్రి మొదలవుతాయి.



ముర్జిన్

ఈసారి తొలి రౌండ్ పరాజయంతో టోర్నీని ఆరంభించిన హంపి ఆపై పుంజుకొని తదుపరి రెండు గేమ్‌ల్లో విజయం సాధించింది. నాలుగో రౌండ్‌ను డ్రా చేసుకున్న ఆమె..ఆ తర్వాత వరుసగా నాలుగు రౌండ్‌లలో జయకేతనం ఎగుర వేయడం విశేషం. జు వెన్‌జున్ (8) రజతం, కాటరినా లగ్నో (రష్యా, 8) కాంస్య పతకం సాధించారు. టైటిల్ రేసులో నిలిచిన మరో తెలుగు గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక చివరి రౌండ్‌ను డ్రా చేసుకుంది. దాంతో ఎనిమిది పాయింట్లతో ఆమె ఐదో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఇతర భారత క్రీడాకారిణులు దివ్య దేశ్‌ముఖ్ (7 పాయింట్లు) 21వ స్థానం, వైశాలీ (5.5) 52వ, వంతిక అగర్వాల్ (5) 67వ స్థానంలో నిలిచారు.

రష్యా కుర్రాడికి 'ఓపెన్' టైటిల్: ర్యాపిడ్ ఓపెన్ విభాగంలో రష్యాకు చెందిన వొలొదార్ ముర్జిన్ టైటిల్ దక్కించుకున్నాడు. 13 రౌండ్ల ద్వారా ముర్జిన్ 10 పాయింట్లు సాధించాడు. రష్యాకే చెందిన గ్రిష్‌చుక్ (9) రజతం, నెపోమ్నియాచి (9.5) కాంస్య పతకాలు నెగ్గారు. 18 ఏళ్ల ముర్జిన్ పిన్నవయస్సులో వరల్డ్ ర్యాపిడ్ టైటిల్ అందుకున్న రెండో ఆటగాడిగా రికార్డు నెలకొల్పాడు. ఉజ్బెకిస్థాన్ గ్రాండ్‌మాస్టర్ అబ్దుసతొరోవ్ 17 ఏళ్ల వయస్సులో ర్యాపిడ్ టైటిల్ సాధించి తొలిస్థానంలో ఉన్నాడు.

ప్చ్..అర్జున్: టైటిల్ రేసులో నిలిచిన అర్జున్ ఇరిగేసి ఐదో స్థానంతో నిరాశ పరిచాడు. శనివారం..తొమ్మిది రౌండ్లు ముగిసేసరికి అగ్రస్థానంలో ఉన్న అర్జున్ ఆదివారం జరిగిన ఆఖరి నాలుగు రౌండ్లలో..ఒక విజయం మరో పరాజయంతో పాటు మిగిలిన రెండు గేమ్‌లను డ్రాగా ముగించాడు. దాంతో.. ర్యాపిడ్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకోవడం ద్వారా 2026 క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధించాలన్న అర్జున్ ఆశలు నెరవేరలేదు. మరో భారత ఆటగాడు ప్రజ్ఞానంద (8.5) 17వ స్థానంలో నిలిచాడు.

అటా.. ఇటా?

ఓవైపు నితీశ్ తన శతక పోరాటంతో బాక్సింగ్ డే టెస్టులో భారత్‌ను పోటీలోకి తీసుకురాగా.. మరోవైపు 105 పరుగుల ఆధిక్యంతో బరిలోకి దిగిన ఆసీస్‌కు మన పేస్ త్రయం పదునైన బంతులతో ముకుతాడు వేసింది. ఫలితంగా ఆ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 91 రన్స్‌కే 6 వికెట్లను కోల్పోయింది. ఇక మిగిలిన వికెట్లు తీయడం ఎంతసేపు.. భారత్ ముందు ఓ మాదిరి ఛేదనే ఉండొచ్చు? అని అనుకున్న వేళ లబుషేన్-కమిన్స్ పోరాట బాధ్యతను టెయిలెండర్లు తీసుకున్నారు. లియోన్-బోలాండ్ ఆఖరి వికెట్‌కు అజేయంగా 55 రన్స్ జోడించి బుమ్రా బృందానికి చుక్కలు చూపించారు. దీనికి తోడు మన ఫీల్డింగ్ వైఫల్యం కూడా ఆసీస్‌కు కలిసొచ్చింది. ఈ నేపథ్యంలో ఆఖరి రోజు ఆటపై అంతటా ఆసక్తి నెలకొంది.



- లబుషేన్ అర్ధసెంచరీ
- ఆసీస్ రెండో ఇన్నింగ్స్ 228/9
- ప్రస్తుత ఆధిక్యం 333
- బుమ్రాకు నాలుగు వికెట్లు
- భారత్ తొలి ఇన్నింగ్స్ 369
- 200 వికెట్ల క్లబ్‌లో జస్‌ప్రీత్

మెల్‌బోర్న్: బాక్సింగ్ డే టెస్టు రసకందాయంలో పడింది. నాలుగో రోజు ఆదివారం భారత బౌలర్ల అద్భుత ప్రదర్శనకు.. ఆసీస్ టెయిలెండర్ల పోరాటానికి మధ్య ఆసక్తికర పోరు జరిగింది. ఈకారణంగా ఆఖరి రోజు సోమవారం ఇరుజట్ల మధ్య విజయం దోబూచులాడే పరిస్థితి నెలకొంది. చివరి వరుస బ్యాటర్లు లియోన్ (41 బ్యాటింగ్), బోలాండ్ (10 బ్యాటింగ్) మొండిగా క్రీజులో నిలవడంతో ఆతిథ్య జట్టు ఇప్పటికే 333 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలిస్తుండడంతో ఆసీస్ తమ రెండో ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేయకుండా కొనసాగించింది. దీంతో ప్రస్తుతం 9 వికెట్లకు 228 పరుగులతో నిలిచింది. లబుషేన్ (70) అర్ధసెంచరీ సాధించగా, కమిన్స్ (41) అండగా నిలిచాడు. బుమ్రాకు నాలుగు, సిరాజ్‌కు మూడు వికెట్లు దక్కాయి. అంతకుముందు 358/9 ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన భారత్ పోరాటం 21 బంతుల్లోనే ముగిసింది. సెంచరీ హీరో నితీశ్ (114)ను లియోన్ అవుట్ చేయడంతో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 369 పరుగులకు ఆలౌటైంది. బోలాండ్, కమిన్స్, లియోన్‌లకు మూడేసి వికెట్లు దక్కాయి. ఒకవేళ భారత్ ముంగిట 350 పరుగుల లక్ష్యమేర్పడితే రోజంతా దీటుగా ఆడి చరిత్రాత్మక విజయంపై కన్నేస్తుందా? లేక డ్రా కోసం ఆడుతుందా? అనేది నేడు చూడాల్సిందే.

కాన్‌స్టాస్‌పై ప్రతీకారం: 105 పరుగుల ఆధిక్యంతో ఆసీస్ రెండో ఇన్నింగ్స్‌ను ఆరంభించగా.. పేసర్ బుమ్రా వారినేమాత్రం కుదురుకోనీయలేదు. అతడికి తోడు సిరాజ్, ఆకాశ్ సైతం కట్టుదిట్టమైన బంతులతో దాడికి దిగారు. దీంతో ఆసీస్ పరుగుల వేటలో వెనుకబడి వికెట్లను కోల్పోయింది. అయితే జైస్వాల్ మూడు క్యాచ్‌లను వదిలేయడం ఆసీస్‌కు బాగా కలిసివచ్చింది. లేకుంటే ఈపాటికి భారత్ రెండో ఇన్నింగ్స్ ఆరంభమయ్యేది. ముందుగా అరంగేట్రంలోనే హాఫ్ సెంచరీ బాదిన ఓపెనర్ కాన్‌స్టాస్ (8)పై ఈసారి బుమ్రా ప్రతీకారం తీర్చుకున్నాడు. ఏడో ఓవర్‌లో అతడి లెంగ్త్ బాల్.. సామ్ బ్యాట్, ప్యాడ్ మధ్య నుంచి వెళ్లి మిడ్ వికెట్‌ను ఎగరగొట్టింది. దీంతో బుమ్రా ప్రేక్షకుల వైపు చూస్తూ ఇంకా అరవండి అంటూ సైగలు చేస్తూ సంబరాలు చేసుకున్నాడు. అటు సిరాజ్ ఈసారి క్రమశిక్షణగా బౌలింగ్ చేస్తూ ఖవాజా (21), స్మిత్ (13) వికెట్లను తీశాడు. మరోవైపు వన్‌డౌన్ బ్యాటర్ లబుషేన్ మాత్రం పట్టుదలగా క్రీజులో నిలిచాడు. మరో ఎండ్‌లో బుమ్రా వికెట్ల వేట మాత్రం ఆగలేదు. 34వ ఓవర్‌లో హెడ్ (1), మార్ష్ (0)లతో పాటు తన తర్వాతి ఓవర్‌లో క్యారీ (2)ని అవుట్ చేయడంతో ఆసీస్ 91/6 స్కోరుతో తీవ్ర ఇబ్బందుల్లో పడింది. ఈ దశలో 150 రన్స్ చేయడం కూడా కష్టమే అనిపించింది. కానీ లబుషేన్‌కు కెప్టెన్ కమిన్స్ జత కలిసి వికెట్ల పతనాన్ని అడ్డుకున్నాడు. మరోవైపు ఈ ఇద్దరి క్యాచ్‌లను జైస్వాల్ వదిలేశాడు. ఆ తర్వాత లబుషేన్ అర్ధసెంచరీ పూర్తి చేయడంతో పాటు కమిన్స్‌తో కలిసి ఏడో వికెట్‌కు 57 పరుగులు జోడించాడు. చివరి సెషన్‌లో లబుషేన్‌ను సిరాజ్ ఎల్బీ చేసి జట్టుకు ఉపశమనం కలిగించాడు. ఆ తర్వాత కాసేపటికే స్టార్క్ (5) రనౌట్ కాగా కమిన్స్‌ను జడేజా పెవిలియన్‌కు చేర్చాడు.



లబుషేన్ (70)

చివర్లో పోరాటం: ఆసీస్ స్కోరు 173/9 దగ్గర వారి ఆధిక్యం 278 పరుగులు. క్రీజులో ఉన్నది లియోన్, బోలాండ్. దీంతో చివరి వికెట్ తీయడం ఎంతో సేపు పట్టదన్న అంచనాలో భారత్ ముందు 300 పరుగుల్లోపే లక్ష్యం ఉంటుందని అంతా భావించారు. కానీ ఈ 'తోక' జోడీ బౌలర్లకు చుక్కలు చూపించింది. వారెంత ప్రయత్నించినా నాలుగో రోజు ఆసీస్‌ను ఆలౌట్ చేయలేకపోయింది. లియోన్ 5 పరుగుల వద్ద ఉన్నప్పుడు సిరాజ్ అతడి రిటర్న్ క్యాచ్‌ను వదిలేశాడు. ఆ చాన్స్‌ను వినియోగించుకుంటూ చూస్తుండగానే ఆధిక్యాన్ని 300కు చేర్చాడు. ఇప్పటికే ఈ జోడీ పదో వికెట్‌కు అజేయంగా 55 పరుగులు జోడించగా.. సంయుక్తంగా 119 బంతులను ఎదుర్కోవడం విశేషం.

1 అతి తక్కువ సగటు (19.38)తో టెస్టుల్లో 200 వికెట్లు తీసిన ఏకైక బౌలర్‌గా బుమ్రా. 44 మ్యాచ్‌ల్లో తను మొత్తంగా 202 వికెట్లు తీశాడు. అలాగే ఆసీస్ గడ్డపై అన్ని ఫార్మాట్లలో కలిపి ఎక్కువ వికెట్లు (75) తీసిన భారత బౌలర్‌గా కపిల్ (72)ను అధిగమించాడు.

టెస్టుల్లో భారత్ తరఫున వేగం (44 టెస్టుల్లో)గా 200 వికెట్లు పూర్తి చేసిన రెండో బౌలర్‌గా జడేజా సరసన నిలిచిన బుమ్రా. అశ్విన్ (37 టెస్టుల్లో) ముందున్నాడు.

2 ఆసీస్ గడ్డపై 8 అంతకంటే తక్కువ స్థానాల్లో వచ్చి ఎక్కువ స్కోరు (114) సాధించిన రెండో పర్యాటక జట్టు బ్యాటర్‌గా నితీశ్. మ్యాట్ ప్రియర్ (118, ఇంగ్లండ్) ముందున్నాడు.

స్కోరుబోర్డు

ఆసీస్ తొలి ఇన్నింగ్స్: 474; భారత్ తొలి ఇన్నింగ్స్: 369

ఆసీస్ రెండో ఇన్నింగ్స్: కాన్‌స్టాస్ (బి) బుమ్రా 8; ఖవాజా (బి) సిరాజ్ 21; లబుషేన్ (ఎల్బీ) సిరాజ్ 70; స్మిత్ (సి) పంత్ (బి) సిరాజ్ 13; హెడ్ (సి) నితీశ్ (బి) బుమ్రా 1; మార్ష్ (సి) పంత్ (బి) బుమ్రా 0; క్యారీ (బి) బుమ్రా 2; కమిన్స్ (సి) రోహిత్ (బి) జడేజా 41; స్టార్క్ (రనౌట్) 5; లియోన్ (బ్యాటింగ్) 41; బోలాండ్ (బ్యాటింగ్) 10; **ఎక్స్‌ట్రాలు: 16; మొత్తం: 82 ఓవర్లలో 228/9. వికెట్ల పతనం:** 1-20, 2-43, 3-80, 4-85, 5-85, 6-91, 7-148, 8-156, 9-173. **బౌలింగ్:** బుమ్రా 24-7-56-4; ఆకాశ్ 17-4-53-0; సిరాజ్ 22-4-66-3; జడేజా 14-2-33-1; నితీశ్ 1-0-4-0; సుందర్ 4-0-7-0.

మూడు క్యాచ్‌లు వదిలేసిన జైస్వాల్

ఆదివారం ఆటలో యువ బ్యాటర్ జైస్వాల్‌ను దురదృష్టం వెంటాడింది. అతడెక్కడ ఉంటే అక్కడికి క్యాచ్‌లు రాగా, వచ్చిన మూడింటినీ అతను నేలపాలు చేశాడు. ఆసీస్ ఇన్నింగ్స్ మూడో ఓవర్‌లోనే ఖవాజా క్యాచ్‌ను గల్లీలో ఉన్న జైస్వాల్ అందుకోలేకపోయాడు. ఆ తర్వాత అదే స్థానంలో లబుషేన్ ఇచ్చిన క్యాచ్‌ను కూడా పట్టలేకపోయాడు. కమిన్స్ 20 రన్స్ దగ్గర ఉన్నప్పుడు ఇచ్చిన క్యాచ్‌ను సిల్లీ పాయింట్‌లో ఉండి చేజార్చాడు. వీటన్నింటిని చూస్తూ తీవ్ర అసంతృప్తికి గురైన కెప్టెన్ రోహిత్ అతడికి కాస్త గట్టిగానే క్లాస్ పీకాడు. అయితే కెప్టెన్ ప్రవర్తన సరిగ్గా లేదని, క్యాచ్‌లను ఎవరూ కావాలని వదిలేయరని వ్యాఖ్యాత మైక్ హస్సీ స్పందించాడు. ఈ సమయంలోనే అతడిని ప్రోత్సహించాల్సిందిగా సూచించాడు.



జైస్వాల్‌తో రోహిత్



15 ఏళ్లకే గ్రాండ్‌మాస్టర్.. మూడు దశాబ్దాలకు పైగా కెరీర్‌లో ఎన్నో విజయాలు.. మరెన్నో మైలురాళ్లను అధిగమించిన ఘన చరిత్ర.. అర్జున, పద్మశ్రీ వంటి ప్రతిష్ఠాత్మక పురస్కారాలు.. దేశ చదరంగ రారాణిగా నీరాజనాలు.. చెస్ ప్రపంచంలో తిరుగులేని దిగ్గజ గ్రాండ్‌మాస్టర్‌గా పేరు. అంతటి ప్రఖ్యాత క్రీడాకారిణికి ఈ ఏడాది కఠిన సవాళ్లను విసిరింది. రెండు టోర్నీల్లో వరుస ఓటములతో నిద్రలేని రాత్రులు గడిపింది. ఇక కెరీర్‌కు గుడ్‌బై చెబుదామనుకున్న మానసిక స్థితి నుంచి ఒక్కో విజయంతో మునపటి ఆటతీరును మరిపిస్తూ ప్రపంచ ర్యాపిడ్ కిరీటాన్ని సగర్వంగా రెండోసారి అందుకొని చరిత్ర సృష్టించింది. ఏడేళ్ల బిడ్డకు తల్లిగా ఓవైపు కుటుంబాన్ని చూసుకుంటూనే, మరోవైపు స్ఫూర్తిదాయక ప్రదర్శనతో ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన కోనేరు హంపి 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్న విశేషాలు ఆమె మాటల్లోనే..

నిద్రలేని రాత్రులు.. కఠిన సవాళ్లు

కెరీర్‌కు గుడ్‌బై చెబుదామనుకున్నా

'ఆంధ్రజ్యోతి'తో హంపి

నిద్ర లేని రాత్రులు.. ఓటమి భారం.. ఇక చెస్ ఆడగలనా అనే ప్రశ్నలు.. వీటన్నింటికి ఈ విజయం సమాధానం చెప్పింది. నా వయసు ఇప్పుడు 37 ఏళ్లు. ఈ దశలో సాధారణంగా క్రీడాకారులు ఆటలో ప్రభ కోల్పోతుంటారు. ఈ ఏడాది రెండు టోర్నీల్లో ఎదురైన పరాభవాలు నా మదిలో ఆటపై అనేక ప్రశ్నలు ఉత్పన్నమయ్యేలా చేశాయి. ఇకపై నేను చెస్ ఆడగలనా? లేక ఆటకు వీడ్కోలు పలుకుదామా? అనే మానసిక స్థితి నుంచి మరోసారి ప్రపంచ ర్యాపిడ్ చాంపియన్‌గా నిలవడం చాలా సంతోషంగా ఉంది. మరి కొంతకాలం చెస్‌తో నా ప్రయాణం కొనసాగించేందుకు ఈ ప్రపంచ ర్యాపిడ్ చెస్ టైటిల్ ఉత్ప్రేరకాన్ని అందించింది. భగవద్గీతలోని కొన్ని శ్లోకాలు కూడా నాలో నూతన ఉత్తేజాన్ని నింపాయి. అంత:కరణ శుద్ధితో మన పని మనం చేస్తూ ఉంటే ఫలితాలు కచ్చితంగా వస్తాయనేది నా జీవితంలో ఈ విజయంతో రుజువైంది.

తాడో పేడో..

2019లో మాస్కోలో జరిగిన వరల్డ్ ర్యాపిడ్ చాంపియన్‌షిప్‌లో టైటిల్ గెలవాలన్న పట్టుదలతో తలపడి విజయం సాధించా. కానీ, ఈసారి మాత్రం కెరీర్ కొనసాగించాలా? లేక రిటైర్ అవ్వాలా అన్న విషయమై ఓ నిర్ణయానికి రావాలన్న ఆలోచనతో బరిలోకి దిగా. టోర్నీ ప్రారంభంలో ఎదురైన ఓటములు నాలో మరింత కసి పెంచాయి. తాడో పేడో తేల్చుకుందామనే ధోరణిలో మిగిలిన గేమ్‌ల్లో ఆడి గెలిచా. ఈ విజయం నా కెరీర్‌లోనే అత్యుత్తమమైనది.

కొవిడ్ తర్వాత చాలా మార్పులు

మాస్కోలో జరిగిన పోటీల్లో నేను ప్రపంచ ర్యాపిడ్ చెస్ టైటిల్‌ను తొలిసారి గెలిచినప్పటికి, ఇప్పటికి ఆటలో చాలా మార్పులు వచ్చాయి. గ్రాండ్‌మాస్టర్ల ఎత్తుల్లో వేగం, వ్యూహాత్మకత పెరిగింది. ఆన్‌లైన్ చెస్ సాహిత్యం పెరగడంతో విభిన్న ప్రారంభ ఎత్తులను ప్లేయర్లు భయం లేకుండా ప్రయోగిస్తున్నారు. ఆన్‌లైన్ చెస్ పోటీలు పెరగడంతో సాధనకు అవకాశాలు అధికమయ్యాయి. కాలానుగుణంగా వచ్చిన మార్పులను గమనించి, నేను నా ఆటకు పదును పెట్టడంతో మళ్లీ విజయాల బాట పట్టా. ఈ టోర్నీ కోసం ఆన్‌లైన్ చెస్ ప్రాక్టీసు పోటీల్లో ఎక్కువ పాల్గొన్నా. చెస్ పజిల్స్‌ను వేగంగా పరిష్కరించే సాధన కూడా బాగా ఉపకరించింది.

ర్యాపిడ్ కఠినమైనది

క్లాసికల్‌లో మేటి చెస్ క్రీడాకారిణిగా నాకు పేరు ఉంది. ఈ ఆధునిక చెస్‌లో క్లాసికల్‌లో సాధించిన ఫలితాలు ర్యాపిడ్‌లో లభించడం కష్టంగా మారింది. ర్యాపిడ్ ఫార్మాట్ అంత వైవిధ్యంగా, కఠినంగా ఉంటుంది. అలాంటి ర్యాపిడ్‌లో కూడా రెండుసార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలవడం ఆనందంగా ఉంది. ఇక.. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరగనున్న ఫిడే గ్రాండ్ ప్రీ టోర్నీ కోసం సన్నద్ధమవ్వాలనుకుంటున్నా.

ప్రధాని మోదీ ప్రశంస

హంపిని ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసల్లో ముంచెత్తారు. 'ప్రపంచ ర్యాపిడ్ చాంపియన్‌షిప్ గెలిచిన హంపికి అభినందనలు. ఆమె పట్టుదల, అద్భుత నైపుణ్యాలు సదా స్ఫూర్తి నింపుతాయి. ర్యాపిడ్ టైటిల్ రెండుసార్లు అందుకోవడంతో ఈ గెలుపు ఆమెకు మరింత చరిత్రాత్మకం' అని మోదీ ఎక్స్‌లో పేర్కొన్నారు.

స్టీలర్స్..అదుర్స్

- ప్రొ. కబడ్డీ విజేత హరియాణా
- తొలిసారి టైటిల్ కైవసం
- ఫైనల్లో పట్నా పైరేట్స్ చిత్తు



పుణె: టోర్నీ ఆసాంతం అదరగొట్టిన హరియాణా స్టీలర్స్.. ప్రొ కబడ్డీ లీగ్ టైటిల్‌ను తొలిసారి ముద్దాడింది. ఆదివారం జరిగిన ఫైనల్లో హరియాణా 32-23తో మూడుసార్లు చాంపియన్ పట్నా పైరేట్స్‌ను చిత్తు చేసింది. రైడర్ శివం పటారే 9 పాయింట్లు.. ఆల్‌రౌండర్ మహ్మద్రెజా (7 పాయింట్లు) హైలైట్‌గా నిలిచారు. పట్నా స్టార్ రైడర్ దేవాంక్ (5 పాయింట్లు)తోపాటు అయాన్ (3 పాయింట్లు)ను కట్టడి చేయడంలో హరియాణా డిఫెన్స్ విజయం సాధించింది. వీరిద్దరూ ఎక్కువ సేపు బెంచ్‌కే పరిమితం కావడం పట్నా స్కోరింగ్‌పై ప్రభావం చూపింది. పైరేట్స్ తరఫున గుర్‌దీప్ 6 టాకిలింగ్స్‌తో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఆరంభం నుంచే వ్యూహాత్మకంగా ఆడిన హరియాణా.. ఏదశలోనూ పట్నాకు పుంజుకొనే అవకాశం ఇవ్వలేదు. ఫస్టాఫ్‌లో పైరేట్స్ ఓ మాదిరిగా పోరాడినా.. ద్వితీయార్థంలో హరియాణా జోరు ముందు నిలవలేక పోయింది. విజేత హరియాణా స్టీలర్స్‌కు రూ.3 కోట్లు, రన్నరప్ పట్నా పైరేట్స్‌కు రూ. 1.8 కోట్లు ప్రైజ్‌మనీగా లభించింది.

వజ్రాన్ని అందించారు

నితీశ్ తండ్రితో గవాస్కర్



మెల్‌బోర్న్: నితీశ్ కుమార్ తండ్రి ముత్యాలు భారత మాజీ కెప్టెన్, కామెంటేటర్ సునీల్ గవాస్కర్‌ను బ్రాడ్‌కాస్టర్ బాక్స్‌లో ప్రత్యేకంగా కలిశాడు. ఆ సమయంలో గవాస్కర్‌కు ముత్యాలు పాదాభివందనం చేయడంతో.. సన్నీ తీవ్ర భావోద్వేగానికి గురయ్యాడు. ఈ సందర్భంగా 'మీ వల్లే ఈరోజు నాకళ్లలో నీళ్లు తిరిగాయి. మీ త్యాగం వల్లే దేశానికి ఓ వజ్రం లభించింద'ని గవాస్కర్ కొనియాడాడు. హృద్యమైన ఆ దృశ్యాన్ని చూసి నితీశ్ తల్లి కూడా ఉబికి వస్తున్న కన్నీటిని ఆపుకోలేక పోయింది. ఆ తర్వాత ముత్యాలు విలేకరులతో మాట్లాడుతూ.. నితీశ్ 99 రన్స్ వద్ద ఉన్నప్పుడు తానెంతో ఒత్తిడికి గురయ్యానని చెప్పాడు. అయితే, సిరాజ్ జాగ్రత్తగా ఆడడంతో తన కుమారుడికి సెంచరీ పూర్తి చేసే అవకాశం వచ్చిందని అన్నాడు. ఇందుకు సిరాజ్‌కు కృతజ్ఞతలు చెప్పాడు. ముత్యాలు తెలుగులో మాట్లాడగా, నితీశ్ సోదరి తేజస్వి ఇంగ్లిష్‌లో తర్జుమా చేసింది. తేజస్వి ప్రస్తుతం ఉజ్బెకిస్థాన్‌లో మెడిసిన్ చదువుతోంది. 'ఈ అపురూప క్షణాలకు దూరం కావద్దన్న ఆలోచనతోనే ఆస్ట్రేలియా వచ్చాం. తమ్ముడి కోసం నాన్న ఎంతో కష్టపడ్డారు. బయటకు వెళ్లినప్పుడు తన కోసం కాకుండా నితీశ్ కోసమే ఆహారం తీసుకెళ్లేవారు. ప్రాక్టీస్ ముగిసేంతవరకు కనిపెట్టుకొని ఉండేవార'ని తేజస్వి తెలిపింది. తన తల్లి కూడా నితీశ్‌కు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసిందని చెప్పింది. ఎంత ఎదిగినా తన తమ్ముడు ఒదిగి ఉంటాడనే నమ్మకాన్ని వ్యక్తం చేసింది. పేదరికం నుంచి వచ్చిన అతడికి అన్నీ తెలుసని చెప్పింది.

డబ్ల్యూటీసీ ఫైనల్లో దక్షిణాఫ్రికా

తొలి టెస్ట్‌లో పాక్‌పై థ్రిల్లింగ్ విక్టరీ



రబాడ (31 నాటౌట్) జెన్సన్ (16 నాటౌట్)

సెంచూరియన్: ఉత్కంఠభరితంగా సాగిన తొలి టెస్టులో దక్షిణాఫ్రికా 2 వికెట్ల తేడాతో పాకిస్థాన్‌పై విజయం సాధించింది. మరో రోజు ఆట మిగిలుండగానే గెలిచిన సఫారీలు.. తొలిసారి వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు దూసుకెళ్లారు. 148 పరుగుల లక్ష్య ఛేదనలో.. ఆటకు నాలుగో రోజైన ఆదివారం ఓవర్‌నైట్ స్కోరు 27/3తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన సౌతాఫ్రికా 8 వికెట్లకు 150 పరుగులు చేసి నెగ్గింది. మహ్మద్ అబ్బాస్ (6/54) దెబ్బకు.. ఆతిథ్య జట్టు 99/8తో ఓటమి అంచున నిల్చింది. అయితే, మార్కో జెన్సన్ (16 నాటౌట్), రబాడ (31 నాటౌట్) తొమ్మిదో వికెట్‌కు అజేయంగా 51 పరుగుల భాగస్వామ్యంతో జట్టును గట్టెక్కించారు. కెప్టెన్ బవుమా (40), మార్క్రమ్ (37) రాణించారు. పాకిస్థాన్ 211, 237 పరుగులు చేయగా.. దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 301 రన్స్ సాధించింది. వచ్చే ఏడాది లార్డ్స్‌లో జరిగే డబ్ల్యూటీసీ ఫైనల్లో ఒక జట్టుగా దక్షిణాఫ్రికా ఖరారు కావడంతో.. రెండో బెర్త్ కోసం ఆస్ట్రేలియా, భారత్, శ్రీలంక మధ్య తీవ్ర పోటీ నెలకొంది.

శ్రీవారి సేవలో జస్టిస్ ఎన్వీ రమణ


తిరుమల ఆలయంలో జస్టిస్ ఎన్వీ రమణ

తిరుమల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ దంపతులు ఆదివారం రాత్రి నైవేద్య విరామ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందున్న అఖిలాండం వద్ద కొబ్బరికాయలు సమర్పించి బేడి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అంతకు ముందు వారు తిరుచానూరు పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు.

పోతన చరిత్రను ప్రపంచానికి చాటిచెప్పాలి

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజేశ్వరరావు

పాలకుర్తి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): భాగవత గ్రంథకర్త బమ్మెర పోతన చరిత్రను ప్రపంచానికి చాటి చెప్పేలా పాలకుర్తి వాసులతో పాటు రాష్ట్ర ప్రజలు కృషి చేయాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజేశ్వరరావు అన్నారు. పోతన జయంతి ఉత్సవాలను ప్రతీ ఏటా బమ్మెరలో నిర్వహించాలన్నారు. ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డాక తెలంగాణలో ప్రాచీన దేవాలయాలను అద్భుతంగా తీర్చిదిద్దారని ఆయన అభిప్రాయపడ్డారు. ఆదివారం జనగామ జిల్లా పాలకుర్తిలోని శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, వల్మిడిలో శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయాల్లో జస్టిస్ రాజేశ్వరరావు, పద్మావతి దంపతులు పూజలు చేశారు. బమ్మెరలోని పోతన సమాధిని సందర్శించారు. పోతన మోటబావి వద్ద పూజలు చేశారు. ఈ సందర్భంగా జస్టిస్ రాజేశ్వరావు మాట్లాడుతూ.. బసవపురాణం గ్రంథకర్త పాల్కూరికి సోమనాథుడు కూడా ఇక్కడే జన్మించారని, కవులకు నిలయంగా ఈ ప్రాంతం ప్రసిద్ధి చెందిందని అన్నారు.

కులగణనపై శ్వేత పత్రం విడుదల చేయాలి

- సర్వేపై సర్కారుకు స్పష్టత లేదు: జాజుల

కవాడిగూడ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కులగణన సర్వేపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయాధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. సర్వేపై సీఎం రేవంత్‌రెడ్డికి అధికారులు తప్పుడు లెక్కలు చూపిస్తూ తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. దోమలగూడ బీసీ భవన్‌లో మీడియా సమావేశంలో జాజుల మాట్లాడారు. కులగణన సర్వేపై ప్రభుత్వానికి స్పష్టత లేదన్నారు. సర్కారుకు చిత్తశుద్ధి ఉంటే పూర్తి స్థాయిలో సమగ్ర కులగణన నిర్వహించిన తర్వాతే అసెంబ్లీలో బిల్లు పెట్టాలన్నారు. రాష్ట్రంలో అద్దెకు ఉంటున్న వారి ఇళ్లకు ఏ అధికారి ఇప్పటివరకు సర్వేకు వెళ్లలేదని ఆరోపించారు. బిహార్‌లో సొంతిళ్లకు ఒకసారి, అద్దె ఇళ్లకు మరోసారి కులగణన చేసినట్లు ఇక్కడా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ప్రైవేటు బస్సులో గంజాయి చాక్లెట్ల పట్టివేత

- విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్తుండగా తనిఖీ
- నలుగురు మహిళలు సహా ఆరుగురి అరెస్టు

కోదాడ రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయదారులు రోజుకో కొత్త మార్గాన్ని ఎంచుకుంటున్నారు. తాజాగా గంజాయిని చాక్లెట్ల రూపంలో ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. సూర్యాపేట జిల్లా కోదాడలో ఈ ఘటన జరిగింది. ఎక్సైజ్ సీఐ శంకర్, ఎస్సై గోవర్ధన్ వివరాల మేరకు.. రాష్ట్ర సరిహద్దు కోదాడ మండలం నల్లబండగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద ఆదివారం తెల్లవారుజామున ఎక్సైజ్ పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న ఓ ట్రావెల్స్ బస్సులో సోదాలు చేశారు. ఒడిశాకు చెందిన అనిల్, బకించంద్రతో పాటు మరో నలుగురు మహిళలు బ్యాగులో గంజాయి చాకెట్లను తరలిస్తున్నట్లు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఆ చాక్లెట్ల విలువ సుమారు రూ.లక్ష ఉంటుందన్నారు.

భయపడే రక్తం మాది కాదు

భయపెట్టే రక్తం మాది

- కేసీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కోలేకే నాపై, కేటీఆర్‌పై కేసులు: ఎమ్మెల్సీ కవిత


నిజామాబాద్‌లో ప్రజలకు అభివాదం చేస్తున్న కవిత

సుభాష్‌నగర్ (నిజామాబాద్), డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): 'బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కోలేకనే నాపై, కేటీఆర్‌పై కాంగ్రెస్, బీజేపీలు కలిసి అక్రమ కేసులు పెడుతున్నాయి. ఎన్ని కేసులు పెట్టినా ఎన్ని నిర్బంధాలకు పాల్పడినా భయపడే ప్రసక్తి లేదు. మాది భయపడే రక్తం కాదు.. భయపెట్టే రక్తం' అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఆదివారం నిజామాబాద్ పర్యటనకు వచ్చిన కవిత జిల్లా కేంద్రంలోని ఎస్ఎఫ్ఎస్ చౌరస్తా వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి నివాళులర్పించి అనంతరం ప్రజలనుద్దేశించి మాట్లాడారు. తప్పు చేయనిది భయపడే ప్రసక్తే లేదని, ఎన్ని కేసులు పెట్టినా బీఆర్ఎస్ కార్యకర్తలు నిప్పు కణికల్లా బయటకు వస్తారన్నారు. తాను నిప్పులాంటి నిజామాబాద్ బిడ్డనని దేనికీ భయపడనని చెప్పారు. ప్రశ్నిస్తే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కేసులు పెడుతోందని, ఇక రాష్ట్రంలో అక్రమ కేసులపై చెప్పనవసరం లేదన్నారు. హామీల అమలులో రేవంత్ సర్కార్ విఫలమైందని, గ్రామాల్లో హామీలపై కాంగ్రెస్ నేతలను నిలదీయాలని పిలుపునిచ్చారు.

బీసీలపై కవితది మొసలి కన్నీరు

- అధికారంలో పదేళ్లు ఉన్నా కేసీఆర్ బీసీలకు అన్యాయం చేశారు
- ఈ-ఫార్ములా కేసుతో కేంద్రానికి ఏం సంబంధం?: ఎంపీ రఘునందన్



సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): బీసీలపై కల్వకుంట కవిత మొసలి కన్నీరు కార్చడం మానుకోవాలని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు హితవు పలికారు. సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్షా ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మెకు ఆయన ఆదివారం సంఘీభావం తెలిపారు. బీసీలకు అన్యాయం జరుగుతుందని, బీసీ కులగణన చేయాలని కవిత డిమాండ్ చేయడం విడ్డూరంగా ఉందని చెప్పారు. పదేళ్లు అధికారంలో ఉండి కేసీఆర్ బీసీలకు అన్యాయం చేశారని, బీఆర్ఎస్ నేతలు బీసీల గురించి మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందన్నారు. కేంద్రం, బీజేపీ భయపెట్టాలని చూస్తున్నట్లు కవిత చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటే గౌరవంగా ఉంటుందని వ్యాఖ్యానించారు. గతంలోనూ మోదీ, ఈడీ, బోడీలని కవిత అన్నారని గుర్తు చేశారు. తిహాడ్ జైలుకు పోయి వచ్చినా కవిత మారలేదన్నారు. ఈ-ఫార్ములా రేసు కేసుతో కేంద్రానికి ఏం సంబంధమని ప్రశ్నించారు. సమగ్ర శిక్షా ఉద్యోగుల క్రమబద్ధీకరణ కోసం కట్టుబడి ఉంటానని, రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తానని స్పష్టం చేశారు.

ప్రతి కమతానికి భూధార్!

(మొదటిపేజీ తరువాయి)



కలిగి ఉన్నారు, హక్కులపై ఉన్న షరతులు, శిస్తు వివరాల కాలమ్స్‌ను పొందుపరిచారు. 1971 చట్టం ప్రకారం యజమాని, పట్టాదారు, తనకాదారు, అనుభవదారు, కౌలుదారుపేర్లు, వారికి ఉన్న భూమి వివరాల కాలమ్స్‌ను పొందుపరిచారు. 2020 చట్టంలో పట్టాదారు పేరు, భూమి ఉన్న సర్వే నంబరు, విస్తీర్ణం, ఇతర వివరాలతో కాలమ్స్ ఉండగా.. 2024 భూ భారతిలో యజమాని, అనుభవదారు, తనఖాదారు పేర్లు, వారికి ఉన్న భూమి వివరాలు, ఆ భూమి ఎలా సంక్రమించింది, హక్కులపై ఉన్న షరతులు, భూమి శిస్తు వివరాల కాలమ్స్‌ను ప్రవేశపెట్టారు. 1948లో ఆర్వోఆర్ చట్టం రూపొందించేటప్పుడు వ్యవసాయ భూముల సెన్సెస్ నిర్వహించి ఖాస్రాపహాణీ హక్కుల రికార్డును ప్రకటించారు. 1971లో భూ యజమానుల నుంచి దరఖాస్తులు తీసుకుని, గ్రామ సభల ద్వారా 1బీ రిజిస్టర్ తయారు చేశారు. 2020లో 1971 నాటి 1బీ రిజిస్టర్‌నే ఆర్వోఆర్‌గా స్వల్ప మార్పులతో ప్రకటించారు. కొత్తగా హక్కుల రికార్డు రూపొందించలేదు. 2024 చట్టంలో మాత్రం రిజిస్ట్రేషన్ సందర్భంగా చేపట్టే సర్వే ఆధారంగా కొత్త హక్కుల రికార్డును రూపొందించే అవకాశం కల్పించారు.

తప్పుల సవరణ ఇలా?

1948 చట్టం ప్రకారం రెండేళ్ల గడువులోగా తప్పులు గుర్తిస్తే ప్రభుత్వం నిర్ధేశించిన అధికారికి దరఖాస్తు చేసుకోవచ్చు. 1971 చట్టం ప్రకారం ఏడాది గడువు లోపల ప్రభుత్వం నిర్దేశించిన అధికారికి దరఖాస్తు పెట్టుకునే అవకాశం ఇచ్చారు. 2020 చట్టంలో హక్కుల రికార్డు సవరణకు ఎలాంటి అవకాశం ఇవ్వలేదు. 2024 చట్టంలో ఏడాది లోపల దరఖాస్తు చేసుకునే అవకాశం ఇచ్చారు. తహసీల్దార్ స్థాయిలో తప్పు జరిగితే ఆర్డీవోకు, ఆర్డీవో స్థాయిలో పొరపాటు జరిగితే కలెక్టర్‌కు, అక్కడ కూడా పొరపాటు జరిగితే ల్యాండ్ ట్రిబ్యునల్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు.

మ్యుటేషన్‌లోనూ మార్పులు

1948 ఆర్వోఆర్ చట్టం ప్రకారం వారసత్వ భూమిపై హక్కుల కోసం మూడు నెలల వ్యవధిలో పట్వారీకి దరఖాస్తు చేసుకోవాలి. ఆయన ఆ వివరాలను మ్యుటేషన్ రిజిస్టర్‌లో నమోదు చేస్తారు. ఈ రిజిస్టర్‌ను తహసీల్దారు, ఆపై స్థాయి అధికారి పరిశీలించిన తరువాత హక్కుల రికార్డులోకి ఎక్కిస్తారు. రిజిస్ట్రేషన్ ద్వారా హక్కులు సంక్రమిస్తే మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేసుకునే అవసరం లేదు. 1971 ఆర్వోఆర్ ప్రకారం వారసత్వ భూమిపై హక్కుల కోసం నెల వ్యవధిలో తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకోవాలి. రిజిస్టర్ దస్తావేజు ద్వారా హక్కులు సంక్రమించినప్పుడు రిజిస్ట్రేషన్ అధికారి తహసీల్దార్‌కు సమాచారం ఇవ్వాలి. తహసీల్దార్ వాటిని పరిశీలించి.. హక్కుల రికార్డులో నమోదు చేస్తారు. 2020 ఆర్వోఆర్ ప్రకారం కొనుగోలు, దానం, తనఖా, బదిలీ ద్వారా హక్కులు సంక్రమిస్తే తహసీల్దార్ రిజిస్ట్రేషన్ చేసి హక్కుల రికార్డులో మార్పులు చేస్తారు. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ఒకేసారి జరిగిపోతుంది. వారసత్వంగా భూమి వస్తే వారసులు సంయుక్త ప్రకటన రాసుకుని తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకుంటే.. రికార్డుల్లో మార్పు చేస్తారు. 2020 చట్టంలో అప్పీల్ వ్యవస్థ లేదు. కోర్టును ఆశ్రయించాల్సిందే. 2024 చట్టం ప్రకారం కొనుగోలు, దానం, తనఖా, బదిలీ, భాగ పంపకాల ద్వారా హక్కులు సంక్రమిస్తే తహసీల్దార్ రిజిస్ట్రేషన్ చేసి హక్కుల రికార్డులో మార్పులు చేస్తారు. ఒకే రోజు రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ జరిగిపోతుంది. వారసత్వ భూమిపై హక్కుల కోసం తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకుంటే రికార్డుల్లో నమోదు చేస్తారు. నిర్ణీత వ్యవధిలో మ్యుటేషన్ చేయకపోతే ఆటోమేటిక్‌గా అవుతుంది. కోర్టు తీర్పు, లావోణీ పట్టా, 38ఈ, 13బీ సర్టిఫికెట్, ఓఆర్‌సీ, సేల్ సర్టిఫికెట్ ద్వారా హక్కులు సంక్రమిస్తే ఆర్డీవోకు దరఖాస్తు చేసుకుంటే హక్కుల రికార్డులో మార్పు చేస్తారు. ప్రభుత్వం నిర్దేశించిన తేదీ నాటి నుంచి భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ జరగడానికి భూమి పటం తప్పనిసరి చేశారు. తహసీల్దార్ ఉత్తర్వులపై ఆర్డీవోకు, ఆర్డీవో ఉత్తర్వులపై కలెక్టర్ లేదా జేసీలకు అప్పీల్ చేసుకోవచ్చు. వీరి తీర్పులపై భూ ట్రిబ్యునల్‌కు రివిజన్ అధికారాలు ఇచ్చారు.

ప్రతి కమతానికి విశిష్ట గుర్తింపు

గతంలో ఏ చట్టంలోనూ ఈ అంశాన్ని పొందుపర్చలేదు. డిజిటల్ ఇండియా భూ రికార్డుల ఆధునికీకరణలో భాగంగా భూ కమతాలకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వనున్నారు. 2024 చట్టంలో ప్రతి భూ కమతానికి తొలుత తాత్కాలిక భూధార్ నంబర్ ఇచ్చి, సర్వే చేసిన తరువాత శాశ్వత భూధార్ ఇచ్చేలా ప్రతిపాదించారు. 1948లో హక్కుల రికార్డు సర్టిఫైడ్ కాపీ మాత్రమే ఇచ్చే వారు. కోర్టులో ఏదైనా కేసు నమోదు చేయాలంటే హక్కుల రికార్డు సర్టిఫైడ్ కాపీ తప్పనిసరి. 1971 చట్టం ప్రకారం తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకుంటే పట్టాదార్ పాస్‌పుస్తకం, భూ యాజమాన్య హక్కు పత్రం ఇచ్చేవారు. 2020 చట్టంలో పట్టాదార్ పాస్‌పుస్తకం కమ్ టైటిల్ డీడ్/ భూ యాజమాన్య హక్కు పత్రం ఇచ్చారు. 2024 చట్టం ప్రకారం పట్టాదారు పాస్‌పుస్తకం కమ్ టైటిల్ డీడ్/ భూ యాజమాన్య హక్కు పత్రం ఇస్తారు. దీంతోపాటు భూధార్ ఇవ్వనున్నారు. పాస్‌పుస్తకాలకు రిజిస్టర్ దస్తావేజుకు ఉన్న విలువే ఉంటుంది. హక్కుల రికార్డు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటుంది. ఎవరైనా సర్టిఫైడ్ కాపీలు పొందవచ్చు.

రైతులకు మేలు చేయనుంది

భూభారతి-2024 చట్టం ద్వారా గతంలో జరిగిన పొరపాట్లను సరిదిద్ది రైతులకు మరింత మేలు చేసే అవకాశం ఉంది. భూ సమస్యలకు పరిష్కారం చూపనుంది. ప్రభుత్వం త్వరలో విడుదల చేయనున్న మార్గదర్శకాలతో అన్ని అంశాలపై స్పష్టత ఇవ్వనుంది. తద్వారా 2020 చట్టం ద్వారా ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులకు మంచి జరుగుతుంది. ఆర్వోఆర్ చట్టం ప్రధాన ఉద్దేశం నెరవేరుతుంది.

- సునీల్, భూ చట్టాల నిపుణుడు

అధికారులపై చర్యలుంటాయా?

1948, 1971 చట్టాల ప్రకారం రికార్డుల్లో సవరణలు చేసిన ప్రభుత్వ అధికారిపై ఎలాంటి చర్యలకు తావు లేదు. 2020 చట్టం ప్రకారం రికార్డుల్లో సవరణలు చేసినా.. తొలగించినా ప్రభుత్వ అధికారిపై కేసు నమోదుకు అవకాశం లేదు. రికార్డులు ట్యాంపర్ చేసినా, మోసపూరిత చర్యలకు పాల్పడితే క్రిమినల్ కేసులు పెట్టవచ్చు. ప్రభుత్వ భూములకు పాస్‌పుస్తకాలు ఇస్తే కలెక్టర్ రద్దు చేయవచ్చు. 2024 చట్టం ప్రకారం రికార్డుల నమోదు, సవరణ చేపట్టే అధికారిపై ఎలాంటి కేసు పెట్టేందుకు వీలు లేదు. రికార్డులు ట్యాంపర్ చేసినా, మోసపూరిత చర్యలకు పాల్పడినా క్రిమినల్ చర్యలకు అవకాశం ఉంది. సర్వీస్ నుంచి తొలగించవచ్చు. ప్రభుత్వ భూములకు పాస్‌పుస్తకాలు ఇస్తే కలెక్టర్ రద్దు చేయవచ్చు. తహసీల్దార్‌ను ఉద్యోగం నుంచి తొలగించి, క్రిమినల్ చర్యలు తీసుకోవచ్చు.

24,200 పైన బుల్లిష్

(డిసెంబరు 30-జనవరి 3 తేదీల మధ్య వారానికి)


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

ఆస్ట్రో గైడ్


నిఫ్టీ గత వారం 24,781-23,939 పాయింట్ల మధ్యన కదలాడి 225 పాయింట్ల లాభంతో 23,813 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 24,200 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 23,796, 23,874, 24,228, 24,154 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డిఎంఎ 200 డిఎంఎ కన్నా పైకి రావడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 24,200 బ్రేక్‌డౌన్ స్థాయి: 23,500
నిరోధ స్థాయిలు: 24,025, 24,125, 24,225 (23,925 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 23,700, 23,600, 23,500 (23,800 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

30వ తేదీ			
హైదరాబాద్	550	విజయవాడ	550
వరంగల్	552	గోదావరి	550
చిత్తూరు	583	విశాఖపట్నం	600
		డజను గుడ్లు రూ. 84	



ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	95	విజయవాడ	106
వరంగల్	95	గుంటూరు	106
కరీంనగర్	95	ఒంగోలు	106
మహబూబ్‌నగర్	95	చిత్తూరు	94
కర్నూలు	95	నెల్లూరు	94
విశాఖపట్నం	105	అనంతపురం	94
గోదావరి	106		



ప్రైవేట్ బ్యాంకులకు తప్పని

ఉద్యోగుల వలసలు

25 శాతానికి చేరిన అట్రిషన్



న్యూఢిల్లీ: దేశంలోని ప్రైవేట్ బ్యాంకులకు కొత్త కష్టాలు ప్రారంభమయ్యాయి. ఉద్యోగుల్లో ఏటా 25 శాతం మంది ఈ బ్యాంకుల నుంచి వలస పోవటమో (అట్రిషన్) లేదంటే గుడ్‌బై చెప్పటమో జరుగుతోంది. గత మూడేళ్లుగా ఇదే పరిస్థితి. 'ట్రెండ్ అండ్ ప్రోగ్రెస్ ఆఫ్ బ్యాంకింగ్ ఇన్ ఇండియా 2023-24' పేరుతో భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) విడుదల చేసిన తాజా నివేదిక ఈ విషయం తెలిపింది. ఉద్యోగులు ఇంత పెద్దఎత్తున వలస పోవటం ఈ బ్యాంకుల నిర్వహణకు పెద్ద సమస్యగా మారనుందని హెచ్చరించింది. కొన్ని ప్రైవేట్ బ్యాంకులు, స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు (ఎస్ఎఫ్‌బీ)ల్లో ఈ వలసల సమస్య మరింత ఎక్కువగా ఉంది.

పీఎస్‌బీలను మించిన సిబ్బంది: ప్రస్తుతం ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ)తో పోలిస్తే ప్రైవేట్ బ్యాంకుల్లో పని చేసే ఉద్యోగులే ఎక్కువ. 2024 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరాంతానికి పీఎస్‌బీల్లో 7,64,679 మంది పని చేస్తుంటే.. ప్రైవేట్ బ్యాంకుల్లో 8,46,530 మంది పని చేస్తున్నారు. 2013-14 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది చాలా ఎక్కువ. అప్పట్లో పీఎస్‌బీల్లో 8,42,813 మంది పనిచేస్తుంటే ప్రైవేట్ బ్యాంకుల్లో పని చేస్తున్న సిబ్బంది 3,03,856 మాత్రమే. పెద్దఎత్తున ఉద్యోగులు మానేయడం, ఒక్కో ఉద్యోగి ద్వారా సమకూరే సగటు టర్నోవర్‌ని దెబ్బతీస్తోంది. దీనివల్ల ఖాతాదారుల సేవలకూ ఇబ్బంది ఏర్పడుతోంది. దీనివల్ల ప్రైవేట్ బ్యాంకుల నియామకాల ఖర్చులూ పెరిగి పోతున్నాయి' అని ఆర్‌బీఐ నివేదిక పేర్కొంది.

ఇవే నివారణ చర్యలు: ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు ప్రైవేట్ బ్యాంకులు తీసుకోవాల్సిన చర్యలూ ఆర్‌బీఐ నివేదిక సూచించింది. విస్తృత శిక్షణ, ప్రమోషన్ అవకాశాలు పెంచడం, ప్రత్యేక ప్రోత్సాహకాలు, సిబ్బంది అదే బ్యాంకులో దీర్ఘకాలం పాటు పనిచేసేందుకు అనువైన వాతావరణం కల్పించడం వంటి వ్యూహాత్మక చర్యలు తీసుకోవాలని ఆర్‌బీఐ సూచించింది.

గోల్డ్ లోన్స్‌పై జర జాగ్రత్త: పసిడి రుణాల మంజూరు విషయంలో బ్యాంకులు ఇప్పటికీ కొన్ని తప్పిదాలు చేయడాన్ని ఆర్‌బీఐ ఎత్తి చూపింది. ముఖ్యంగా థర్డ్ పార్టీలు ఈ రుణాల మదింపు, వాటిపై పర్యవేక్షణ సరిగా లేదని స్పష్టం చేసింది. నిర్ణీత కాల వ్యవధిలో బ్యాంకులు ఈ లోపాలను సరిదిద్దుకోవాలని సూచించింది.

బిజినెస్

ఇంధనంపై ఎక్సైజ్ సుంకం తగ్గించాలి

సీఐఐ

న్యూఢిల్లీ: వినియోగాన్ని ఉత్తేజితం చేయడానికి ఇంధనంపై ఎక్సైజ్ సుంకం తగ్గించాలని భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ప్రభుత్వానికి సూచించింది. ఇంధన ధరలే ద్రవ్యోల్బణం అదుపు తప్పడానికి కారణమని, ఫలితంగా అల్పాదాయ వర్గాల వారు తీవ్రంగా ప్రభావితమవుతున్నారని పేర్కొంది. అలాగే రూ.20 లక్షల లోపు వార్షికాదాయం ఉన్న వారిపై వ్యక్తిగత ఆదాయపు పన్ను తగ్గించే విషయం కూడా పరిశీలించాలని, దానివల్ల కూడా వినియోగం పెరిగి అధిక పన్ను వసూళ్లు వస్తాయని సూచించింది. వ్యక్తిగత ఐటీ చెల్లింపుదారులపై గరిష్ఠ మార్జినల్ రేట్ 42.74% ఉంటే సాధారణ కార్పొరేట్ పన్ను రేటు 25.17% ఉన్నదని, ఈ వ్యత్యాసం తగ్గించాలని కోరింది.

ఏప్రిల్‌లో నవీముంబై విమానాశ్రయం ప్రారంభం

ముంబై: నిర్మాణంలో ఉన్న నవీ ముంబై విమానాశ్రయం వచ్చే ఏడాది ఏప్రిల్ 17న ప్రారంభం కావచ్చని అదానీ ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్ సీఈఓ అరుణ్ బన్సల్ తెలిపారు. ఆదివారం ఈ విమానాశ్రయంలోని 26/08 రన్‌వేపై ఇండిగో ఏ320 ప్రయాణికుల విమానం విజయవంతంగా దిగింది. విమానాశ్రయం వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించేందుకు ఏరోడ్రోమ్ లైసెన్సు ఇవ్వడానికి ఈ ప్రయోగం మార్గం సుగమం చేస్తుంది. మే ద్వితీయార్ధం నుంచి ఈ విమానాశ్రయం నుంచి సాధారణ రాకపోకలు ప్రారంభించాలని తాము భావిస్తున్నట్టు చెప్పారు. మొదటి ప్రయోగం విజయవంతమైన తర్వాత కొన్ని విధివిధానాలు పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు.

అభివృద్ధే మన తారక మంత్రం

- అతి నియంత్రణలతో అనర్థమే
- పోటీ సామర్థ్యం పెంచుకోవాలి


ఉదయ్ కోటక్

న్యూఢిల్లీ: వచ్చే సంవత్సరాని (2025)కి సుస్థిర అభివృద్ధే మన లక్ష్యం కావాలని ప్రముఖ బ్యాంకర్ ఉదయ్ కోటక్ అన్నారు. ఈ మేరకు సోషల్ మీడియా వెబ్‌సైట్ 'ఎక్స్'లో తన అభిప్రాయాలను పోస్టు చేశారు. దేశాన్ని సుసంపన్న దేశంగా తీర్చిదిద్దాలంటే అభివృద్ధి ఒక్కటే మార్గమన్నారు. ఇందుకోసం ఆయన ప్రత్యేక రోడ్‌మ్యాప్‌ను సూచించారు. అతి నియంత్రణలను తొలగించి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని కోరారు. అప్పుడే మన పారిశ్రామికవేత్తల అసలు సిసలు సామర్థ్యం బయట పడుతుందన్నారు.

పోటీ సత్తా పెంచుకోవాలి: కార్మికుల ఉత్పాదకత పెంచుకోవడం ద్వారా అంతర్జాతీయ పోటీకి తగ్గట్టు మన పరిశ్రమలు ఎదగాలని ఉదయ్ కోటక్ సూచించారు. వాణిజ్య రక్షణ విధానాలతో స్వల్పకాలిక లాభాలే తప్ప దీర్ఘకాలంలో ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. ఈ రక్షణ విధానాలు దీర్ఘకాలం కొనసాగితే మన పరిశ్రమల పోటీ సామర్థ్యమూ దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఆర్థిక స్థిరత్వం కోసం ద్రవ్యలోటుతో పాటు మూలధన ఖాతా లోటును (సీఏడీ) తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు.

'రక్షణ'తోనే సౌభాగ్యం: దేశ రక్షణ, భద్రతలపై ప్రభుత్వం మరింత దృష్టి పెట్టాలని కోటక్ సూచించారు. ఈ రెండూ ఉంటేనే దేశ సౌభాగ్యానికి అర్థం ఉంటుందన్నారు. అక్రమాలు, గాలి బుడగలు ఏర్పడితే తప్ప ప్రభుత్వం స్టాక్ మార్కెట్లో జోక్యం చేసుకోకూడదని స్పష్టం చేశారు. సెప్టెంబరు త్రైమాసికంలో జీడీపీ వృద్ధి రేటు ఏడు త్రైమాసికాల కనిష్ఠ స్థాయి 5.4 శాతానికి పడిపోయింది. ఈ నేపథ్యంలో కోటక్ ఈ సూచనలు చేయడం విశేషం.

కన్సాలిడేషన్ కొనసాగింపు..!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మిశ్రమంగా కదలాడే అవకాశం ఉంది. బెంచ్‌మార్క్ సూచీల్లో కన్సాలిడేషన్ కొనసాగనుంది. ఇప్పటికిప్పుడు సూచీలు మెరుగ్గా రాణించకపోవచ్చు. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందితేనే సూచీలకు నిర్ణయాత్మక గమనం ఉంటుంది. ఎఫ్ఐఐలు వెళ్లిపోవటం, రూపాయి బలహీనపడటం ప్రతికూల అంశాలు.

స్టాక్ రికమండేషన్స్

క్యాంపస్ యాక్టివ్‌వేర్: రెండేళ్లుగా డౌన్‌ట్రెండ్‌లో కొనసాగుతున్న ఈ షేరు ప్రస్తుతం వాల్యూజోన్‌లో ట్రేడవుతోంది. టర్న్ అరౌండ్ కనిపిస్తోంది. రిలేటివ్ స్ట్రెంత్ పెరుగుతోంది. గత శుక్రవారంతో షేరు 4.17 శాతం లాభంతో రూ.315 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.310/300 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.345/375 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.290 స్థాయిని స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

లారస్ ల్యాబ్స్: ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అప్‌ట్రెండ్‌లో కొనసాగుతున్న ఈ షేరు ప్రస్తుతం కీలక నిరోధ స్థాయికి చేరుకుంది. నెగటివ్ మార్కెట్లోనూ ఈ షేరు బలం ప్రదర్శించింది. చివరి నాలుగు సెషన్లలోనూ లాభపడింది. గత శుక్రవారం 2.82 శాతం లాభంతో రూ.586 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.580 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.655 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.560 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

లుమాక్స్ ఆటో: ప్రస్తుతం ఈ షేరు జీవితకాల గరిష్ఠ స్థాయిలో ట్రేడవుతోంది. దిద్దుబాటు జరగటతో డిమాండ్ పెరుగుతోంది. పైగా ప్రతి త్రైమాసికంలోనూ మెరుగైన ఫలితాలు విడుదల చేస్తోంది. గత శుక్రవారం ఈ షేరు 2.73 శాతం లాభంతో రూ.637 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.630/610 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.670/690 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.575 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

లూపిన్: ఈ షేరు జీవితకాల గరిష్ఠ స్థాయిలో కొనసాగుతోంది. పైగా 2016 నాటి నిరోధాన్ని బ్రేక్ చేసింది. హెడ్ లైన్ సప్లయ్ ముగిసినట్టే కనిపిస్తోంది. గత శుక్రవారం 2.09 శాతం లాభంతో రూ.2,227 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.2,200/2,180 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.2,350 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,140 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

అరబిందో ఫార్మా: ఈ ఏడాది ఆగస్టులో జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత ఈ కౌంటర్‌లో 30 శాతం వరకు కరెక్షన్ జరిగింది. ప్రస్తుతం బేస్ ఏర్పడుతోంది. అక్యుములేషన్‌కు అవకాశం కనిపిస్తోంది. నిఫ్టీతో పోల్చితే బలం పుంజుకుంటోంది. గత శుక్రవారం రూ.1,269 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,250 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.1,360/1,380 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,220 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.


- మూర్తి నాయుడు పాదం, మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

తదుపరి నిరోధం 24,000

టెక్ వ్యూ


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం మైనర్ పుల్‌బ్యాక్ రికవరీ సాధించి ముందు వారంతో పోల్చితే 225 పాయింట్లు లాభపడింది. అయితే గత వారం 24,000-23,600 పాయింట్ల మధ్యన పరిమిత పరిధిలోనే కదలాడింది. ప్రస్తుతం 23,800 వద్ద అప్రమత్త ధోరణిలో నిలిచి ఉంది. గత వారం మిడ్ క్యాప్-100 సూచీ 73 పాయింట్లు, స్మాల్ క్యాప్-100 సూచీ 40 పాయింట్ల స్వల్పలాభంతో ఫ్లాట్‌గా ముగిశాయి. టెక్నికల్‌గా మార్కెట్ ఇటీవల సాధించిన గరిష్ఠ, కనిష్ఠ స్థాయిల నడుమన నిలిచి ఉండడం అనిశ్చిత ధోరణిని సూచిస్తోంది. ప్రస్తుత స్థితిలో మరింత కన్సాలిడేషన్ అవసరం. స్థూల ట్రెండ్ మాత్రం ఇంకా బలహీనంగానే ఉంది. గత శుక్రవారం గరిష్ఠ స్థాయిల్లో బలహీన ధోరణి ప్రదర్శించడం కూడా మరింత బలహీనత ఉండనేందుకు సంకేతం. శుక్రవారం అమెరికన్ స్టాక్‌మార్కెట్లో ఏర్పడిన బలహీన ట్రెండ్ కారణంగా ఈ వారంలో భారత మార్కెట్ అప్రమత్తంగా కదలాడే ఆస్కారం ఉంది.

బుల్లిష్ స్థాయిలు: నిఫ్టీకి ప్రధాన స్వల్పకాలిక నిరోధం 24,000. ఇక్కడే గత కొన్ని వారాలుగా పలు ప్రయత్నాలు చేసి మార్కెట్ విఫలమవుతూ వస్తోంది. స్వల్పకాలిక సానుకూలత కోసం మార్కెట్ ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకుని తీరాలి. ప్రధాన నిరోధ స్థాయిలు 24300, 24,550.

బేరిష్ స్థాయిలు: మార్కెట్‌కు 23,650 వద్ద మైనర్ మద్దతు ఉంది. ఇదే గత గురువారం ఏర్పడిన బాటమ్. ఈ స్థాయి కన్నా దిగజారితే మరింత బలహీనపడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 23,500. సానుకూలత కోసం ఇక్కడ నిలదొక్కుకుని తీరాలి. విఫలమైతే స్వల్పకాలిక బలహీనత మరింతగా కొనసాగుతుంది.

బ్యాంక్ నిఫ్టీ: గత వారం ఈ సూచీ టెక్నికల్ బౌన్స్‌బ్యాక్ సాధించి 550 పాయింట్ల స్వల్ప లాభంతో 51,300 వద్ద ముగిసింది. సానుకూలత కోసం ప్రధాన నిరోధం 51,700 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన స్వల్పకాలిక నిరోధం 52,000. బలహీనత ప్రదర్శించినా సానుకూలత కోసం ప్రధాన మద్దతు స్థాయి 51,000 వద్ద నిలదొక్కుకుని పాజిటివ్ కన్సాలిడేషన్ సాధించాలి.

పాటర్న్: నిఫ్టీ ప్రస్తుతం 200 డిఎంఎ వద్ద పరీక్ష ఎదుర్కొంటోంది. సానుకూలత కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. సానుకూలత కోసం 24,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" కన్నా పైన నిలదొక్కుకోవడం తప్పనిసరి. 23,500 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద ప్రధాన మద్దతు ఉంది. ఇక్కడ నిలదొక్కుకుంటే సానుకూల ధోరణి ఏర్పడుతుంది.

టైమ్ : ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	23,930, 24,000
మద్దతు	23,690, 23,650

రైతు భరోసా ఎవరికి?

(మొదటిపేజీ తరువాయి)

ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు రైతుభరోసా ఇవ్వొద్దనే అభిప్రాయాలు వ్యక్తమైన విషయం ప్రస్తావనకు వచ్చింది. అయితే, ఐటీ చెల్లించే సింగరేణి ఉద్యోగులు ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో సుమారు 4 లక్షల మంది ఉన్నారని, వీరందరికి ఇవ్వకపోతే ఇబ్బంది అవుతుందనే అభిప్రాయాలు వ్యక్తమైనట్లు సమాచారం. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పీఎం- కిసాన్ పథకం మార్గదర్శకాలు కూడా ఉపసంఘం భేటీలో చర్చకు వచ్చాయి. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదార్లు, ఐదేళ్లలో మూడు సార్లు లేదా వరుసగా రెండేళ్లు ఐటీ చెల్లించినవారు, వైద్యులు, ఇంజినీర్లు, న్యాయవాదులు, సీఏలు, ఆర్కిటెక్టులు వంటి వృత్తి నిపుణులకు పీఎం- కిసాన్ పథకాన్ని వర్తింపచేయటం లేదు. అయితే, దీనిని రాష్ట్రంలో పూర్తిగా అనుసరించలేమని, కొన్ని వర్గాలను మినహాయించి మిగిలిన వర్గాలకు రైతుభరోసా ఇవ్వాలని మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు దాదాపు ఏకాభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. అందులో తప్పనిసరిగా సింగరేణి ఉద్యోగులు, నాలుగో తరగతి ఉద్యోగులు ఉండేలా చూడాలని భావించారు.

కటాఫ్ పెట్టినా.. అందరికీ వర్తించేలా!

గడిచిన ఆరేళ్లలో పెట్టుబడి సాయం పొందిన రైతుల సంఖ్య, సాగవుతున్న భూ విస్తీర్ణం, బడ్జెట్ కేటాయింపులపైనా చర్చించారు. మొత్తం కలిపి రూ.80,453 కోట్లు చెల్లించగా... ఇందులో సాగు చేయని భూములకు రూ.21,284 కోట్లు చెల్లించినట్లు వ్యవసాయశాఖ అధికారులు నివేదికలో పేర్కొన్నారు. ఈ అంశంపై ఉపసంఘం సభ్యులు దృష్టి సారించారు. సాగుకు యోగ్యంకాని భూములకు ఎట్టి పరిస్థితుల్లో రైతుభరోసా ఇవ్వొద్దని తీర్మానించారు. కొండలు, గుట్టలు, రాళ్లు, రప్పలు, స్థిరాస్తి వెంచర్లు, రహదారుల భూసేకరణలో పోయిన భూములకు కూడా గత ప్రభుత్వంలో ఇచ్చారని, ఇలాంటి జాబితాలో ఉన్న భూములకు రైతుభరోసా ఇవ్వకూడదని ఏకాభిప్రాయానికి వచ్చారు. సాగు చేసిన భూములకు మాత్రమే రైతుభరోసా ఇచ్చే పక్షంలో... సంపన్నులకు, భూస్వాములకు ఇవ్వాలా? వద్దా? అనే చర్చ కూడా వచ్చింది. పదుల ఎకరాల్లో భూములున్న వారి సంగతేంటి? కటాఫ్ పెట్టాలా? కటాఫ్ పెడితే ఎన్ని ఎకరాలకు? తదితర అంశాలపైనా చర్చించారు. 10 ఎకరాల వరకు కటాఫ్ పెడితే.. 12 ఎకరాలున్న రైతులకు 10 ఎకరాలకు రైతు భరోసా ఇచ్చి మిగిలిన రెండెకరాలకు మినహాయించాలనే ప్రతిపాదన వచ్చింది.

విధివిధానాల ఖరారు తర్వాతే బడ్జెట్ లెక్కలు

కాగా, వ్యవసాయశాఖ అధికారులు స్లాబుల వారీగా రూపొందించిన నివేదికపై ప్రజెంటేషన్ ఇచ్చారు. ఐదు, ఆరు, ఏడున్నర, పది ఎకరాల వారీగా కటాఫ్ నిర్ణయించి.. ఒక్కోదానికి ఎంత బడ్జెట్ అవుతుంది? అనే గణాంకాలు వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో సుమారు 70 లక్షల మంది రైతులకు రైతుబంధు ఇచ్చారు. ఇందులో 20 లక్షల మందిని తొలగిస్తే ఎలా ఉంటుంది? ఎంత బడ్జెట్ తగ్గుతుంది? అన్న వివరాలనూ వ్యవసాయశాఖ అధికారులు ఉపసంఘం ముందు తెలియజేశారు. దీనిపై రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలోనే చర్చించి, తుది నిర్ణయం తీసుకుందామని మంత్రివర్గ ఉపసంఘం భావించింది. విధివిధానాలు పూర్తిగా ఖరారైన తర్వాతే బడ్జెట్ లెక్కలు తేలనున్నాయి. కాగా మంత్రివర్గ ఉపసంఘం మరికొన్ని సార్లు సమావేశం కావాలని కూడా నిర్ణయించింది. రైతులకు సంబంధించిన అంశం కావటం, ప్రతిపక్షాలు అవకాశం దొరికితే విమర్శలు గుప్పించేందుకు సిద్ధంగా ఉన్న నేపథ్యంలో ఆచితూచి నిర్ణయాలు తీసుకోవాలని చర్చించినట్లు తెలిసింది. మరిన్ని భేటీలు నిర్వహించి సమగ్రంగా చర్చించిన తర్వాతే ప్రతిపాదనలు సిఫార్సు చేయాలని ఉపసంఘం సభ్యులు నిర్ణయించారు.



తెలంగాణ రాష్ట్ర సహకార బ్యాంకు 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి తుమ్మల

రుణమాఫీ పొందిన రైతులకు కొత్త రుణాలివ్వాలి: మంత్రి తుమ్మల

హైదరాబాద్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రుణమాఫీ పొందిన రైతులకు కొత్తగా రుణాలివ్వాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బ్యాంకర్లను ఆదేశించారు. యాసంగి పంటల సాగు ప్రారంభమవుతున్న దశలోనే రైతులకు రుణాలివ్వాలని, బ్యాంకుల చుట్టూ రైతులను తిప్పించుకోవద్దని సూచించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర సహకార బ్యాంకు కార్యాలయాన్ని మంత్రి తుమ్మల ఆదివారం సందర్శించారు. రుణమాఫీ, బ్యాంకు పనితీరు, ఆర్థిక లావాదేవీలపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జిల్లా సహకార బ్యాంకుల్లో పాలక వర్గాలు, అధికారుల నిర్లక్ష్యంతో కొన్ని తప్పులు జరిగాయని, అలాంటివి పునరావృతం కావొద్దని మంత్రి సూచించారు. 2025 సంవత్సరం సహకార సంఘాలకు చాలా ప్రత్యేకమైనదని, దానికి తగినట్లుగా బ్యాంకర్లు అద్భుతమైన పనితీరు చూపించి రైతుల పురోగతిలో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహకార బ్యాంకు చైర్మన్ మార్నేని రవీంద్రావు, ఎండీ డాక్టర్ బి. గోపి తదితరులు పాల్గొన్నారు.

నేనున్నాగా.. బాగా చదువుకో..!

» పేద విద్యార్థినికి మంత్రి కోమటిరెడ్డి భరోసా

హైదరాబాద్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): 'నువ్వేం భయపడకు.. నేనున్నాగా.. నువ్వు బాగా చదువుకో.. అండగా నేనుంటా' అంటూ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఓ పేద విద్యార్థినికి భరోసానిచ్చారు. ఆమెకు రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అందించారు. చొల్లేటి ప్రణవి అనే విద్యార్థినికి ఇటలీలోని ప్రఖ్యాత విద్యాసంస్థ 'పాలిటెక్నికో డి టోరినో (పాలిటో) కాలేజీలో ఆర్కిటెక్చర్ కన్‌స్ట్రక్షన్‌లో మాస్టర్స్(పీజీ) చేసేందుకు సీటు వచ్చింది. అయితే ప్రణవి కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే కావడం.. ఆమెను దిక్కుతోచని స్థితిలో పడేసింది. ఈ నేపథ్యంలోనే విషయం తెలిసిన మంత్రి కోమటిరెడ్డి తక్షణమే స్పందించారు. ఆదివారం ప్రణవి కుటుంబాన్ని హైదరాబాద్ నివాసానికి పిలిపించుకున్నారు. ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా తక్షణ సాయంగా రూ.లక్ష చెక్కును అందజేశారు. ప్రతిభ కలిగిన ఏ విద్యార్థి చదువు కూడా ఆగిపోకూడదని, చదువు జీవితాలను మార్చే ఆయుధమని మంత్రి ఈ సందర్భంగా అన్నారు.

నేడు అసెంబ్లీ ప్రత్యేక సమావేశం

» మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించేందుకే

హైదరాబాద్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి సంతాపం తెలపడానికి సోమవారం శాసనసభ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. తెలంగాణ ఏర్పాటుకు ప్రధానిగా మన్మోహన్ సింగ్ చొరవ తీసుకున్నందుకు కృతజ్ఞతగా అసెంబ్లీలో నివాళులర్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉదయం 10 గంటలకు సభ సమావేశం ప్రారంభం కానుంది. సీఎం రేవంత్‌రెడ్డి సంతాప తీర్మానం ప్రవేశపెట్టి ప్రసంగించనున్నారు. ఈ ప్రత్యేక సమావేశాల ఏర్పాట్లను స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌తో కలిసి శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఆదివారం పరిశీలించారు.

పీవీని కాంగ్రెస్ అవమానించింది

» పీవీ సోదరుడు పీవీ మనోహర్‌రావు

భీమదేవరపల్లి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌కు ఎంతో చేసిన పీవీ నర్సింహారావు మరణాంతరం ఆ పార్టీ అవమానించిందని పీవీ సోదరుడు పీవీ మనోహర్‌రావు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పీవీ భౌతికకాయాన్ని ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలోకి కూడా అనుమతించలేదని వాపోయారు. ఆదివారం రాత్రి ఆయన విలేకరులతో ఫోన్‌లో మాట్లాడుతూ తన వేదన తెలిపారు. దేశానికి ప్రధానులుగా చేసిన వారు చనిపోయిన అనంతరం యమున నది పక్కన అంత్యక్రియలు నిర్వహించి, అక్కడే స్మారక ఘాట్‌ను నిర్మించడం ఆనవాయితీ అని చెప్పారు. పీవీ భౌతిక కాయాన్ని మాత్రం హైదరాబాద్‌కు తరలించారని దాంతో ఇక్కడే అంత్యక్రియలు నిర్వహించామని పేర్కొన్నారు. పీవీ స్మారక చిహ్నాన్ని నిర్మిస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ఇప్పటి వరకు నిర్మించలేదని, ఆయనకు భారతరత్న కూడా ఇవ్వలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

3 నుంచి నుమాయిష్

అఫ్జల్‌గంజ్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా పేరొందిన నుమాయిష్.. 84వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనకు రంగం సిద్ధమైంది. హైదరాబాద్, నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఏటా జనవరి 1 నుంచే ప్రారంభమయ్యే నుమాయిష్ ఈసారి కాస్త ఆలస్యంగా జనవరి 3వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఫిబ్రవరి 15 వరకు ఈ ప్రదర్శన కొనసాగనుంది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సంతాప దినాలు కొనసాగుతుండడం వల్లే ఈసారి ఆలస్యంగా ప్రారంభమవుతుంది. సీఎం రేవంత్ రెడ్డి జనవరి 3న నుమాయిష్‌ను ప్రారంభిస్తారని ఎగ్జిబిషన్ సొసైటీ ఆదివారం ప్రకటించింది. ఈ మేరకు ఎగ్జిబిషన్ మైదానంలోని గాంధీ సెంటెనరీ హాల్‌లో సొసైటీ కోశాధికారి డాక్టర్ బి.ప్రభాశంకర్, ఉపాధ్యక్షుడు కె. నిరంజన్, కార్యదర్శి బి.సురేందర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి మోహన్ విలేకరులతో మాట్లాడారు. 26 ఎకరాల మైదానంలో జరిగే ఈ ఎగ్జిబిషన్‌లో రెండు వేలకు పైగా స్టాళ్లలో వివిధ రకాల ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాలు జరగనున్నాయని తెలిపారు. నుమాయిష్ ప్రవేశ రుసుము ఇన్నాళ్లూ రూ.40 చొప్పున వసూలు చేశామని, ఈసారి ప్రవేశ రుసుమును రూ.10 పెంచి రూ.50 చేశామని నిర్వాహకులు ప్రకటించారు.

త్వరలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి నియామకం!

» జనవరిలో పార్టీ జిల్లా అధ్యక్షుల పదవుల భర్తీ!

» సంస్థాగత ఎన్నికలపై సమీక్ష

న్యూఢిల్లీ, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): బీజేపీ తెలంగాణ అధ్యక్షుడి నియమాకం వచ్చే నెల రెండో వారంలోగా పూర్తికానుంది. జనవరి మొదటి వారంలో జిల్లాల అధ్యక్ష పదవుల భర్తీ, ఆ తర్వాత రాష్ట్ర అధ్యక్షుడి నియమాకం జరుగుతుందని పార్టీ సీనియర్ నేత ఒకరు తెలిపారు. ఆదివారం బీజేపీ కేంద్ర కార్యాలయంలో సంస్థాగత ఎన్నికలపై సమీక్షా సమావేశం జరిగింది. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అధ్యతన జరిగిన ఈ భేటీలో పార్టీ ప్రధాన కార్యదర్శులు, ఆయా రాష్ట్రాల ఇన్‌చార్జులు, అధ్యక్షులు పాల్గొన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ లక్ష్మణ్, కేంద్ర మంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, పార్టీ ఏపీ అధ్యక్షురాలు పురందేశ్వరి హాజరయ్యారు. మాజీ ప్రధాని మన్మోహన్ మృతికి సంతాపంగా బీజేపీ నేతలు మౌనం పాటించారు. ఈ భేటీలో పార్టీ బూత్, మండల స్థాయి కమిటీల భర్తీపై నివేదికను నడ్డాకు కిషన్ రెడ్డి ఇచ్చారు. మాజీ ప్రధాని వాజ్‌పేయి శత జయంతిని పురస్కరించుకుని వచ్చే ఏడాది డిసెంబరు 25 వరకు సుపరిపాలనా సంవత్సరం, పార్లమెంటులో కేంద్రం అంబేడ్కర్‌ను కించపరిచిందన్న కాంగ్రెస్ ఆరోపణకు కౌంటర్‌గా ఏడాది పాటు సంవిధాన్ పర్వ్ జరపాలని బీజేపీ నిర్ణయించింది.

రంగారెడ్డి జిల్లాకు ఎయిమ్స్ వర్సిటీ

(మొదటిపేజీ తరువాయి)

స్పష్టం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం రంగారెడ్డి జిల్లా చేగూరులోని కన్హా శాంతివనాన్ని సందర్శించారు. శాంతివనం నిర్వాహకుడు కమలేశ్ పటేల్‌తో సుమారు రెండు గంటల పాటు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎయిమ్స్ వర్సిటీ ఏర్పాటుపై చర్చ జరిగింది. అయితే వర్సిటీ ఏర్పాటుకు అవసరమైన భూమిని ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని కమలేశ్ సీఎంతో చెప్పినట్లు తెలిసింది. కన్హా శాంతివనం తెలంగాణకు గర్వకారణంగా నిలుస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కన్హా శాంతివనం అద్భుత ప్రపంచమని.. ఇక్కడ పెద్దఎత్తున మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం అభినందనీయమని సీఎం కొనియాడారు. శాంతివనం గురించి విన్నానని, ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తుంటే ఎంతో ఆహ్లాదకరంగా ఉందని చెప్పారు. యోగా, ధ్యానం, పర్యావరణ సంరక్షణ గురించి ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల వల్ల దేశానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్న శాస్త్రవేత్తలను ప్రోత్సహించడంతో పాటు కాలుష్య నివారణకు చేపడుతున్న కార్యక్రమాలు బాగున్నాయని కమలేశ్‌ను ప్రశంసించారు. అలాగే శాంతివనంలో సాఫ్ట్ స్కిల్స్, కళ్లకు గంతలు కట్టుకుని రంగులను గుర్తించడం, పదాలను చదవడం వంటి విద్యార్థుల నైపుణ్యాలను చూసిన సీఎం.. వారిని అభినందించారు. శాంతివనంలోని రెయిన్ ఫారెస్ట్, టిష్యూ కల్చర్ ల్యాబ్‌ను పరిశీలించారు. అనంతరం కమలేశ్ పటేల్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి రేవంత్‌రెడ్డి మొక్కను నాటారు.



శాంతివనంలో బ్యాటరీ కారులో సీఎం రేవంత్

బ్యాటరీ కారులో వనంలో తిరిగిన సీఎం

సుమారు 1400 ఎకరాల్లో విస్తరించి ఉన్న కన్హా శాంతివనాన్ని సీఎం రేవంత్ బ్యాటరీ కారులో కూర్చొని కలియతిరిగారు. ఆయన వెంట షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి ఉన్నారు. శాంతివనంలో ఉన్న వివిధ దేశాల మొక్కలు, వాటి అవసరాల గురించి కమలేశ్ పటేల్‌ను అడిగి తెలుసుకున్నారు. ఇంతటి ప్రశాంత వాతావరణాన్ని కల్పించడం పట్ల సీఎం హర్షం వ్యక్తం చేస్తూ తీరిక ఉంటే మళ్లీ వచ్చేందుకు ప్రయత్నం చేస్తానని చెప్పారు. కాగా, సీఎం కోసం షాద్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సుమారు 3 గంటల పాటు ఆయన రాక కోసం ఎదురు చూశారు. శాంతివనం నుంచి తిరిగి వెళ్లేటప్పుడు సీఎం రేవంత్ పార్టీ కార్యకర్తలకు అభివాదం చేశారు.

శాంతివనం ప్రతినిధులతో మంత్రి పొన్నం భేటీ

సీఎం రేవంత్ కంటే ముందుగా కన్హా శాంతివనాన్ని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సందర్శించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి శాంతివనం ప్రతినిధులతో సమావేశమయ్యారు. వారు చేపడుతున్న కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ధ్యాన కేంద్రాన్ని తెలంగాణలో నిర్మించడం ఇక్కడి ప్రజల అదృష్టమని చెప్పారు.

రైజింగ్ తెలంగాణ కల సాకారం

హైదరాబాద్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఏర్పడిన ప్రజాప్రభుత్వ సంకల్పంతో రైజింగ్ తెలంగాణ కల సాకారమవుతోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల(ఎఫ్‌డీఐ) సాధనలో రాష్ట్రం గర్వించదగ్గ వృద్ధిని సాధించిందని హర్షం వ్యక్తం చేశారు. ప్రమాణ స్వీకారం చేసిన మొదటి నెల నుంచే దావోస్, అమెరికా, దక్షిణ కొరియాల్లో పర్యటించి, పెట్టుబడుల సాధన కోసం చేసిన ప్రయత్నాలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని తెలిపారు. 2023 ఏప్రిల్-సెప్టెంబరుతో పోలిస్తే.. 2024 ఏప్రిల్-సెప్టెంబరులో అద్భుత లక్ష్యాలను సాధించామని, రూ.12,864 కోట్ల ఎఫ్‌డీఐల సాధనతో 33 శాతం వృద్ధిని నమోదు చేశామని వివరించారు. ఈ పురోగతిలో సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతూ సీఎం రేవంత్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు.

ఇబ్బందులున్నా వెనక్కుతగ్గం

రైతు భరోసా అందజేస్తాం: భట్టి



హైదరాబాద్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా.. ప్రజా ప్రభుత్వం రైతు భరోసా ఇచ్చేందుకు కట్టుబడి ఉందని రైతు భరోసాపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం చైర్మన్, డిప్యూటీ సీఎం భట్టి అన్నారు. ఈ విషయంలో ఇచ్చిన మాట మేరకు ముందుకెళ్తామని స్పష్టం చేశారు. తాము వచ్చాక తొలి ఏడాదిలోనే యాసంగి పంటకు పెట్టుబడి సాయంగా 1.57 కోట్ల ఎకరాలకు రూ.7,625 కోట్లను జమ చేసినట్లు భట్టి గుర్తు చేశారు. బడ్జెట్లో వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.72,659 కోట్లు కేటాయించామని.. రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని ఈ అంకెలు తెలియజేస్తాయని పేర్కొన్నారు. రెండు లక్షల వరకు రుణ మాఫీ కింద రెండు నెలల వ్యవధిలోనే రూ.21 వేల కోట్లను రైతుల ఖాతాల్లో వేసినట్లు తెలిపారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేలా, రైతుల సంక్షేమానికి కృషి చేసేందుకు వ్యవసాయ కమిషన్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రైతు వేదికలను పూర్తిగా వినియోగంలోకి తెచ్చేందుకు, ఆధునికీకరించేందుకు ప్రభుత్వం రైతు నేస్తం కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. 110 రైతు వేదికల్లో రూ.4 కోట్లకు పైగా వెచ్చించి వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రకృతి విపత్తుల బారి నుంచి రైతులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని భట్టి అన్నారు. పంటల బీమా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుందని తెలిపారు. తద్వారా పంటకే కాదు రైతు కుటుంబానికీ భరోసాగా నిలుస్తున్నట్లు వివరించారు.

దివ్యాంగుల పెన్నిధి మిట్టికేఫ్

రాష్ట్రపతి భవన్‌తో పాటు పలు విమానాశ్రయాల్లో ఏర్పాటు

జాతీయ, అంతర్జాతీయ సంస్థల దృష్టిని ఆకర్షిస్తున్న ప్రాజెక్టు

అల్వాల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ కార్మికులకు సాధికారతను కల్పిస్తూ వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రారంభించిన 'మిట్టి కేఫ్' జాతీయ, అంతర్జాతీయ సంస్థల దృష్టిని ఆకర్షిస్తోంది. ఢిల్లీలోని రాష్ట్రపతిభవన్‌తో పాటు దేశంలోని పలు విమానాశ్రయాల్లో ఏర్పాటు చేసిన దాదాపు 40 మిట్టి కేఫ్ బ్రాంచ్‌లు పలువురు దివ్యాంగులకు ఉపాధి కల్పిస్తున్నాయి. కేఫ్‌లో సమోసాలు, చాట్, పకోడి, టీ, కాఫీ, బిస్కెట్లు, శాండ్‌విచ్, ఐస్‌క్రీమ్‌లతో పాటు హస్తకళా వస్తువులను ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. కేఫ్‌లో పనిచేసే ఉద్యోగులకు వారి బాధ్యతను బట్టి నెలకు రూ. 15 వేల నుంచి 50 వేల వరకు అందజేస్తున్నారు. తెలంగాణ సోషల్ ఇంపాక్ట్ గ్రూప్ (టీ-ఎస్ఐజీ) సహకారంతో నిర్వహిస్తున్న మిట్టి కేఫ్ వార్షిక టర్నోవర్ రూ.36 నుంచి రూ.46 లక్షలు ఉంటుందని అంచనా. ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ బ్యాంకింగ్ గ్రూప్ వంటి సంస్థలు కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద ఈ కేఫ్ నిర్వహణకు ఆర్థిక సహకారాన్ని అందిస్తున్నాయి. సికింద్రాబాద్ రాష్ట్రపతి నిలయంలోని కొత్త రిసెప్షన్ సెంటర్ ప్రాంగణంలో ఇటీవల మిట్టి కేఫ్ నూతన బ్రాంచ్‌ను ఏర్పాటు చేశారు. దీనికి అద్దె లేకుండా వీలు కల్పించారు. ఈ కేఫ్‌లో 15 మంది దివ్యాంగులు ఉపాధి పొందుతున్నారు. శీతాకాల విడిది సమయంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కేఫ్‌ను ప్రత్యేకంగా సందర్శించి సిబ్బందిని అభినందించారు.

మన్మోహన్ అంత్యక్రియలపై రాజకీయం సరికాదు

» కేంద్ర మంత్రి బండి సంజయ్



కరీంనగర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ అంత్యక్రియలపై కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేయడం సిగ్గుచేటని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. దీన్‌దయాల్ కోచింగ్ సెంటర్‌లో ఉచితంగా చదువుకుని ఉద్యోగాలు పొందిన పలువురు అభ్యర్థులను కేంద్రమంత్రి కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఎంపీ కార్యాలయంలో ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మన్మోహన్‌సింగ్ ప్రధానిగా ఉన్న పది సంవత్సరాలు సూపర్ పవర్‌గా సోనియా గాంధీ కొనసాగుతూ ఆయనను రబ్బర్ స్టాంపుగా మార్చారని ఆరోపించారు. మన్మోహన్ సేవలను గుర్తించి అధికారికంగా అంత్యక్రియలను నిర్వహించి, ఢిల్లీలోనే స్మారక స్థల్ నిర్మించేందుకు మోదీ ప్రభుత్వం సిద్ధమైందన్నారు. మాజీ ప్రధానిగా పీవీ నర్సింహారావు అంత్యక్రియలు ఢిల్లీలో నిర్వహించకుండా అవమానించిన కాంగ్రెస్‌కు మోదీ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక అర్హత లేదన్నారు. ట్రిపుల్ ఆర్ రోడ్డు నిర్మాణానికి సంబంధించిన టెండర్లను ఆహ్వానించిన కేంద్ర ప్రభుత్వానికి సంజయ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇది రాష్ట్ర ప్రజలకు కేంద్రం ఇచ్చిన సంక్రాంతి కానుక అన్నారు.

కేసీఆర్, కేటీఆర్‌పై హరీశ్‌రావుకు కోపం!

అందుకనే ఓఆర్ఆర్ మీద విచారణ జరిపించాలన్నారు

» ఆయన కోరిక మేరకే సిట్

» గత ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఆర్ఆర్ఆర్‌లో ఆరేళ్ల జాప్యం

» మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే హరీశ్‌రావుకు తన మామ కేసీఆర్, బామ్మర్ది కేటీఆర్‌పై కోపం ఉందని, అందుకే ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్) లీజు టెండర్లపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)తో విచారణ జరిపించాలని అసెంబ్లీలో డిమాండ్ చేశారని రాష్ట్ర ఆర్ అండ్ బీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. హరీశ్‌రావు కోరిక మేరకే సిట్‌ను వేశామన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని రెడ్డి హాస్టల్ పూర్వ విద్యార్థుల సమావేశంలో కోమటిరెడ్డి పాల్గొని ప్రసంగించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఎన్నికలకు ముందు రూ.7,300 కోట్లకు ఓఆర్ఆర్‌ను అమ్ముకుందన్నారు. ఓఆర్ఆర్ నిర్మాణం కోసం అప్పట్లోనే రూ.6,500 కోట్లను వెచ్చిస్తే.. ఆ ప్రాజెక్టును కేసీఆర్ రూ.7,300 కోట్లకు అమ్ముకోవడం దారుణమని విమర్శించారు. ఫార్ములా-ఈ రేసు కేసులో ఒకరో, ఇద్దరో జైలుకు వెళ్లడం ఖాయమని.. చట్టం తన పని తాను చేసుకుంటూ వెళ్తుందని మంత్రి కోమటిరెడ్డి స్పష్టం చేశారు. కేంద్రప్రభుత్వం రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగం పనుల నిర్వహణకు టెండర్లను ఆహ్వానించిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. మార్చిలో పనులు ప్రారంభిస్తామని, పెండింగ్ పనులను ఆలోపు పూర్తిచేస్తామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలోనే కేంద్రం ఆర్ఆర్ఆర్‌ను మంజూరు చేసినా.. నాటి పాలకుల నిర్లక్ష్యంతో ఆరేళ్ల పాటు జాప్యం చోటు చేసుకుందన్నారు. ఈ నేపథ్యంలో తాను, సీఎం రేవంత్‌రెడ్డి పలుమార్లు కేంద్రంతో చర్చించామని, ఇటీవల కేంద్రమంత్రి గడ్కరీని మరోసారి కలిశామన్నారు. 20 రోజుల్లో టెండర్లు పిలుస్తామని గడ్కరీ చెప్పారని, అన్నట్లుగానే టెండర్లను ఆహ్వానించారని కోమటిరెడ్డి తెలిపారు.



మంత్రికి సీఎం రేవంత్ ఫోన్

ఆర్ఆర్ఆర్ ఉత్తరభాగం పనులకు ఎన్‌హెచ్ఏఐ టెండర్లను ఆహ్వానించడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ఫోన్ చేసి అభినందనలు తెలిపారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో 2017లో ఆగిపోయిన ప్రాజెక్టు.. పట్టాలెక్కటంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మీ కృషి, సహకారంతోనే ఇది సాధ్యమైందని సీఎంకు తెలిపారు. ఆదివారం మంత్రి కార్యాలయం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. ఆర్ఆర్ఆర్‌పై కేంద్రం టెండర్లను ఆహ్వానించినందుకు కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీకి సీఎం రేవంత్ తరపున మంత్రి కోమటిరెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

రెడ్డి హాస్టల్‌కు సహకరిస్తా

అంతకుముందు రెడ్డి హాస్టల్ పూర్వ విద్యార్థుల (అల్యూమిని) సమావేశంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రసంగిస్తూ.. ఎంత పని ఒత్తిడితో ఉన్నా హాస్టల్‌కు అవసరమైన సహకారాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు. పూర్వ విద్యార్థుల చైర్మన్‌గా తనను ఎన్నుకున్నందుకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు విద్య అందుబాటులో ఉండాలనే లక్ష్యంతోనే రాజబహదూర్ వెంకటరామారెడ్డి.. రెడ్డిహాస్టల్ తో పాటు పలు విద్యా సంస్థలను స్థాపించారని గుర్తు చేశారు.

మళ్లీ తెలుగు వెలుగులు

ప్రపంచ తెలుగు రచయితల మహాసభల్లో వక్తల ఆశాభావం

విజయవాడ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): భాషాభిమానులు, కవులు, రచయితలు, మేధావులు కోరుతున్నట్టుగా ఆంధ్రప్రదేశ్‌లో అన్ని విద్యాలయాల్లో ప్రాథమిక స్థాయి నుంచి తెలుగు మాధ్యమం అమలు చేయడానికి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయని ఏపీ పర్యాటక, సాంస్కృతి శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. దీనిపై సీఎం చంద్రబాబు సానుకూలంగా ఉన్నారని చెప్పారు. విజయవాడ కేబీఎన్ కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహించిన ప్రపంచ తెలుగు రచయితల ఆరో మహాసభలు ఆదివారం ముగిశాయి. ముగింపు సభకు మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. రాజమహేంద్రవరంలోని బేతిని గ్రంథాలయం, విశాఖలో ఆంధ్ర విశ్వవిద్యాలయం గ్రంథాలయం మన భాషా వికాసానికి, వ్యక్తిత్వ వికాసానికి ఎంతో తోడ్పాటును అందించాయని, వాటిని సాహితీ పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తే నేటితరం పిల్లలకు భాషపై ఆసక్తి పెరుగుతుందని తెలిపారు.

18 తీర్మానాలు ఆమోదం

ప్రపంచ తెలుగు రచయితల ఆరో మహాసభల్లో 18 తీర్మానాలను మహాసభల కార్యదర్శి జీవీ పూర్ణచందు ప్రవేశపెట్టగా ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అవి.. ఇంటా, బయట అన్ని సామాజిక జీవన ప్రామాణికాల్లో తెలుగును ఉపయోగించాలి. సమస్త జీవన విధానాలు, వృత్తుల్లో కనుమరుగైన పదాలను వెలికి తీసే బాధ్యతను రచయితలు తీసుకోవాలి. ఆంగ్ల పదాలకు సమానమైన పదాలను భాషా పండితులు, రచయితలు సృష్టించాలి. ప్రాథమిక విద్య వరకు మాతృభాషలో బోధన జరగాలి. డిగ్రీలో తెలుగును ఒక పాఠ్యాంశంగా బోధించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి. ఇంజనీరింగ్, వైద్య విద్యను మాతృభాషలో బోధించాలనే కేంద్ర విధానాన్ని మహాసభలు స్వాగతించాయి. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 85ను హైకోర్టు కొట్టేయడంతో సుప్రీంకోర్టులో దాఖలు చేసిన ఎస్ఎల్‌పీని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలి. హైకోర్టుల్లో వాద ప్రతివాదనలు, తీర్పులు తెలుగులో జరిగేలా రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థను పటిష్ఠంగా నిర్మించి నిధులు కేటాయించాలి. పాలనా వ్యవహారాల్లో ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులో జరిగేలా చూడాలి. వైసీపీ తెలుగు అకాడమీని తెలుగు, సంస్కృత అకాడమీగా మార్చి, దిగజార్చిన దాని ఔన్నత్యాన్ని తిరిగి పునరుద్ధరించాలి. ఏపీలో తెలుగు వర్సిటీ ఏర్పాటు చేయాలి. సమగ్రమైన లక్ష్యాలతో వివిధ అకాడమీలను పటిష్ఠం చేయాలి. సాంస్కృతిక విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలి. గ్రంథాలయ సంస్థలను పటిష్ఠం చేసి, పుస్తకాలు కొనుగోలు చేయాలి. రాష్ట్ర గ్రంథాలయం, రాష్ట్ర మ్యూజియం ఏర్పాటు చేయాలి. తెలుగు మాధ్యమంలో విద్యాభ్యాసం చేసినవారికి ఉద్యోగాల్లో 5శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి.



మహాసభలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

ప్రభుత్వ శాఖల్లో తెలుగులో ఆదేశాలు

రాజకీయంగా సిద్ధాంతాలు వేరైనప్పటికీ, వాటిని పక్కనపెట్టి మాతృభాష పరిరక్షణ కోసం కలిసికట్టుగా ప్రయాణం చేద్దామని మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. తెలుగు భాషా పరిరక్షణ యజ్ఞంలో తానూ భాగస్వామినవుతానని చెప్పారు. అధికారుల కోసం తెలుగు భాషపై ఓ సదస్సు నిర్వహించాలని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ శాఖల్లో ఆదేశాలు తెలుగులో వచ్చేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సభకు అధ్యక్షత వహించిన సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మాతృభాష పరిరక్షణ కోసం త్యాగాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వాలు కొన్ని చట్టాలు చేసి భాషను నాశనం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి రాజకీయ నేతలు ఉపయోగిస్తున్న భాషపై ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. తెలుగు భాషకు తగినంత పదసంపద లేదని, అందుకే ఆంగ్ల పదాలను తెలుగులోకి జోడిస్తున్నారని సినీ గేయరచయిత అనంతశ్రీరాం అన్నారు. తెలుగు పదసంపదను పెంచుకోవడానికి భాషా పండితులు నిఘంటువును తయారుచేయాలని సూచించారు.

న్యాయవ్యవస్థలో తెలుగు తీర్పులకు 'ఏఐ'

న్యాయవ్యవస్థలో తీర్పులను మాతృభాషలో ఏఐ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) పరంగా ఇవ్వడానికి ప్రయత్నాలు మొదలుపెట్టినట్టు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.కృష్ణమోహనరావు తెలిపారు. 'తెలుగులో న్యాయపాలన' అంశంపై ఆయన మాట్లాడారు. తెలుగులోకి అనువాదం చేసేటప్పుడు ఆంగ్ల పదాలకు సరిపోయే సమానార్థక పద సంపదను సృష్టించుకుని స్థిరీకరించుకోవాలని సూచించారు. తెలుగులో తీర్పును వెలువరించాలంటే అనువాదకులను నియమించుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఆంగ్లంలో తీర్పులు రాయడానికి 6 రోజుల సమయం పడితే, తెలుగులో రాయడానికి 40రోజులు పట్టిందని జస్టిస్ కె.మన్మథరావు చెప్పారు. తీర్పులు మాతృభాషలో వెలువరించాలంటే ముందుగా ప్రభుత్వాలు చట్టాలను తెలుగులోకి అనువదించాలని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ అన్నారు. న్యాయవ్యవస్థలో 95శాతం మంది తెలుగులోనే మాట్లాడతారని, కాగితాలు తెలుగులో ఉన్నప్పటికీ ఇంగ్లిష్‌లో మాట్లాడుతున్నామంటే మనం ఏ స్థాయికి దిగజారిపోయామో ఆత్మపరిశీలన చేసుకోవాలని తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ భీమపాక నగేష్ పేర్కొన్నారు.



కొమురవెల్లి మల్లన్న కల్యాణం జరుపుతున్న వీరశైవార్చకులు

మల్లన్న మనువాడె.. కొమురెల్లి పులకించె!

» వైభవంగా మల్లికార్జునుడి కల్యాణం

చేర్యాల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి క్షేత్రంలో కొలువైన కోరమీసాల కొమురవెల్లి మల్లికార్జున స్వామి కల్యాణం ఆదివారం సంప్రదాయబద్ధంగా, అంగరంగ వైభవంగా జరిగింది. మార్గశిర మాసం చివరి ఆదివారాన్ని పురస్కరించుకుని ఆలయం తోటబావి ప్రాంగణంలో సర్వాంగసుందరంగా ముస్తాబు చేసిన ప్రత్యేక మండపంలో మల్లన్న.. మేడలాదేవీ, కేతలమ్మను వివాహమాడారు. ఆర్‌జేసీ రామకృష్ణారావు పర్యవేక్షణలో ఆలయ ఈవో బాలాజీశర్మ, ప్రత్యేకాధికారి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో వీరశైవ ఆగమ పండితులు కల్యాణాన్ని కనుల పండువగా జరిపారు. మల్లన్న కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా తరలిరావడంతో కొమురవెల్లి పరిసరాలు కిక్కిరిసిపోయాయి. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి సందర్భంగా ప్రభుత్వం సంతాప దినాలు పాటిస్తున్న నేపథ్యంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరు కాకపోవడంతో వీర శైవార్చకులే పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. కాగా, 10-45 గంటలకు మల్లన్న కల్యాణం జరగాల్సి ఉండగా, 2 గంటలపాటు ఆలస్యమవడం పట్ల భక్తులు అసహనం వ్యక్తం చేశారు.

మోదీ-షాలది ఫాసిస్టు పాలనే!

» సదస్సులో మార్క్సిస్టు సిద్ధాంతవేత్త అభినవ్ సిన్హా స్పష్టీకరణ

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): "భారతదేశంలో ప్రస్తుతం కొనసాగుతున్న నరేంద్రమోదీ-అమిత్‌షాల పాలన నిస్సందేహంగా ఫాసిస్టు (నియంత) పాలనేనని మార్క్సిస్టు సిద్ధాంతవేత్త, మజ్దూర్ బిగుల్ పత్రిక సంపాదకుడు అభినవ్ సిన్హా పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో '21వ శతాబ్దంలో ఫాసిజం: కొనసాగుతున్న అంశాలు, నూతన లక్షణాలు మరియు సమకాలీన శ్రామికవర్గ వ్యూహం' అన్న అంశంపై ఏడవ అంతర్జాతీయ అరవింద్ మెమోరియల్ సెమినార్ ఆదివారం ప్రారంభమైంది. ఫాసిజానికి వ్యతిరేకంగా సమర్థవంతమైన శ్రామికవర్గ వ్యూహాన్ని రూపొందించే లక్ష్యంతో అరవింద్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మార్క్సిస్ట్ స్టడీస్ ఈ సెమినార్‌ను ఐదు రోజులపాటు నిర్వహిస్తోంది. దీనికి దేశంలోని వివిధ రాష్ట్రాల నుండే కాక అమెరికా, ఆస్ట్రేలియా, నేపాల్ తదితర దేశాల నుంచి కూడా వందలాది మంది ఉద్యమకారులు, విద్యావేత్తలు, మేధావులు హాజరయ్యారు. సెమినార్ తొలిరోజున అభినవ్ సిన్హా పత్ర సమర్పణ చేశారు. చారిత్రకంగా ఫాసిజంలో వెల్లడైన లక్షణాలను ఈ పేపర్ చర్చించింది. గత శతాబ్దంలో ఇటలీ, జర్మనీలలో ముందుకొచ్చిన ఫాసిజానికి, 21వ శతాబ్దంలో పుట్టిన ఫాసిజానికి మధ్య ఉన్న తేడాను కూడా వివరించింది. దేశంలో మోదీ-షాల పాలన ఫాసిస్టు పాలనేనని ఈ సందర్భంగా అభినవ్ పేర్కొన్నారు. పత్ర సమర్పణ అనంతరం ప్రతినిధులు ఈ అంశంపై విస్తృతంగా చర్చించారు.

రేపటి దాకా పీజీ మెడికల్ ప్రవేశాలకు వెబ్ ఆప్షన్లు

హైదరాబాద్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్యవిద్య కళాశాలలతోపాటు నిమ్స్‌లోని పీజీ వైద్య సీట్ల భర్తీకి ఈ నెల 29 నుంచి 31వరకు మొదటి విడత వెబ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్టు కాళోజీ హెల్త్ యూనివర్సిటీ ప్రకటించింది. దరఖాస్తు ప్రక్రియ ఇప్పటికే ముగియడంతో మొదటి విడత వెబ్ ఆప్షన్లకు వర్సిటీ ఆదివారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈనెల 31వ తేదీ రాత్రి 8 గంటల వరకు మెరిట్ జాబితాలోని అర్హులైన అభ్యర్థులు కళాశాలల వారీగా ఆప్షన్లు నమోదు చేసుకోవాలని వర్సిటీ తెలిపింది. మెరిట్ జాబితా, కళాశాలల వారీగా ఖాళీ సీట్ల వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. మెడికోలకు కేటాయించే సీట్లు సుప్రీంకోర్టు తుది తీర్పునకు లోబడి ఉంటాయని పేర్కొంది. 3,315 మంది అభ్యర్థుల ప్రొవిజనల్ తుది అర్హుల జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచింది.

సీఎం కప్ వాలీబాల్ బాలుర విజేత వరంగల్

» బాలికల విభాగంలో నిజామాబాద్‌కు ప్రథమ బహుమతి

ఖమ్మం స్పోర్ట్స్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు ఆదివారం ఖమ్మం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో ముగిశాయి. ఈ పోటీల్లో బాలుర విభాగంలో వరంగల్ జిల్లా జట్టు ప్రథమ బహుమతి కైవసం చేసుకోగా, బాలికల విభాగంలో నిజామాబాద్ జిల్లా జట్టు ప్రథమ బహుమతిని గెలుకుంది. బాలుర, బాలికల విభాగంలో మహబూబ్‌నగర్ జిల్లా జట్లు రన్నరప్‌గా నిలిచాయి. ఇక ఈ పోటీలకు ఆతిథ్యమిచ్చిన ఖమ్మం జిల్లా బాల, బాలికల జట్లు తృతీయ స్థానంలో నిలిచాయి. బాలుర విభాగంలో రంగారెడ్డి జిల్లా నాలుగో స్థానంలో నిలవగా, బాలికల విభాగంలో కరీంనగర్ జిల్లా నాలుగో స్థానంలో నిలిచింది. మన్మోహన్‌సింగ్ మృతి నేపథ్యంలో బహుమతులను పంపిణీ చేయలేదని, త్వరలోనే ఆ జిల్లాకు పంపిస్తామని ఖమ్మం డీవైఎస్‌వో సునీల్ రెడ్డి తెలిపారు.

ఏజెన్సీలో ఎన్‌ఎంవో వైద్య శిబిరాలు

హైదరాబాద్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): కొమరం భీమ్ స్వాస్థ్య సేవా యాత్ర పేరుతో ఆదిలాబాద్ జిల్లాలో నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్-తెలంగాణ, ఏకలవ్య ఫౌండేషన్ సంయుక్తంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాయి. దాదాపు 180 మంది వైద్యులు బృందంగా ఏర్పడి ఆదిలాబాద్‌లోని కేబీ కాలనీ, మాలెబోరేగావ్, ఆర్కాపూర్‌తో సహా 15 గ్రామాల్లోని 500 మంది ఆదివాసీలకు వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా ఔషధాలు పంపిణీ చేసి.. ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు. తెలంగాణలోని ఏజెన్సీ జిల్లాల్లో రక్తహీనత బాధితులు ఎక్కువగా ఉందన్న జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేను పరిగణనలోకి తీసుకున్న ఎన్‌ఎంవో... వైద్య సేవలు అందించేందుకు ఏజెన్సీ ప్రాంతాలను ఎంచుకుంది. త్వరలో భద్రాచలం, నాగర్ కర్నూల్, ఏటూరు నాగరంలోనూ వైద్య శిబిరాలు నిర్వహిస్తామని ఎన్‌ఎంవో కార్యవర్గ సభ్యుడు డాక్టర్ విజేందర్ తెలిపారు.

దేశంలో 14,320 జన్‌ఔషధీ కేంద్రాలు: కేంద్రం

హైదరాబాద్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఈ ఏడాది నవంబరు చివరికల్లా 14,320 జన్‌ఔషధీ కేంద్రాలు(జేఏకేఎస్) అందుబాటులోకి వచ్చాయని కేంద్ర వైద్యఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ వెల్లడించింది. ప్రధాన్ మంత్రి భారతీయ జన ఔషధీ పరియోజన(పీఎంబీజేపీ)లో భాగంగా ఈ కేంద్రాల్లో 2,047 రకాల ఔషధాలను, 300 సర్జికల్, డివైజ్ ఉత్పత్తులను అందజేస్తున్నట్లు తెలిపింది. వీటి ధరలు బ్రాండెడ్ కంపెనీలతో పోలిస్తే.. 50-80% తక్కువగా ఉన్నాయని పేర్కొంది. గడిచిన పదేళ్లల్లో సుమారు ఈ కేంద్రాల ద్వారా రూ.6,462 కోట్ల విలువైన ఔషధాలను విక్రయించినట్లు వెల్లడించింది. కాగా.. 2023-24 ఆర్థిక సంవత్సరంలో భారత ఫార్మారంగ విలువ రూ.4.62 లక్షల కోట్ల(50 బిలియన్ డాలర్లు)కు చేరుకున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఔషధాల తయారీలో ప్రపంచంలోనే భారత్ 14వ స్థానంలో.. మార్కెట్ విలువల 3వ స్థానంలో ఉన్నట్లు వెల్లడించింది.

నల్లగొండ నుంచే పునర్నిర్మాణం : కూనంనేని

» నేడు నల్లగొండలో పార్టీ రాష్ట్ర బహిరంగ సభ

నల్లగొండ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): "పోరాటాల గడ్డ నల్లగొండ నుంచే కమ్యూనిస్టు పార్టీ పునర్నిర్మాణం ప్రారంభిస్తాం. సోమవారం జరిగే పార్టీ రాష్ట్ర బహిరంగసభలో సమాజంలోని వివిధ వర్గాలు, సమస్యలపై పోరాటాల కోసం క్యాలెండర్ ప్రకటిస్తాం" అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. సీపీఐ శతవసంతాల ఉత్సవాల్లో భాగంగా సోమవారం నల్లగొండలో నిర్వహించే పార్టీ బహిరంగసభ ఏర్పాట్ల పరిశీలనకు ఆదివారం వచ్చిన ఆయన.. పార్టీ జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. పార్టీకి మొదటి నుంచి బలమైన నేపథ్యం కలిగిన నల్లగొండ జిల్లాలో మొదటి రాష్ట్ర బహిరంగ సభను నిర్వహిస్తున్నామని, సభకు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు.

చిన్నపిల్లల్లో మధుమేహంతో జాగ్రత్త

» హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కే శరత్ సూచన

» 'డయాబెటిక్ అండ్ యూ' ఆధ్వర్యంలో చిన్నారులకు ఔషధాల పంపిణీ

మోతీనగర్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): చిన్నపిల్లల్లో వచ్చే మధుమేహం విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, వైద్యుల సలహాలను తప్పనిసరిగా పాటించాలని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కే శరత్ సూచించారు. మధుమేహంతో బాధపడుతున్న చిన్నారుల కోసం డయాబెటిక్ అండ్ యూ సొసైటీ ఆధ్వర్యంలో హైదరాబాద్, మాదాపూర్‌లోని క్యాప్‌స్టన్ డయాబెటిక్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరానికి జస్టిస్ శరత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మధుమేహంతో బాధపడుతున్న చిన్నారులతో ప్రత్యేకంగా మాట్లాడారు. మధుమేహం వల్ల పిల్లలకు ఎదురయ్యే పరిస్థితులను తల్లిదండ్రులు, వైద్యులతో మాట్లాడి తెలుసుకున్నారు. మధుమేహంతో బాధపడే చిన్నారులకు ఔషధాలు, వైద్య పరికరాలను ఉచితంగా అందిస్తున్న డయాబెటిక్ అండ్ యూ సొసైటీ సేవలను ప్రశంసించారు. మధుమేహంతో బాధపడుతున్న పిల్లలకు సొసైటీ సమకూర్చిన మందులు, గ్లూకోమీటర్లను అందజేశారు. అనంతరం డయాబెటిక్ అండ్ యూ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ వసంత్ కుమార్ మాట్లాడుతూ.. మధుమేహంతో బాధపడుతున్న చిన్నారులకు తమ సంస్థ ద్వారా 20 ఏళ్లుగా సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొడాలి శ్రీకాంత్, కృష్ణా విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి వీ వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.



మధుమేహ బాధిత చిన్నారులు, వారి కుటుంబసభ్యులతో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శరత్

బెనిఫిట్ లేదా పుష్పా!

(మొదటిపేజీ తరువాయి)



ధరల పెంపునకు, బెనిఫిట్ షోలు వేసుకోవడానికి ప్రభుత్వం అనుమతులు ఇవ్వడంతో బాక్సాఫీసు దగ్గర పుష్ప రాజ్ పంట పండిందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. తొలి రోజే ఈ చిత్రానికి ప్రపంచవ్యాప్తంగా రూ.294 కోట్ల వసూళ్లు రాగా.. అందులో మెజారిటీ వాటా బెనిఫిట్ షోల ద్వారా వచ్చిందే. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో సింగిల్ స్క్రీన్లు, మల్టీప్లెక్స్‌లు కలిపి సుమారు 1300 స్క్రీన్లు ఉండగా, వెయ్యి స్క్రీన్లలో 'పుష్ప 2' చిత్రం విడుదల యింది. దాదాపు 800 స్క్రీన్లలో బెనిఫిట్ షోలను ప్రదర్శించినట్లు తెలుస్తోంది. తెలంగాణలో మూడు, ఏపీలో మల్టీప్లెక్స్‌ల్లో మూడు, సింగిల్ స్క్రీన్లలో రెండు బెనిఫిట్ షోలకు ప్రభుత్వాలు అనుమతించాయి. సగటున ప్రతి స్క్రీన్‌లోనూ రెండు షోల చొప్పున లెక్క వేసినా రెండు తెలుగు రాష్ట్రాల్లో కలిపి సుమారు 1600 వరకూ బెనిఫిట్ షోలు పడినట్లు! తెలంగాణలో టికెట్ ధరపై రూ.800 వరకూ పెంచుకునే వీలు కల్పించారు. దీంతో బెనిఫిట్ షోలకు టికెట్ ధరలు సింగిల్ స్క్రీన్లలో సుమారు రూ.1000, మల్టీప్లెక్స్‌ల్లో రూ.1200 వరకూ పలికాయి. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం టికెట్ ధరను రూ.800గా నిర్ణయించారు. అలాగే.. మన దగ్గర 500 నుంచి 1500 దాకా రకరకాల సీటింగ్ సామర్థ్యం ఉన్న థియేటర్లున్నాయి. తక్కువలో తక్కువ ఒక్కో 'షో'కూ ఐదొందల టికెట్లు చొప్పున తెగాయనుకున్నా.. రూ. 5 లక్షల ఆదాయం వచ్చినట్టే. అంటే మొత్తం 1600 బెనిఫిట్ షోలకు కలిపి రూ. 80 కోట్ల వరకూ ఆదాయం వచ్చినట్లు ట్రేడ్ వర్గాల అంచనా.

ఆ తర్వాతా..

బెనిఫిట్ షోలతో పాటు అదనపు ఆటలు, టికెట్ ధరల పెంపునకు సైతం తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలు అనుమతించాయి. తెలంగాణలో మొదటి నాలుగు రోజులూ టికెట్ ధరపై రూ.150, ఆ తర్వాత ఎనిమిది రోజుల పాటు రూ.105, మరో ఏడు రోజులూ రూ.20 అధికంగా వసూలు చేసుకునే వీలు కల్పించింది. మల్టీప్లెక్స్‌ల్లో రూ.200, రూ.150, రూ.50 పెంపునకు అనుమతిచ్చింది. ఏపీ ప్రభుత్వం సింగిల్ స్క్రీన్లలో టికెట్ ధరపై లోయర్ క్లాస్‌కు రూ.100, అప్పర్‌క్లాస్‌కు రూ.150 వరకూ పెంచుకునే అవకాశం ఇచ్చింది. మల్టీప్లెక్స్‌ల్లో రూ.200 పెంపునకు అవకాశం ఇచ్చింది. ఏపీలో 13 రోజుల పాటు ఈ ధరలు అమల్లో ఉన్నాయి. ఈ పెంపు వల్ల 'పుష్ప 2'కు రెండువారాల్లో అదనంగా లభించిన వసూళ్లు రూ. 140 కోట్ల వరకూ ఉంటాయని ట్రేడ్ విశ్లేషకుల అంచనా. అదెలాగంటే.. రోజుకు నాలుగు ఆటల చొప్పున వెయ్యి స్క్రీన్లలో నాలుగు వేల షోలు. గరిష్ఠంగా రూ.200 కనిష్ఠంగా రూ. 20 వరకూ అదనపు ధరల పెంపునకు ప్రభుత్వాలు అనుమతి ఇచ్చాయి. కాబట్టి సగటున రూ.50 పెంపును ప్రాతిపదికగా తీసుకున్నా ఒక స్క్రీన్‌లో షోకు 500 టికెట్లు తెగితే అదనంగా రూ.25 వేలు ఆదాయం వస్తుంది. అంటే నాలుగు షోల మీద రూ. 1 లక్ష అవుతుంది. ఆ చొప్పున వెయ్యి స్క్రీన్లలో కలిపి రోజుకు రూ.10 కోట్లు చొప్పున రెండు వారాల్లో రూ.140 కోట్లు వసూళ్లు అదనంగా దక్కాయని విశ్లేషకులు చెబుతున్నారు.

ఆ వసూళ్లు అదనం

రేట్ల పెంపుతోపాటు.. అదనపు షోలకూ ప్రభుత్వాలు అనుమతులు ఇచ్చాయి. సగటున రోజుకు ఒక అదనపు షో చొప్పున తీసుకున్నా వెయ్యి స్క్రీన్లలో వెయ్యి షోలు. టికెట్ ధరలు రూ.300 నుంచి రూ.500 వరకూ పలికాయి. సగటున రూ.300 టికెట్‌ను పరిగణలోకి తీసుకున్నా షోకు 500 టికెట్లు చొప్పున అమ్ముడయ్యాయనుకుంటే రూ.లక్షన్నర ఆదాయం. అంటే విడుదలైన వెయ్యి స్క్రీన్లలో రోజుకు రూ.15 కోట్ల ఆదాయం వస్తుంది. గురువారం నుంచి ఆదివారం వరకూ నాలుగు రోజుల పాటు రోజుకు ఒక అదనపు షో నడిచినా రూ.60 కోట్ల ఆదాయం వచ్చినట్టే! అంటే.. టికెట్ ధరల పెంపుతో రూ.140 కోట్లు, బెనిఫిట్ షోల రూపంలో రూ.80 కోట్లు, అదనపు షోల వల్ల రూ.60 కోట్ల చొప్పున మొత్తం కలిపి రెండు వారాల్లో రూ.280 కోట్లు అదనంగా కొల్లగొట్టినట్లే అనేది ట్రేడ్ వర్గాల మాట.

సంక్రాంతి వసూళ్లకు దెబ్బే

ఈ ఏడాది 'పుష్ప 2, దేవర 1, గుంటూరు కారం, కల్కి 2898 ఏడీ' లాంటి పలు పెద్ద చిత్రాలకు బెనిఫిట్ షోలు, టికెట్ ధరల పెంపునకు ప్రభుత్వం అనుమతులిచ్చింది. అయితే బెనిఫిట్ షోలు, టికెట్ ధరల పెంపుపై పునరాలోచన లేదని ముఖ్యమంత్రి తేల్చిచెప్పిన నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రభావం టాలీవుడ్‌పై ఎలా ఉండబోతోంది అనే చర్చ నడుస్తోంది. సంక్రాంతికి విడుదలయ్యే సినిమాలకు ప్రభుత్వ నిర్ణయం పెద్ద దెబ్బే. శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ కథానాయకుడిగా నటించిన 'గేమ్‌చేంజర్', వెంకటేశ్ హీరోగా నటించిన 'సంక్రాంతికి వస్తున్నాం', బాలకృష్ణ హీరోగా నటించిన 'డాకూ మహరాజ్' చిత్రాలు సంక్రాంతి బరిలో ఉన్నాయి. భారీ బడ్జెట్‌తో రూపొందిన ఈ చిత్రాలకూ 'పుష్ప 2'కు దక్కినట్లే అన్ని అనుమతులూ దక్కుతాయని చిత్రబృందాలు భావించాయి. కానీ.. ప్రభుత్వ నిర్ణయంతో ప్రత్యేక ప్రదర్శనలు, బెనిఫిట్‌షోలు లేకపోవడం వల్ల ఈ సినిమాల వసూళ్లు తీవ్రంగా దెబ్బతింటాయనీ, నిర్మాతలకు భారీ నష్టాలు తప్పవని విశ్లేషకులు చెబుతున్నారు. ఎందుకంటే.. కళ్లు చెదిరే కలెక్షన్లకు టికెట్ ధరల పెంపు, బెనిఫిట్ షోలు ఉపయోగపడుతున్నాయి. అట్టర్‌ఫ్లాప్ సినిమాల టికెట్లు సైతం కొన్నిసార్లు అధిక ధరలకు అమ్మి మొదట్లోనే సొమ్ము చేసేసుకుంటున్నారు. సర్కారు నిర్ణయంతో ఇకపై ఇవేవీ కుదరవు. రెగ్యులర్ షోలతోనే పెద్ద సినిమాలు రిలీజ్ అయితే వాటి ఆదాయానికి భారీగా గండిపడినట్లే. ఓపెనింగ్స్‌తో రికార్డులు క్రియేట్ చేయాలనే స్టార్ హీరోలకూ ఈ పరిణామం ఇబ్బందికరమే. పారితోషికం అమాంతం పెంచుతున్న హీరోలు ఈ పరిణామాలతో కాస్త నెమ్మదించే అవకాశం ఉంది.

సర్కారు నిర్ణయంతో థియేటర్లకు మంచి రోజులు

బెనిఫిట్ షోలకు ప్రభుత్వం అనుమతులు నిరాకరించడాన్ని ఎగ్జిబిటర్స్ అసోసియేషన్, థియేటర్స్ యాజమాన్యాలు స్వాగతిస్తున్నాయి. వాటి వల్ల థియేటర్ల యజమానులకు ఒక్కపైసా అదనపు ఆదాయం లేదని వారు వాపోతున్నారు. రోజుకు ఐదు, ఆరు, ఏడు షోలు వేయడం వల్ల అదనంగా ఎవరికైనా ఉపాధి లభించిందా? అనే ప్రశ్న వారి నుంచి వినిపిస్తోంది. నిజానికి.. బెనిఫిట్ షోల విషయంలో నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్ల వైఖరిపై అసంతృప్తితో ఉన్న ఎగ్జిబిటర్లు ఈ ఏడాది మేలోనే వాటిని రద్దు చేస్తున్నట్లు ప్రకటించినా, తర్వాత వెనక్కు తగ్గారు. మల్టీప్లెక్స్‌లకు ఇస్తున్నట్టే తమకు కూడా పర్సంటేజీ విధానం ఇవ్వాలని నిర్మాతల మండలిని డిమాండ్ చేసినా, కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు 'పుష్ప 2' విషయంలో మరోసారి ఈ అంశం చర్చకొచ్చింది. టికెట్ ధరలు తగ్గి, బెనిఫిట్ షోలు బంద్ చేస్తే థియేటర్లకు లాంగ్ రన్ వచ్చి పరోక్షంగా తమకు లాభం కలుగుతుందని ఎగ్జిబిటర్లు చెబుతున్నారు. ఒక వారంలో రూ.15లక్షల వసూళ్లు వస్తాయనుకుంటే ఒక్క బెనిఫిట్ షో ద్వారానే రూ.7లక్షల వరకూ లాగేస్తున్నారనీ, దీని ప్రభావం మిగతా ఆటలపై పడి కొన్ని రోజులు థియేటర్‌ను మూసేయాల్సి వస్తోందని.. ఫలితంగా తాము అద్దెను కోల్పోతున్నామని వారు చెబుతున్నారు. హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ థియేటర్‌లో పెద్ద హీరో సినిమాకు బెనిఫిట్ షో వేస్తే రూ.13 లక్షల వసూళ్లు వచ్చాయి. కానీ థియేటర్ యజమానికి మాత్రం ఒప్పందం ప్రకారం ఆటకు రూ.20 వేలు చొప్పున కిరాయి మాత్రమే దక్కింది. మిగిలిన సొమ్మంతా డిస్ట్రిబ్యూటర్లు, నిర్మాతల చేతికి వెళ్లింది. వసూళ్లు పడిపోతే మాత్రం ఆ మేరకు థియేటర్ యజమానికిచ్చే అద్దెని కూడా తగ్గిస్తున్నారు.

ప్రాఫిట్ షో కాదు

సినిమా విడుదలైన కొన్ని వారాల వరకూ టికెట్ ధరల పెంపు విధానం అమల్లో ఉండడం వల్ల సాధారణ ధరతో సినిమా చూడాలనుకునే ప్రేక్షకులు వేచి చూడాల్సి వస్తోంది. గతంలో బెనిఫిట్ షో అనేది ప్రాఫిట్ షో కాదు. ఎంపిక చేసిన కొన్ని సినిమాలకు మాత్రమే బెనిఫిట్ షోలకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చేది. అలా వచ్చిన వసూళ్లను ప్రజోపయోగ కార్యక్రమాలకు ఉపయోగించేవారు. కానీ ఇప్పుడు బెనిఫిట్ షో సంస్కృతి మారిందని.. వచ్చిన సొమ్మంతా నిర్మాతలు, హీరోల జేబుల్లోకి పోతోందని.. ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఒక కుటుంబం బెనిఫిట్ షోకు వెళితే రూ.5-10వేల వరకూ ఖర్చు అవుతోంది. సినిమా ఫ్లాప్ అని జనాలకు తెలిసేలోపు డబ్బులు గుంజేయడానికి ఈ విధానం అక్కరకొస్తోంది తప్ప.. ప్రేక్షకులకు, అభిమానులకు ఏం ఉపయోగం ఉండట్లేదు!!

బలుపు కాదు వాపే

టాలీవుడ్‌లో గతంలో వారం రోజులకు వచ్చే వసూళ్లు కాస్తా ఇప్పుడు మూడు రోజులకే వస్తున్నాయంటే అది బలుపు కాదు వాపు మాత్రమే అని ట్రేడ్ వర్గాలు అంటున్నాయి. "రూ.175ఉండాల్సిన ధరను కాస్తా.. సర్కారు నుంచి తెచ్చుకున్న అనుమతులతో రూ.1129 చేశారు. బెనిఫిట్ షోలో ఒక్క టికెట్‌కు పెట్టే ఖర్చుతో మామూలు రోజుల్లో ఆరుసార్లు సినిమా చూడొచ్చు" అని ఆ వర్గాలవారు పేర్కొంటున్నారు. రూ.100 ఉండాల్సిన టికెట్‌ను రూ.300 చేయడం వల్ల రూ.100 కోట్ల వసూళ్లు రావాల్సిన చోట రూ.300 కోట్లు వస్తున్నాయంటున్నారు. భారీ వసూళ్లకు ఇవన్నీ కారణాలని.. ఇది పేద జనాలను, అభిమానులను దోచుకోవడం కాక మరేమిటి? అని ప్రశ్నిస్తున్నారు. బెనిఫిట్ షో టికెట్ ధర రూ.1000 ఉంటే కొందరు నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు తమ ఆఫీసుల ద్వారా బ్లాక్‌లో అదే టికెట్‌ను రూ.3వేలకు అమ్ముతున్న అనైతిక విధానాల గురించి వారు ప్రస్తావిస్తున్నారు. తొక్కిసలాటలో చనిపోయిన రేవతి కుటుంబం సైతం 'పుష్ప 2' చూసేందుకు బ్లాక్‌లో 3 టికెట్లను రూ.12వేల కు కొన్న సంగతి తెలిసిందే. ఈ దోపిడీ ఇలాగే కొనసాగితే మున్ముందు చిత్ర పరిశ్రమ ఇబ్బందులను ఎదుర్కోవాల్సి ఉంటుందని ట్రేడ్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అయితే.. నిర్మాతలు మాత్రం అంతర్జాతీయ స్థాయి సినిమాలు తీయాలంటే భారీగా ఖర్చు పెట్టాలని.. అదనపు షోలు లేకపోతే తిరిగి రాబట్టుకోలేమని అంటున్నారు.

'మైత్రీ' ఆధీనంలోనే 'సంధ్య'?

సీపీ షోకాజ్ నోటీసుకు యాజమాన్యం స్పందన

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): తొక్కిసలాట ఘటన జరిగిన డిసెంబరు 4వ తేదీతోపాటు 5వ తేదీ కూడా తమ థియేటర్ మైత్రీ మూవీ మేకర్స్ ఆధీనంలోనే ఉందని సంధ్య థియేటర్ యాజమాన్యం తెలిపింది. ఆ రోజు థియేటర్ సిబ్బంది 80 మంది విధుల్లో ఉన్నారని వెల్లడించింది. తొక్కిసలాట ఘటన నేపథ్యంలో 'మీ థియేటర్ లైసెన్స్ ఎందుకు రద్దు చేయకూడదు?' చెప్పండి అంటూ హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ జారీ చేసిన షోకాజ్ నోటీసుకు సంధ్య యాజమాన్యం ఈ మేరకు వివరణ ఇచ్చినట్టు సమాచారం. సినిమా విడుదల సందర్భంగా గతంలో అనేక సందర్భాల్లో సినిమా హీరోలు తమ థియేటర్‌కు వచ్చారని ఆ వివరణలో పేర్కొన్నట్టు సమాచారం. అలాగే, వాహనాల పార్కింగ్‌కు తమ థియేటర్‌లో ప్రత్యేక సౌకర్యం ఉందని సంధ్య యాజమాన్యం తెలియజేసింది. కాగా, ప్రస్తుతం సెలవులో ఉన్న సీపీ సీవీ ఆనంద్ మంగళవారం తిరిగి విధుల్లో చేరనున్నారు. ఆ తర్వాతే సంధ్య యాజమాన్యం ఇచ్చిన వివరణపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

మురిసిన పుస్తకం

» హైదరాబాద్ పుస్తక ప్రదర్శన ముగింపు సభలో పాల్గొన్న జస్టిస్ రాధారాణి

» శాశ్వత భవన నిర్మాణానికి సహకరిస్తానన్న ఎమ్మెల్సీ కోదండరాం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు29 (ఆంధ్రజ్యోతి): 'ఈ కాలంలో పుస్తకాలు చదివేదెవ్వరు.?' అన్నమాటలను పుస్తక మహోత్సవం పటాపంచలు చేసింది. పుస్తకాల పండుగకు అమితాదరణ లభించింది. దోమల్‌గూడ, ఎన్టీఆర్ స్టేడియంలో 11రోజుల పాటు సాగిన 37వ హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శన ఆదివారంతో ముగిసింది. 13 లక్షలమందికిపైగా ఈ ఏడాది పుస్తక మహోత్సవానికి వచ్చినట్లు సొసైటీ అధ్యక్షుడు కవి యాకూబ్ చెప్పారు. అందులోనూ 35 ఏళ్లలోపు వారు అధిక సంఖ్యలో ఉండడం విశేషం. బుక్ ఫెయిర్ ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్ హాజరుకావడం, గ్రూప్-2 పరీక్షలు ముగియడంతో యువతకు కాస్త విరామం లభించడం, యువ రచయితలు సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయడం తదితర కారణాలతో ఈ సారి యువత అధికసంఖ్యలో వచ్చారని కొందరు ప్రచురణకర్తలు విశ్లేషిస్తున్నారు. ఈ ఏడాది 20నుంచి 30శాతం సేల్స్ పెరిగాయి.

పుస్తకాలతోనే సామాజిక మార్పు

బుక్ ఫెయిర్ ముగింపు సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి. రాధారాణి మాట్లాడుతూ... తుపాకుల ద్వారా సాధ్యం కాని సామాజిక మార్పును పుస్తకాల ద్వారా తీసుకురాగలమన్నారు. భావ విప్లవానికి ప్రధాన ప్రేరణ పుస్తక పఠనమని, ఆలోచనలను విస్తృతం చేయడంలోనూ దాని పాత్ర ప్రముఖమైనది అని అన్నారు. బీఆర్ అంబేడ్కర్, ఎంఎన్ రాయ్ లాంటి మహనీయులంతా పుస్తక పఠనం ద్వారానే వారి జీవితాల్లో అత్యున్నత శిఖరాలు అధిరోహించారని, చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు. మరో వక్త ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లో చాలామంది పుస్తకాలు చదవడం మంచి పరిణామమన్నారు. బుక్ ఫెయిర్‌కు శాశ్వత భవనం ఏర్పాటుకు ప్రభుత్వ సహకారం అందేలా తనవంతు ప్రయత్నిస్తానని హామీఇచ్చారు.




పుస్తక ప్రదర్శన ముగింపు సభలో పాల్గొన్న జస్టిస్ రాధారాణిని సన్మానిస్తున్న నిర్వాహకులు

గొర్రెపాటికి తుది వీడ్కోలు

» అంతిమయాత్ర.. అనంతరం మృతదేహాన్ని వైద్య కళాశాలకు అప్పగించిన కుటుంబం

» మండవ, వివిధ సంఘాల నేతల నివాళి

సుభాష్ నగర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మానవ హక్కుల ఉద్యమ నేత గొర్రెపాటి మాధవరావు అంతిమ యాత్ర ఆదివారం జరిగింది. నిజామాబాద్‌లోని సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ జిల్లా కార్యాలయం ఎన్ఆర్ భవన్ నుంచి ప్రధాన వీధుల గుండా వైద్య కళాశాల వరకు కొనసాగింది. అనంతరం కుటుంబ సభ్యులు ఆయన మృతదేహాన్ని విద్యార్థుల పరిశోధనార్థం వైద్య కళాశాలకు అప్పగించారు. అంతిమయాత్రలో సీపీఐఎంఎల్, మానవ హక్కుల వేదిక, వామపక్షాల నాయకులు పాల్గొని గొర్రెపాటికి తుది వీడ్కోలు పలికారు. తొలుత ఎన్ఆర్ భవన్‌లో సంతాప సభ నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ అణచివేతకు గురైన వారి గొంతుకగా గొర్రెపాటి నిలిచారన్నారు. ఆయన భౌతికకాయాన్ని మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. మానవ హక్కుల కోసం గొర్రెపాటి నాలుగు దశాబ్దాల పాటు అలుపెరగని పోరాటం చేశారన్నారు. సీపీఐఎంఎల్ కేంద్ర కమిటీ సభ్యులు వెంకటరామయ్య, రాష్ట్ర కార్యదర్శి పోటు సూర్యం, మానవ హక్కుల వేదిక ఉమ్మడి తెలుగు రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యుడు వీఎస్ కృష్ణ, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు భుజంగరావు, తిరుపతయ్య, వీ ప్రభాకర్, రామకృష్ణ, వీ కృష్ణ, దేవరాం తదితరులు పాల్గొన్నారు.



గొర్రెపాటి మాధవరావు అంతిమయాత్రలో పాల్గొన్న మానవ హక్కుల వేదిక, సీపీఐఎంఎల్ కార్యకర్తలు

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar, Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.